వేదాంత గ్రంథాలు

Sl.No. 630

# ధర్మప్రకాశిక.

# DHARMA PRAKASIKA

*Or*

*Light to right Conduct*

*By*

*N. A. Narasimha Acharya, B. A. L. T.*
*Headmaster*
*Govt. H. E. Training School,*
*Narasarowpet.*

29 NOV 1921

Sl no. 630
no 6754.

*Rajya Rama Press, Narasarowpet.*

1921.

*Copy right*] [*As.* 12.

# ధర్మప్రకాశిక.

## అభిప్రాయములు.

ఆర్యమహాశయా! తాము పంపిన తమయొక్క ధర్మప్రకాశిక అను పొత్తమును, స్థాలీపులాకన్యాయమునఁ జూచితిని. ఇయ్యది, ప్రసిద్ధములగు పురాణములలోని సత్కథలలోని ధర్మసారము చే నిండి, భరతఖండవాసులగు నాంధ్ర విద్యార్థుల కెంతయు, ధర్మోపదేశకమయి, మాతృభాషాభివర్ధకమయి, వ్యాసరచనానుకూలమయి, మృదుమధురమగు వచనశైలిచేఁ బ్రకాశించుచున్నది. మఱియు నాంధ్ర పురాణములలోని పద్యములచ్చటచ్చట కలిగి, వానిలోని విషయమే, వచనరూపమున వ్రాయఁబడియుంటచే, ఒక్క పద్యమును జ్ఞప్తిలోనుంచికొన్నచో, బాలునకుఁ గథయంతయుఁ బూర్తిగ జ్ఞప్తిలోనుండి, వ్యాసమును వ్రాయుట కెంతయును యుక్తమనుటకు నిస్సంశయము. కావున, ఆంధ్ర భాషాదూరులగు ప్రకృతకాలపు స్కూలుఫైనలువిద్యార్థులకు సైతము, పఠనీయవచన గ్రంథముగ శ్రీప్రభుత్వము వారు ఇట్టిగ్రంథముల నంగీకరించినచో, ఆంధ్రదేశమునకు బహూపకారమని నానిశ్చయాభిప్రాయము.

28–10–1921

ఇట్లు, సుజనవిధేయుఁడు
కాశీకృష్ణాచార్యులు
శతావధాని,
సంస్కృతప్రధానోపాధ్యాయుఁడు
టౌ౯ హైస్కూలు
గుంటూరు.

# ధర్మప్రకాశిక

29 NOV

ఇది

సెకండరీస్కూలు 4, 5, 6 ఫారములకును,

ట్రైనింగుస్కూళ్లకును, ఉపయోగ

పడునట్లుగా

నర్సారావుపేట హైయ్యరుగ్రేడు ట్రైనింగుస్కూలు

హెడ్డుమాస్టరుగారు

యన్. ఏ. నరసింహాచార్యులు

బి. ఏ. యల్. టి

గారిచే రచింపబడినది.

మొదటికూర్పు

రాజ్యరమా ప్రెస్,

నర్సరావుపేట.

1921.

కాపీరైట్టు] [వెల 12 అణాలు.

# పీఠిక.

బాలురకు నీతివిద్య నేర్పుటకు కథలెంత ప్రయోజనకరము లని తలంచి యెల్లదేశముల నయ్యయి దేశభాషల నీతికథాపుస్తకములు వ్రాయుచుండుట యెంతయు నుచితమైన విషయమని మనకుఁ దెలిసినదియే. ధర్మములును నీతులును కథాసందర్భములను బట్టి యే విస్పష్టమై మనంబున నాటునుగాని, ప్రత్యేకముగా వానిం గూర్చి ప్రసంగించుటచే నవి సుబోధము గాకుండుటయేగాక, వానిననుష్ఠానమునకుఁ దెచ్చుట మిక్కిలి యరిదియై యుండును.

మనదేశములో మిక్కిలి ప్రసిద్ధికెక్కిన పూర్వరాజుల చరిత్రములను గురించినవి స్వతముగా దెలుపు రామాయణ మహాభారతాది గ్రంథములలో ననేక విధములైన ధర్మములును నీతులును నేర్పఁదగినట్టి కథలు, చరిత్రములు, ఉపాఖ్యానములు, సంవాదములు మొదలైనవి విశేషముగాఁ గలవు. వేయేల? నీతిమార్గోపదేశమునకును, బహువిధధర్మప్రవృత్తి ప్రకారనిర్ణయమునకును రామాయణ భారత భాగవతాదులవంటి గ్రంథములు ప్రపంచములో నేదేశమునందును లేవని మనము నిష్కర్షగా నుడువవచ్చును.

మహాత్ములగు నన్నయాది సత్కవులు పైనచెప్పినగ్రంథముల ననువదించి, యాంధ్రజనులకు మహోపకారము గావించియున్నారు గాని, ప్రస్తుతము దేశమున నాంగ్లేయభాషావ్యాపకత్వ ప్రభావము చేతను, కేవలమైహిక సుఖైకప్రధానమైన పాశ్చాత్యనాగరికతాసంపర్కము చేతను, విద్యార్థులగు బాలురకు నాంధ్రభాషాజ్ఞానమును, భాషపై యాదరమును, పురాణేతిహాసములందుఁ బరిచయమును విశేషముగాఁ దగ్గిపోవుచుండుటను జూడ, మిక్కిలి శోచనీయమై యున్నది. దేశముయొక్క పూర్వస్థితియు, పూర్వరాజవర్యుల చరిత్రమును, పూర్వాచారపద్ధతులును, పూర్వులాచరించి చూపిన జాతీయమైన ధర్మక్రమములును, ఆర్యోత్తములనఁదగు నుత్తమ స్త్రీపురుషు లేయే వేళల

యుం దేయవిధముగాఁ గర్మాచరణము చేసిరేనియు బాలురకుఁ దెలిపిన ప్పుడే వారు పెద్దవారైనప్పుడు తమజాతీయగుణములను ధర్మములను వదలక పూర్వులవలె ధర్మపరులై యున్నతికెక్కుటకుఁ బ్రయత్నము చేయఁగలరు. అప్పుడే నిజముగ దేశోన్నతికిఁ గారణమేర్పడును.

స్వజాతీయగుణ ధర్మజ్ఞానయును, ధర్మాధర్మవివేకస్ఫురణమును గల్గుటకు "శ్రుతిమూలన శ్రోత్రియులకు" ననుకీర్తిగాఁ బురాణేతిహాస పానశక్తి గనుల మాఖ్యమై యున్నవిగనుక, వానిలోనుండి కొన్ని సారతరములైన కథలను చరిత్రములను సులభశైలితో సంగ్రహించి వ్రాసి కూర్చి "ధర్మప్రకాశిక" యను పేరిట పుస్తకము విద్యార్థులైన బాలురకీయ్యుపయుక్తముఁ జేసితిని. అందందు శ్లోకాంతరములైనవియు వ్యుత్పత్తిగల్గినవియు, నవశ్యముగా జ్ఞాపకముంచుకొనుటకు దగినట్టివియు నైన పద్యములు కొన్ని నను సందర్భముల కనుగుణముగాఁ జేర్చియున్నాను.

బాలబాలికలీపుస్తకమును జదువుటచేఁ బలుతెఱంగులయిన ధర్మవిశేషము తెలుసుకొనుటయేగాక యాంధ్రభాషాజ్ఞానమును భాషపై నభిరుచియునుగల్గి పెద్దవారైనప్పుడు, మంచి రచనలయందుఁ బ్రీతిగల్గి స్వయముగా భారతాది సద్గ్రంథములను జదివి యైహికాముష్మిక సుఖములను బొందఁగలరని నమ్ముచున్నాను.

ఇందలి కథలు సనాతనములైన యార్యుల ధర్మవిశేషములను విస్తారముగాఁ దెల్పునట్టివి కనుక యియ్యవి సర్వమతస్థులకు సమ్మతమైయుండునట్టివి యేయని నేను వేఱుగాఁ జెప్పనక్కఱలేదు. ఆర్యధర్మోపాసకులైన మహనీయులీపుస్తకమును బాలబాలికలచేఁ జదివించి నాయుద్యమమును సఫలంబు జేయుదురుగాక,

నరసరావుపేట }
12-11-1920 }

యన్. ఎ. నరసింహాచార్యులు.

Head Master, Government Higher Elementary Training School, Narasaraopet.

# ధర్మప్రకాశిక.

విషయసూచిక. పుట.


I ముఖ్యములైన ఆర్య ధర్మము లెవ్వి?

(1) యమధర్మరాజునకు సావిత్రి యార్యధర్మము లిట్టివి యని యెఱిఁగించుట. 1

(2) ధర్మవ్యాధుఁడు కౌశికునకుఁ జెప్పిన శిష్టాచారములు. 3

(3) సత్యమునకంటె మించిన ధర్మము లేదని శకుంతల దుష్యంతున కెఱిఁగించుట. 5

(4) శరణాగతరక్షణము శ్రేష్ఠమైన ధర్మమని భీష్ముఁడు ధర్మరాజున కెఱిఁగించుట. 9

(5) పరోపకారమే పరమ ధర్మమని శివుఁడు పార్వతీదేవికి బోధించుట. 12

(6) "అహింసా పరమో ధర్మః" మాంసభక్షణవిషయమై భీష్ముఁడును ధర్మరాజును సంభాషించుట. 14

(7) న్యాయము తప్పకుండుటయే ధర్మములలోఁ బెద్దది విదుర ధృతరాష్ట్రుల సంవాదము. 17

(8) ఇంద్రియనిగ్రహము ధర్మములలో నుత్తమమైనదని ధర్మవ్యాధుఁడు కౌశికునకుఁ జెప్పుట. 21

(9) భగవంతుని భక్తితో నాశ్రయించుటయే పరమ ధర్మము నారదపుండరీక సంవాదము. 24

(10) అన్నిధర్మములు త్తమములైనవని భీష్ముఁడు ధర్మరాజునకుఁ జెప్పుట. భృగుడను విప్రుని చరిత్రము. 26

II సామాన్యపురుష ధర్మములు.

(1) గురుభక్తి విశేషము. ఏకలవ్యుని కథ. 32

(2) సత్సహవాసము, వ్యాసమహర్షి ధృతరాష్ట్రునకు 34

దుర్యోధనుని విషయముగాఁ జెప్పినపలుకులు. పుట.
(3) పితృవాక్య పరిపాలనము. రామ పరశురామ
పూరుల చరిత్రము:—
(1) రాముఁడు వనమునకు బోవుట. 35
(2) పరశురాముఁడు తండ్రి మాటలు విని తల్లిం జంపి
మరల దానిం బ్రతికించుట. 37
(3) పూరుఁడు రాజ్యమును సంపాదించిన విధము. 38
(4) పట్టుదల. భగీరథుఁడు గంగను దెచ్చినకథ. 40
(5) బ్రహ్మచర్యము. అష్టావక్రుఁడను మునికుమారుని
చరిత్రము. 43
(6) ధైర్యము. మూడువిధములు. 46
(7) దానము.
(1) దానముయొక్క మేలిమి,—వేదవ్యాస మహాముని
ముద్గలునిచరిత్రమును ధర్మరాజునకెఱిఁగించుట. 48
(2) దానపాత్రవిషయమై భీష్ముఁడు ధర్మరాజునకు
జెప్పిన విషయములు. 51
(8) సంతుష్టి లేక తృప్తి, వామనుడు బలిచక్రవర్తితో
సంభాషించుట. 53
(9) కీర్తిప్రియత్వము. ఇంద్రద్యుమ్న మహారాజు చరిత్రము 56
(10) ఆశ్రితపోషణము.
(1) శిబియను రాజర్షి చరిత్రము. 58
(2) ధర్మరాజు గంధర్వులచేఁ జెఱగొనబడిన
దుర్యోధనాదుల విడిపించుట. 61
(11) ఆశ్రితుల ధర్మము. భీష్ముడు ధర్మరాజునకునాశ్ర
యంబు విడువరాదని చెప్పుట. 65
(12) మానుషప్రయత్నమవశ్యమైనది:—

[1] ద్రౌపదీ ధర్మరాజుల సంవాదము. 67
[2] భీష్ముఁడు ధర్మరాజునకు దైవమానుషంబుల తెఱఁగెఱిఁగించుట 69
(13) హింసాహింసల స్వరూపము. ఉమామహేశ్వర సంవాదము. 70
(14) సాహసము కూడదు:—
[1] భీరుసేనునకు హనుమంతుఁడుపదేశమిచ్చినవిషయము. 73
[2] చిరకారియను మునికుమారుని చరిత్రము. 76
(15) అసూయ చెడ్డది. వ్యాఘ్రగోమాయువుల సంవాదము 78
(16) మిత్రద్రోహము మహాపాతకము:—
[1] కర్ణుఁడు శ్రీకృష్ణమూర్తితోఁ సంభాషించుట. 81
[2] నాళీజంఘుని చరిత్రము. 83
(17) వాక్పారుష్యము కూడదు:—
[1] హంసరూపధరుఁడైన బ్రహ్మదేవుఁడు సాధ్యుల కుపదేశించిన ధర్మప్రకారము. 86
[2] ధర్మరాజు శిశుపాలునకుపదేశించిన విధము. 88
(18) ఆడినమాటను దప్పరాదు:—
[1] బలిచక్రవర్తి శుక్రునివచనంబులాక్షేపించి వామనునకు భూదానమిచ్చుట. 91
[2] కర్ణుఁడు దేవేంద్రునకుఁదనకవచకుండలములిచ్చుట. 93
[3] భీష్ముఁడు తనవ్రతంబు విడువననితల్లితోఁ జెప్పుట. 96
(19) పగతుర నమ్మరాదు:—
[1] శ్రీకృష్ణమూర్తి దుర్యోధనునియింటఁగుడువనొల్లననుట. 99
[2] బ్రహ్మదత్తుఁడను రాజుతోఁ పూజనియను శారికకైనసంవాదము. 102

(20) కామక్రోధాదులను విడువవలయును:— పుట.

[1] ప్రహ్లాదుఁడు తండ్రికిఁ జెప్పిన వాక్యములు. 104

[2] పతివ్రత కౌశికునకు హితోపదేశము చేసినవిధము. 106

[3] కోపము చెడ్డదని శమీక మహాముని తనకొడుకునకు బోధించుట. 109

[4] దుర్మదంబుచే నహుషుఁడు చెడినవిధము. 111

III స్త్రీల ధర్మములు:—

[1] స్త్రీలకు భర్తలయందుగల స్నేహము బలవంతమైనది. హిడింబ భీమసేనునిఁ గూడుట. 113

[2] స్త్రీలకు భర్తపలుకులు మీఱకుండుటయే పరమ ధర్మము. ఓఘవతి చరిత్రము, 116

[3] భార్యాభర్తల స్వరూపము. 120

[4] స్త్రీలకు పతిభక్తియే పరమభూషణము. 121

[5] ద్రౌపదిసత్యభామకుఁ జెప్పిన పతివ్రతాధర్మములు. 123

[6] పార్వతి శివునకుఁ బతివ్రతాధర్మము లెఱింగించుట. 128

IV నివృత్తిధర్మములు:—

జ్ఞానభక్తి వైరాగ్యముల విశేషము.

[1] మేధావియను బ్రాహ్మణకుమారుఁడు తండ్రితోఁ జేసిన సంవాదము. 131

[2] మోక్షమనఁగా నేమి? అది యెట్లులభించును? 133

[3] భగవద్భక్తియే మోక్షోపాయములలో శ్రేష్ఠమైనదని ప్రహ్లాదుఁడు రాక్షసకుమారులకుఁ జెప్పుట. 136

[4] వేదవ్యాసుఁడు శుకునకుపదేశించిన విరక్తిమార్గము. 138

[5] పరాశరముని జనకమహారాజునకు జ్ఞానోపదేశము చేసిన విధము. 140

# ధర్మప్రకాశిక.

## I ముఖ్యములైన ఆర్య ధర్మములెవ్వి?

[1] యమధర్మరాజునకు సావిత్రి యార్యధర్మములిట్టివియని యెఱిఁగించుట.

పూర్వము మద్రదేశాధీశ్వరుఁడైన అశ్వపతియను రాజకూతురు సావిత్రియనునది, తన భర్తయగు సత్యవంతునితో నొక్క నాడు సమిత్కుశఫలాదులు తెచ్చుటకై వనంబునకుఁ బయలు వెడలెను. తన పురుషునకా దినమున మరణము సంభవించునని ముందుగా నారద మహామునిచే నెఱిఁగినదగుటచే, నా పతివ్రతాతిలకము సత్యవంతునకేమి యాపదగలుగునోయని మిక్కిలి జాగ్రతతో నుండెను. సత్యవంతుఁడు వనంబులోని మధురములైన ఫలములుగోయుచు, గంపనిండించి దానినొక్క చోట బెట్టి, చేతిగొడ్డలిచేఁ గాష్ఠఖండనంబును జేయుచుండెను. అందుచేనతఁ డత్యంతశ్రమను జెందినవాఁడై నిట్టూర్పులు నిగుడ భార్యంగనుంగొని, "అంగనామణీ! నాశరీరము స్వాధీనము తప్పియున్నది. మనము దూలి పోవుచున్నది. తలనొప్పియధికమైయున్నది. నిలువలేను నీతొడలపైఁ గొంతసేపు శయనించెద," నని దానియంకతలంబున శయనించియొడలు మఱచి నిద్రించిన వానివలెనుండెను.

అప్పుడు సావిత్రి తనయెదుట రక్తలోచనుండును, నీలదేహుండును, ఘోరాకారుఁడును పాశహస్తుఁడును నగుదివ్యపురుషుఁడొక్కఁడు సత్వరంబుగా వచ్చుటను జూచి, భయపడి చేతులు మోడ్చుకొని, "అయ్యా! నీవెవ్వఁడవు ఏమికారణంబున నెయ్యది సేయం దలంచి యిందులకు వచ్చితి" యనిన నాతఁడిట్లనియెను. "అమ్మా! నే

ను సమస్తప్రాణిరాసుల ప్రాణంబులహరించు యముండను. నీపాతి వ్రత్య మహిమచే నీవునన్నుఁ గంటివి. ఇతరులకుఁ గనబడువాఁడను గాను. నేటితో నీపురుషునకాయువుతీరెను. అతిడుపుణ్యపురుషుఁ డగుటచే వానింగొనిపోవ నాభటులనంపక, నేనేస్వయముగా వచ్చితిని" అని చెప్పుచు, తనచేతి పాశములచే సత్యవంతుని ప్రాణంబునీడ్చి అంగుష్ఠరూపముననున్న వానింబట్టికొని దక్షిణదిక్కు మొగమై వెడలెను.

సావిత్రి తనప్రియుని మృతశరీరమును నొక్కచోట నునిచి, యమునివెంటఁబోవుచుండెను. దానింగనియముఁడు "తల్లీ!నీవేలవచ్చెదవు నిలువుము. ఇకమీఁది మార్గములు మనుష్యులు రాఁగూడనట్టివి"యనిన. సావిత్రియిట్లనియె. "ఆర్యవర్యా! భర్తలనువిడిచిపోవుట స్త్రీలకుధర్మముగాదు. నేనుపతిభక్తిగలదానను. నాథునివిడిచిపోవనొల్లను. పతియనుగమనంబె నాకిదిధర్మము. నాకుశరీరాయాసమించుకైయైన లేదు. నన్నడ్డగింపకుండుము. నీవుధర్మదేవతవు. నీవెఱుఁగనియార్యధర్మములు లేవు. ఐననుజెప్పెదన వధరింపుము. ఆర్యులగు మహాత్ములు. పరులకు హింస గావింపరు. ఆశ్రితులంబోషింతురు. దీనులపైఁగరుణఁజూపుదురు. ఇతరులాచరించు ధర్మమునకు విరోధముగావింపరు. అట్టిపుణ్యాత్ములైనవారిదర్శనంబుచేమాత్రము సకలపాపంబులుతొలఁగును. ఎల్ల మేలును గలుగును. సజ్జనులలో నెల్ల కడునధికుఁడగునిన్ను సందర్శించి, పరమ శుభంబులంబడయక నేను సామాన్యజనములవలె నూరక యెట్లుపోఁగలను. దేవోత్తమా! నాపైఁగరుణింపుము.

" ఎడపక వాఙ్మనఃక్రియల నేరికి హింసయొనర్పఁబూనరె
వ్వేదలను దీనులంగరుణనేర్పడఁబ్రోవఁగఁజాతురిచ్చుచో

గడమవడంగ నీకెదిరి కాంక్షితముల్ తుదిముట్టఁదీర్తురె
క్కడుముదిఁగూర్తురాశ్రితులకెల్ల వినుమిన్నియునార్యధర్మముల్"

అనియిట్లు బహుప్రకారంబుల నార్యధర్మములలో మేటియైనవానినెత్తిచెప్పి, ధర్మదేవతను స్తుతించి, సావిత్రి తనభర్తప్రాణంబులిమ్మని వేఁడుకొనఁగా, నమ్మహాపురుషుఁడు, సావిత్రియొక్క పతిభక్తికిని, ధర్మనిత్యతకును, చాతుర్యమునకును, సుగుణంబులకును మెచ్చి, కరుణించి, సత్యవంతుని పునర్జీవితునిగాఁ జేసియిచ్చుటయేగాక, యింతకుముందు సావిత్రి కోరినట్టివరంబులెల్ల నిచ్చి, తననివాసమునకుఁ జనియెను. అప్పతివ్రతయు సంతోషంబుతో భర్తను వెంటఁబెట్టుకొని యిల్లు చేరెను.

2 ధర్మవ్యాధుఁడు కౌశికునకుఁ జెప్పిన శిష్టాచారములు.

మిథిలానగరమున జితేంద్రియుఁడును, సత్యవాదియు, మాతాపితృభక్తుండును నైన ధర్మవ్యాధుఁడను కిరాతుఁడు వసించుచుండెను. అతఁడు హీనజాతిలోఁ జనించి మృగమాంసముల ను విక్రయించి జీవించువాఁడైనను, సకల ధర్మముల నెఱిఁగినవాఁడగుటచే, వానియొద్దకొక్కనాఁడు, కౌశికుండను పేరుఁగల బ్రాహ్మణుఁడువచ్చి "అయ్యా! నీవు ధర్మముల నెఱిఁగినవాఁడవనిజనులు చెప్పవిని, నీచేఁగొన్ని సందేహములు విశదముగాఁ దెలుసుకొనవలయుననివచ్చితిని, జీవహింస చేయుచుఁ బ్రతుకుట నీకు ధర్మమగునా? నీవుచేయు ఘోరకర్మమునకు నేను మిక్కిలి దుఃఖించుచున్నాను" అనియెను.

వానికా వేటకాఁడిట్లనియె "విప్రవరా! బ్రాహ్మణులకు

తపస్సును వేదాధ్యయనమును, రాజులకు దేశపాలనంబును, వైశ్యులకు వర్తక పశుపాలనాది కర్మములును. శూద్రులకు సేవయు, నిట్లు ధర్మములగునో యట్లె నాకు మృగమాంసోపజీవనము ధర్మమగును. వంశక్రమాగతమైన యట్టి కులధర్మమును విడుచుట యెవ్వరికిం దగదు. ఈదేశమును పాలించు జనకమహారాజు వర్ణాశ్రమధర్మములమీఱి నడచువారిని, దనపుత్రులనైనను దండించును. నాకులధర్మము హీనమైనను దాని నేవిడుచుట పాపకృత్యమగును. నేను హీనజాతిలో జనించిన వాఁడనయినను నావిధంబంతయు వినుము. నేను జంతువులఁ జంపను ఒరులు తెచ్చిన మాంసమును స్వల్పలాభమునకు నమ్మి తద్ధనముచే జీవింతును. నేను మాంసము నమలను. తల్లిదండ్రులను దైవముగాఁ గొనియాడి పూజింతును. సత్యంబు పలుకుదును. నను నేను పొగడుకొనను. పరులను నిందింపను. పరస్త్రీలఁ గోరను ఒరులసొత్తునకాసపడను. అయ్యా! నీవడుగుటం జేసి నా విషయమై యింత చెప్పవలసివచ్చెను. లోకములో మనుష్యులు శిష్టాచారము లెట్టివియని యెఱిఁగి యవ్విధముగా నడచుటయే శ్రేయస్కరము.

కౌశికుఁడతని చరిత్రకద్భుతంబంది "మహాత్మా! నీవు కర్మధర్మమూర్తివి. నీవిధంబెఱుఁగక పలికితి. శిష్టాచారంబు లెట్టివి? వాని నాకుఁ జెప్పు" మనియడుగ, ధర్మవ్యాధుఁడిట్లనియె "దానసత్యతపోయజ్ఞములను జేయుటయు, కామము, క్రోధము, లోభము, మొదలగు దుర్గుణంబుల వదలుటయు, గురువులను సేవించుటయు, వేదములం జదువుటయు, డాంబికత్వములేక తనకుదొరికిన ధనవస్తు సముదాయముచే సంతృ

స్తినొందుటయు, నాస్తికులు, దుర్జనులు మొదలగువారితోఁ జేరకుండుటయు, మితహితోక్తులను బలుకుటయు, ఆశ్రితులను మిత్రులను గాపాడుటయును, శిష్టజనుల చరితంబులని పెద్దలు చెప్పుదురు. శిష్టాచారంబుల నెఱిఁగినడుచువారలకు నంతఃకరణశుద్ధియు, విమలజ్ఞానంబును గలుగును. దానిచే వారు హింసావిదూరులై పుణ్యలోకంబులను బొందియానందింతురు”

కౌశికుఁడంత ధర్మవ్యాధుని యెడ సెలవు గైకొని తనపురంబునకుఁ బోయి, తల్లిదండ్రులకును గురువులకును శుశ్రూషను జేసి శిష్టాచారక్రమము తప్పక వర్తించుచు, కాలక్రమంబున పరమజ్ఞాన భరితుండై వెలుగుచుండెను.

---

### 3 సత్యమునకంటె మించిన ధర్మము లేదని శకుంతల దుష్యంతున కెఱింగించుట

పూర్వము కణ్వమహాముని యాశ్రమమున శకుంతల యను కన్యకామణి పెరుగుచుండెను. అదినిజముగా మునికన్య గాదు. రాజర్షులలో నుత్తముండైన విశ్వామిత్రునకును, దేవవేశ్యలలో నుత్తమురాలగు మేనకకును, జన్మించి శిశువుగా నుండునప్పుడే తల్లిదండ్రులచే విడువబడి, యొకనదీతీరమున బక్షులచేఁ గాపాడబడుచుండెను. కణ్వమహర్షి దానింజూచి యధికప్రీతితోఁ దనయాశ్రమంబునకుఁ దెచ్చి, శకుంతములచే రక్షింపబడుచుండినది కావున, శకుంతలయను పేరిడి దాని నత్యంత గౌరవంబుగా బెంచుటచే, నక్కన్యక కణ్వమహాముని కూతురయ్యెను. కొంతకాలమునకది రూపలావణ్యసౌందర్యాతిశయంబుల నొప్పుచు వివాహమునకు సిద్ధమైయుండెను.

ఇట్లుండఁగా నొక్కనాఁడు హస్తినాపురంబేలు దుష్యంతుఁడను రాజు, వేటాడుటయందు కోరికఁ గలవాఁడై, మునియాశ్రమమునకు సమీపముగా నుండు భూములలోఁ దిరుగుచు, బడలిక చెందినట్టి పిపాసాకులితుఁడై, కణ్వమహర్షి యాశ్రమంబున విశ్రమించి పోవఁదలంచి, యందుల కేతెంచెను. అప్పుడు మునియింటిలో లేచి శకుంతల రాజునకు నర్ఘ్యపాద్యంబులిచ్చి తినుటకు మధురంబులైన ఫలంబులొసగి "మహాప్రభూ! ఇప్పుడే తండ్రిగారు కాశంబులు దేవసవికిం బోయిరి. వారు వచ్చునతోడనే మీకుఁ దగిన మర్యాదలు సల్పుదురు కొంతసేపు కూర్చుండు" డనియె. దుష్యంతుఁడు సర్వాంగసుందరియైన యక్కన్యకం జూచి, దాని వినయంబునకును, మృదుమధురవాక్యంబులకును సంతోషించి, యది చెప్పఁగా దాని జన్మవృత్తాంతమంతయు నెఱింగి "తరుణీమణీ! నీవు కణ్వమహాముని కూఁతురుగా నుండుట నాకు ముందే తోఁచెను. ఇప్పుడు నీవు రాజకన్యకయగుట నీవనెఱింగించితి. నిన్ను నేను వివాహమాడుట కేమి యాటంకమున్నది? ఓ లతాంగీ! నీవు వనంబులో నుండనేల? నీ చక్కఁదనమునకీ నారచీరలును, మునిపల్లెలో వాసమును దగునా? నన్ను వివాహము చేసుకొని నాకు బట్టపుదేవివై యుండి నాతో రాజ్యసుఖము ననుభవింపు" మనియెను.

శకుంతల సిగ్గుపెంపునఁ దలవంచుకొని నీకు నాపైన ననురాగము గలదేని, తండ్రియగు కణ్వమహర్షి నడుగుమని చెప్పెను. రాజు, శకుంతల కప్పుడు క్షత్రియులకు గాంధర్వవివాహము ధర్మమనియు, దానికిఁ దల్లిదండ్రుల యనుమతి యక్కఱలేదనియు, వివరించి చెప్పి దాని నొడంబఱచి, దానికిం బ్రియంబుగా, నావలన నీకుదయించు పుత్రునకుఁ బట్టంబుగట్టెదనని చెప్పి, గాంధర్వవిధి

చొప్పనఁబెండిలియై "నాప్రాణనాయకీ! నీవుదుఃఖపడకుండుము. నాపురంబునకునిన్నుఁదోడ్కొని వచ్చుటకుమంత్రివర్గంబునుబంపించెద"నని చెప్పి తనపురంబునకుఁజనియెను.

అంతఁగొంతసేపటికిఁ గణ్వుడువిచ్చేసి లజ్జచేనాననంబు వాంచికొనియున్న కూతుంజూచి, తనదివ్యజ్ఞానదృష్టిచే సర్వంబు నెఱిఁగి "అమ్మా! నీకులగోత్రములకుఁదగిన పతిని నీవువరించితివి. దానికిఁదగినట్లు నీవు గర్భముగలిగియున్నది. సకలభూభారమును వహింపసమర్థుఁడైన కొడుకు నీగర్భంబులో నున్నవాఁడని చెప్పి, యెప్పటియట్లశకుంతలను మక్కువతోఁ బెంచుచుండెను.

కొంత కాలమునకు శకుంతలాదేవికి భరతుఁడను పుత్త్రుఁడుదయించెను. ఆబాలునకు జాతకర్మాది సంస్కారములు మునివరుండచేసెను బాలుఁడు దినదిన ప్రవర్ధమానుఁడగుచు సద్గుణములకెల్లనిధియైయుండి యాశ్రమవాసులకెల్ల సంతోషముగలుగఁజేయువాఁడయ్యెను.

ఇట్లుండనొక్కనాడు కణ్వమునివరుఁడు కూతుంజూచి "తల్లీ పుట్టినయింటిలో విశేషకాలము స్త్రీలుండరాదు. నీపుత్త్రునిందోడ్కొని నీపతికడకు బోవలయును. నీవెంటశిష్యులంగొందఱనంపెద. ప్రయాణమగు"మని చెప్పి,శిష్యులతో దానిననిచి పుచ్చెను.

శకుంతల దౌష్యంతినిదోడ్కొని, సకలమంత్రిపురోహితప్రధాన పౌరజన పరివృతుఁడై యున్న దుష్యంతుం గనుంగొని,గురునాశ్రమమునందామున్ను పతివలనగనిన యాదరణమును,గరుణయు, ననురాగంబును గానక,శంకించి దుఃఖితయై, తన మనస్సులో "అయ్యో!యీరాజు నన్నుమఱచెనో? లేక యెఱిగియున

న్నాశ్రయింప దలచెనో?, యనివిచారించి యాతనితోనిట్లనియె “జగన్నాథా! వేటనెపమునఁగణ్వాశ్రమమునకువచ్చినాకిచ్చినవరములందలంపవలయు. బాలార్కతేజుఁడైన యిబ్బాలుఁడు నీకొడుకసుమ్ము వీనిని యువరాజుగానభిషేకమొనరింపుము”.

రాజామాటలువిని యేమియు నెఱుగనివానివలె, “ ఓ నెఱుఁగనిన్ను, నీవెక్కడిదానవు? ఏలయనుచితంబులాడెదు? త్వరగానిందుండి వెడలిపొమ్ము,, అనికోపంబుతోఁ గన్నెఱ్ఱజేసుకొనిపలికెను. శకుంతలకప్పుడు కోపంబును శోకంబును నొక్కటగలుగ, కొంతసేపు ఱిచ్చపడి యుండి, తనకుదానయుపశమించుకొని, మహారాజుం జూచి, ,,నాథా! నన్నోరు తెఱుఁగకుండ గాంధర్వవిధిం బెండ్లియై యిప్పుడు నీవెవ్వరిదానవోయనుట నీకుధర్మమగునా? మనుష్యులెంతరహస్యముగా నొక్కకార్యమునుజేసినను దానికి దినంబును, రాత్రియును పంచమహాభూతములును, సూర్యచంద్రాదులును, సాక్షులైయుందురుగదా”

చ॥ విమలయశోనిధీపురుష వృత్తమెఱుఁగుచునుండుజూవె వే
దములునుబంచభూతములుధర్మువుసంధ్యయునంతరాత్మయున్
యముఁడునుజంద్రసూర్యులునహంబును రాత్రియునన్మహాపదా
ర్థములివియుండఁగానరుడు దక్కన నేర్చునెతప్పు ముచ్చిలన్॥

కావున నోరు తెఱుఁగరని తలఁచుట మూఢత్వమగును. అదియునుంగాక, ప్రజాపతియు గుణవతియు ననువ్రతియు నైనభార్యనువదలుటపతికిధర్మముకాదు. సద్గుణంబులకెల్ల పెన్నిధియైయున్న యిక్కుమారుని పైనీకాగ్రహమేల? నాదుకణ్వాశ్రమమునఁ గొడుకునకుఁ బట్టంబుగట్టెదనని నుడివి, నేడు సత్యమార్గము నుండితొలగవచ్చునా? అయ్యో! “సత్యంనాస్తి పరోధర్మః” యుం

దురు. అశ్వమేధయాగములు వేయు చేయుటయును సర్వతీర్థంబులను సేవించుటయును, సర్వవేదంబులం జదువుటయును సత్యమునకుసరిగావని పెద్దలుచెప్పుదురు. ధర్మజ్ఞులైనమునులు ధర్మములకెల్ల సత్యంబ పెద్దయందురు.

చ॥ నుతజలపూరితంబులగు నూతులు నూఱిటికంటె సూనృత
వ్రత మొకబావిమేలు, మఱిబావులు నూఱిటికంటె నొక్కస
త్క్రతువది మేలు, తత్క్రతుశతంబునకంటె సుతుండు మేలు,త
త్సుతశతకంబుకంటె నొకసూనృతవాక్యము మేలుచూడఁగన్॥

కావున నాథా! సత్యమార్గము తప్పరాదు. నాపైఁగరుణింపుము. నీకొడుకు నెత్తికొని గారవింపుము." అనియెను.

దుష్యంతుండు మఱియు మూర్ఖుండై శకుంతలను స్త్రీలసత్యవాదినులని దూషించి పొమ్మనఁగా, నప్పుడాకాశవాణి సభాసదులెల్లవిన, శకుంతలయొక్క పల్కులు నిజమని తెలియఁజెప్పెను. దుష్యంతుఁడప్పుడు సభ్యులంజూచి తానుముందు లోకాపవాదభీతిచే శకుంతలను నెఱుఁగనని చెప్పితినని నుడివి, భార్యను పరమప్రీతితో నాదరించి భరతునకు యువరాజ్యపట్టాభిషేకము గావించెను.

——:O:——

### 4 శరణాగత రక్షణము శ్రేష్ఠమైనధర్మమని భీష్ముడు ధర్మరాజునకెఱింగించుట.

పాపాత్ముఁడగుబోయయొక్కఁడు పక్షులవధియించి, తినియు వానినమ్మికొనియు జీవించుచుండెను. ఒకనాఁడతఁడు తగినసాధనములతోఁ బక్షులం బట్టుటకై మహారణ్యమార్గముగాఁ బోవు

చుండఁగాఁ జెనువానతోఁ గూడినగాలి భయంకరముగా వీచెను. దానికతఁడు భయపడి, యొకమఱ్ఱిచెట్టుక్రింద చలిచే వణకుచుఁ గూరుండియుండెను. రాత్రియగుటచే నెందును గదలనేరక యాకలిచే బాధపడుచున్నయానరాధముఁడు, చెట్టువంకఁ జూచి, "ఇందలిభూతముల నాశ్రయించెదను. చలినుండి నన్నెవ్వరైన గాపాడరా?" యనిభక్తితోఁ బలికెను.

అప్పుడమ్మహీరుహంబు కోటరంబులోఁ వసించు కపోతమొక్కటి తనభార్య మేఁతకుఁబోయిరాక తడయుటకు శోకించి, "అయ్యో! నాప్రియురాలింక రామికి కారణమేమి? ఏమయ్యెనో? ఈవానలోఁజిక్కి మృతినొందెనో" యని విచారించుచుండ, నబ్బోయవలలో నంతకుముందు చిక్కువడిన యాడుపావురము, భర్తకుఁదన దురవస్థనెఱిగించి చింతింపవలదనియు, విధిబలవంతమైనదనియు, బోయశత్రువైనను, వాఁడు శరణంబువేడినవాఁడు కనుక వానిముందుగా రక్షింపవలయుననియు హితోపదేశముచేసెను.

మగపావురమప్పుడు లుబ్ధకుంజూచి, "అన్నా! నీవుడస్సియున్నావు. మాయింటికతిథివైవచ్చితివి. నీయిష్టమెఱిఁగింపుము. నీకాతిథ్యము చేయకుండుట ధర్మమగునా," యనెను. బోయతానప్పుడు దుస్సహశీతార్తుఁడై యుండుటను జెప్పఁగాఁ నావిహంగము రయంబుగానచ్చటి పుల్లలెల్లముక్కునఁగొనివచ్చి, సమీపమునందు పల్లియలోనుండి కొఱవియొక్కటి తెచ్చి, పుల్లపోగును మండునట్లుచేసి, బోయను నిప్పులో మేనుఁగాచికొనుటకు తెమ్మని చెప్పెను. అప్పుడువాఁడు గువ్వనంతోషించి తన్నుఁజూచుచుండఁగా నొడలుకాచికొని చలిబాధతొలఁగునట్లు చేసుకొనె

ను. అంత వానికాఁకలియగుటయుఁ దనకాహారము తెచ్చిపెట్టుమని పక్షినివేఁడెను, అది చేయనుపాయమెఱుఁగక ఖగమప్పుడు వగచి బోయతో, "అయ్యా! పక్షులైన మాకుఁబ్రదుకన నొక్కటి కలదా? ఏమిదొరకినను దానిభుజించిమాయాఁకలిఁదీర్చుకొందుము. మనుష్యులకట్లు చేయవచ్చునా? నీవుడస్సియున్నావు. నీకాతిథ్యము చేయవలయును. నాశరీరంబును నీకాహారమైయిచ్చెద" ననియన్నివలగొని దానిలోఁబడిచచ్చెను.

దానిఁజూచి బోయ విస్మయమును విషాదమునుగదుర " ఆహా! ఈపులుఁగిట్లు నాకై తన శరీరమిచ్చునా! ఏమి దీని ధర్మచింత! మహాపాపాత్ముఁడనియు, శత్రువనియు, నెంచక, వంచనలేక తనమేను నాకొరగానిచ్చెనుగదా! ఈపక్షి నాకు గురువై జ్ఞానోపదేశము చేసెను ఇంక నేను నాక్రూరచరిత్రము విడిచి వర్తించెద" ననిమనంబున వైరాగ్యమును శాంతియును బొడమ, వలలోనున్న పక్షులనెల్ల విడిచి, తనచేతనున్న పక్షిహింసాధనములనెల్లనందే పడవైచి, యచ్చోటును బాసిపోయెను.

అంతనా కపోతి పతిమరణమునకు వగచి తాను ననలమునుజొచ్చి మృతినొంది భర్తంగలిసెను. దివ్యరత్నఖచితమైన విమానమునెక్కి కపోతంబును గపోతియు, దివ్యరూపములుధరియించి దేవతాపరివేష్టులై పోవుచుండుటను జూచి, పుణ్యవర్తనుఁడైన బోయయప్పుడాశ్చర్యపడి, తానునట్లగుదుననుచు నొక్కచోట దవానలంబు దరిసి వనమెల్లముట్టి కాల్చుచుండఁగా, నాయనలంబులోఁజొచ్చి, యొడలుదొరఁగి దేవత్వంబు నొందెను.

కావున "ధర్మనందనా! శరణాగత రక్షణముయొక్క

మేలిమినిజూచితివా? శరణు సొచ్చినవారిని రక్షింపకుండుట కంటెఁ బాపమొండులేదు. అప్పాపమునకుఁ బ్రాయశ్చిత్తము లేదు”

క॥ శరణంబనివచ్చిన భీ
కరశత్రువునైనఁ బ్రీతిఁగావఁగవలయున్
కరుణాపరులకెఱింగిది
ఋరవృగసగిగావ్రదివికేధర్మంబుల్॥

---

## 5. పరోపకారమే పరమధర్మమని శివుఁడు పార్వతీదేవికి బోధించుట.

తొల్లి దేవతలును, రాక్షసులును, అమృతము సంపాదించుటకై మందరపర్వతమును గవ్వముగాఁజేసి, వాసుకి యను పామును దారముగా నుపయోగించి పాలసముద్రమును మథించుటకారంభించిరి. ఆనగమును సముద్రములో మునుఁగకుండునట్లు విష్ణుదేవుడు కూర్మరూపుడై జలములోనుండి తనవీపునఁ బట్టియెత్తెను. రాక్షసులు తలవైపును, దేవతలు తోఁకవైపును వాసుకింబట్టి, ప్రమోదంబున భూధరంబును క్షీరవార్ధిలో గిరగిరం దిరుగునట్లు చేయఁగా, నప్పుడు దైవయోగంబున హాలాహలమను పేరుగల విషము జనించెను. ఆవిషాగ్నిచేఁ గొందఱు దేవదానవులు మాడిసిరి. కొందఱు భయపడి పాఱిపోయిరి. అంతేకాక లోకములకెల్లను మహోపద్రవంబు గలిగెను.

అప్పుడు కొందఱు నిలింపులు గుంపులై కూడి బ్రహ్మదేవుని యొద్దకుఁబోయి మొఱలిడఁగా, నాచతుర్ముఖదేవుఁడు వా

రలందోడ్కొని మహాదేవుండైన పరమ శివుని సమ్ముఖమునకుం బోయి, లోకంబులకైన యుపద్రవంబును విన్నవించి, విషంబు వలనిబాధతొలంగు నుపాయంబు జేయవలయునని ప్రార్థించెను. మహాదేవుండప్పుడు తనప్రియసతియైన పార్వతిం జూచి," మగువా! జగములకైన కష్టమును జూచితివా? విషము వేడిమిచే జగములెల్ల చాచాచరమైన ప్రాణి జాతముతో నాశమగుచున్నవట నేను ప్రభువై యుండి లోకరక్షణము చేయకుండుటధర్మమగునా? పరహితము సేయుటకంటెను ధర్మమింకొకటి శ్రేష్ఠమైనది కలదా?

క॥ ప్రాణేచ్ఛ నచ్చి వొచ్చిన
ప్రాణులరక్షింపవలయుం బ్రభువులకెల్లన్
బ్రాణులకిత్తురు సాధులు
ప్రాణంబులు నిమిష భంగురములని మగువా॥

క॥ పరహితము సేయునెవ్వండు
పరమ హితుండగును భూతపంచకమునకున్
బరహితమె పరమ ధర్మము
పరహితునకు నెదురు లేదు పర్వేందుముఖీ॥

కావున నీహాలాహల విషమును శిక్షించి దానిభక్షించిలోకముల రక్షించెద." ననిపలికిన ప్రాణవల్లభునకు వల్లభ "దేవా! మీచిత్తంబు కొలది చేయవచ్చు"ననియెను. ఆహా! ఏమిపార్వతి యొక్క పరోపకారబుద్ధి? భుజించువాడు ప్రాణేశ్వరుండనియు, భుజించునట్టిది యుగ్రానలజ్వాలాకరాళమైన గరళమనియుం దలంపక, పరోపకారమును, లోకరక్షణమును ముఖ్యముగానెంచి పార్వతి తనభర్త విషమును మ్రింగుట కొడంబడెను.

పరమశివుఁడప్పుడు దేవతలెల్ల భయజయధ్వానంబులిడ, గంభీరముగాఁ బాలకడలిసమీపించి, పోకుపోకుమని విషమును జేతఁబట్టి, తెమల్చి, కూర్చి, దానిముద్దగాఁ జేసి మ్రింగి, తనకంఠస్థలము ననిల్పెను. శివునికంఠమప్పుడు విసము వేఁడిమిచే నీలముగుటచే నాటంగోలె నతఁడు నీలకంఠుఁడు నాఁ బరఁగెను.

ఆ॥ హరుఁడు గళమునందు హాలాహలము పెట్ట
కప్పుఁగలిగి తొడవు కరణి నొప్పె
సాధురక్షణంబు సజ్జనులకు నెల్ల
భూషణంబుగాదె భూవరేంద్ర.

అంత దేవతలును దానవులును శివుని మహోపకారమునకు మెచ్చి పాలకడలిఁ ద్రచ్చి యమృతము మొదలగు మేలైన వస్తువులంబడసిరి.

౬ అహింసా పరమోధర్మః మాంస భక్షణవిషయమై
భీష్ముఁడును ధర్మరాజును సంభాషించుట.

భీష్ముఁడు ధర్మరాజునకు ధర్మోపదేశము చేయుచుండఁగా, నహింసాస్వరూపమిట్టిదియని యెఱుఁగ వేఁడి ధర్మరాజిట్లని ప్రశ్నించెను "అయ్యా! లోకములో మునివర్యులును బ్రాహ్మణముఖ్యులును దేవతలును ధర్మములలో నెల్ల యహింస మిక్కిలి పెద్ద యని చెప్పుచుందురు. దానివిధమంతయు నాకువిశదముగా జెప్పవలయును."

గంగా తనూజుండైన భీష్ముఁ డిట్లనియెను "ధర్మనందనా! వినుము. అహింస యనునది ధర్మములకెల్లమేటియైనది. ఏనుఁగు యొక్కయడుగులోఁదక్కిన జంతువులయడుగులడఁగునట్లు, ధర్మ

ములన్నియు నహింసకు లోనగుచుండును. అహింసయనఁగాఁ బరులనొంపమియనియర్థము, హింసగలుగఁజేయుటకు మార్గములు నాలుగుగలవు. అవి మనస్సు, వాక్కు, కాయము, మాంసము దినుట. గోవుయొక్క నాల్గుపాదములలో నొక్కటి లోపమైననది కుంటుపడునట్లు, హింసకుఁగారణములైనయీనాల్గింటిలో నొక్కదానిచే హింసకావించినయెడల సద్ధర్మవర్తనము కుంటుపడును. ఒకరికిఁ జేటుగోరుటయు, నొకనిహింసింప దలఁచుటయు మనోరూపమైన హింసలు. తిట్టుట, పరుషంబుగాఁబల్కుట, యసత్యమును జెప్పుట మొదలైనవి వాగ్రూపములయిన హింసలు. ఇతరులసొమ్ము దొంగిలించుట, కొట్టుట, బాధించుటఁ బ్రాణులం జంపుట మొదలైనవి కాయముచేనడచుహింసలు. మాంసముతినఁగోరి జంతుమారణము చేయుట నాల్గవ విధమైన హింస, కావున బుద్ధిమంతులైనవారు మాంసము తినఁగోరరు. ప్రాణులదేహములోఁగాక, మఱియెచటను మాంసమున్నదాయనియు, ప్రాణులంజంపునపుడు తమమేనులకు దెబ్బసోఁకినట్లగునో వానికినట్లేకదాయనియు, మాంసముతినుటవిడిచినచో హింసమానదాయనియు విచారించి, యుత్తములు దయార్ద్రచిత్తులై మాంసభక్షణంబు మానుదురు"

ధర్మపుత్రుడమ్మాటలువిని మాంసము నములుటచేహింసయగుటనెఱిఁగియు నేలజనులు మాంసము వర్జించి యపూపాదులచేతను, ఫలపరిభృతులచేతను, దేహయాత్రచేయ నొల్లకున్నారనియడుగెను. భీష్ముఁడు దానికిట్లనియెను. "అయ్యా! అన్నిచవులలో మాంసము చవియెక్కువ. మాంసము చవిమరిగినవారికి దానిని విడుచుట, కష్టము. మాంసము తినుటచే దేహము

నకు బలముఁ గలుగును. శ్రమపడినవారికుల్లాసమగును. గాయము లు మొదలయినవి శీఘ్రకాలములో లోపితమగును. కృశించిన వానికిఁ బుష్టి వేగమై వచ్చును. ఇట్టివిశేషములు కూరగాయలచే నగునా? యనను నామతము వినుము.

ఆ॥ అన్యమాంసమునసిజాంగమాంసంబుఁబో
షించుకొనుటకంటెఁజెట్టలేదు
మాంసభక్షణంబుమానుటకంటెను
మేలు లేదుకర్మజాలకమున॥

ప్రాణభయంబనునది తనకుఁగలుగునట్లే సర్వభూతములకు నైజమనితలచి, దయార్ద్రచిత్తుడై మాంసము మానువారికిఁ బ్రహ్మలోకాదులాటపట్టగును. భూతంబులకలుగకుండుటయే పరమ ధర్మము. భూతములకు భయముకలుగకుండ వర్తించువానికి, భూతములచే భయమెన్నడును కలుగదు. భూతముల కలుగు వానికి భూతములవలనభయముకలుగును. కీడు చేసినవానికిఁ గీడయగుట సందేహమా? కావున ధర్మనందనా! నీవు భూతములయెడ దయగల్గివర్తింపుము. వానికభయమిమ్ము. ఇదియే యహింసా ప్రవర్తనము. నాల్గువిధంబులచేతను హింసగావింపని పుణ్యాత్ములు దేవతలకంటె నధికులగుదురు. అహింసావ్రత మనుష్ఠించిన వాఁడు సమస్తధర్మములనాచరించినవాఁడగును. వానికిఁ బొంద రాని మహోన్నతపదము లేదు.

ఆ॥ దానముతపంబుధర్మంబుయజ్ఞంబు
శౌచమంత్రతంత్రసత్యములును
బుధులహింసరూపములుగాఁగఁజెప్పట
యెల్లకల్గుసుమ్మహింసకలిమి॥

## 7 న్యాయము తప్పకుండుటయే ధర్మములలోఁ బెద్దది.

### విదుర ధృతరాష్ట్రుల సంవాదము.

పంచపాండవులు తాముచేసిన ప్రతిజ్ఞ చొప్పునఁ బండ్రెండేండ్లువనవాసమును, విరాటనగరములో నొక్క యేఁడజ్ఞాతవాసంమును సలిపి, దుర్మార్గులైనదుర్యోధనాదులతో నెట్లయిన సంధి చేసుకొని తమతండ్రిపాలు వడయుటకుఁ బ్రయత్నించిరి. పాపాత్ముఁడైన దుర్యోధనుఁడు తానుయుద్ధములోఁ బాండవులంగెల్తునని యు, వారికి రాజ్యభాగమియ్యకూడదనియు మూర్ఖుఁడై తలఁచెను. వానితండ్రియగుధృతరాష్ట్రుఁడంతకంటెనులోభగుణదూషితుఁడు. కొడుకు మాటలు వినుఁగాని పెద్దలగు భీష్మ ద్రోణాదులపల్కులు గైకొని, తమ్ముని కొడుకులైన పాండవులకురాజ్యభాగమిచ్చుటకు నొల్లఁడు. పాండవులు పరాక్రమవంతులని వారికివెఱచును. ధర్మరాజు మనసు చొప్పఁగయుటకై తనమంత్రియైన సంజయుని వారికడకుఁబంప, నాతఁడుపోయివచ్చి పాండవసభలోజరిగిన వృత్తాంతమంతయు రేపుచెప్పెదనని రాజునకెఱిఁగించి తనగృహమునకు బోయెను.

ధృతరాష్ట్రునకు మనసులో నెమ్మదికలుగలేదు. కంటికినిద్ర రాలేదు. తనతమ్ముఁడైన విదురునిఁబిలిపించియతనితో నేకాంతముగా నిట్లు సంభాషించెను.

ధృ:—తమ్ముఁడా! సంజయుడు నాయాజ్ఞచొప్పునఁ బాండురాజసుతులకడకుఁబోయివచ్చి, వారి విధంబంతయు రేపుచెప్పెదనని యింటికిఁబోయెను. నాకేమియుఁ దోచకున్నది. మనంబుకలఁక చెందియున్నది. నిద్రరాదు. నేనేమిచేయుదు. నామనస్తాపము దీర్పనీవు సమర్థుఁడగుటచేనిన్నుఁ బిలిపించితిని.

విదురుఁడు:- కౌరవ్యోత్తమా! నీకంటికి నిద్రరాని కారణంబేమి? బలవంతుఁడు దండెత్తివచ్చుచున్నాఁడనువార్తను విన్న బలహీనుఁడును, సొమ్ముపోఁగొట్టుకొనినవాఁడును, దొంగతనము చేయ నుద్యమించువాఁడును, స్త్రీలోలుఁడై తిరుగు కాముకుఁడును నిద్రలేక పరితపింతురు. నీకీకారణములలో నొక్కటికలిగినదికాబోలు? ఒరులసొమ్ముహరింపఁదలచితివా?

ధృ:- లేదుకాని, సంజయుఁడుపోయివచ్చెనుగదా, ధర్మరాజు మనసెట్లుండునో, యతఁడు మనపై నాగ్రహముజెందెనో, లేక నిందలివారిపై దయగలిగి వర్తించునో,యని సంశయము నాకుఁగలుగుచున్నది.

వి:- ధర్మనందనుఁడు నీకుఁబుత్త్రుఁడును, చెలికాఁడును, తగిన బాటునున్నె ప్రవర్తించును. అతనిదెసనొక్కకీడైననుగలుగదు. అతనికి నీవును నీకొడుకును నిష్కారణముగానపకారము చేసిరి. ధర్మరాజునీవుతండ్రియనినమ్మి సహించియున్నాఁడు. వానినిసగౌరవంబుగా నిందురప్పించి, రాజ్యభాగముపంచియిమ్ము, లేనియెడ నీకును నీకులంబునకును హానివాటిల్లును.

ధృ:- విదురా! ఇన్నిమాటలాడనేల? మనసంజయునివలన సకలకార్యములువిని యతనితోమనము చేయవలసిన దానిని నాలోచన చేయుదము. నీవునీతిమంతుఁడవు. నీవెఱుగనిధర్మము లేదు. నీనీతివాక్యములనామనస్తాపోపశమనముగావింపుము.

వి:- ధృతరాష్ట్రభూపతీ! నీవెఱ్ఱిఁగి యెఱ్ఱిఁగియేలనన్నదిగెదు? సకలజనులకు సమ్మతంబైనవిధముగా నడుచుటయేయుత్తమము. లోకనింద్యములైనకార్యములు చేయరాదు.

క॥ జనులకునోడబాటగువిధ

మనసడచుచు లోకనింద్యములనుడుగుచుధీ
జనరొుకసికలిమికులుకక
మనుజులతోఁబొందివాసఁగిమనుటొప్పునృపా!

సజ్జనులైనవారు కులవిద్యాధనంబులకు మదింపరు. అడఁకువగలిగి వర్తింతురు. బుద్ధిమంతులతోఁగార్యాలోచనలు సల్పుదురు. కోపము, గర్వము, దురాశ, దురభిమానము మొదలగుదుర్గుణముల వర్జించి, న్యాయముతప్పక ధనమునార్జించి దానిని సత్పాత్రములయందువినియోగము చేయుదురు. తగినవేషము నవలంభించుటయు, తన్నుఁదాఁబొగడకుండుటయు, నెట్టికష్టములువచ్చినను నీతిమార్గముతప్పక చరించుటయు, పరులుహింసించినను దానికిమాఱుసేయక సైరించుటయును మొదలగునవి, సత్ప్రవర్తనలలోఁగొప్పగానెంచఁబడును. ఇట్టిగుణంబులు ధర్మరాజునకుఁగలదు. నీపుత్రుఁడునీచుఁడు, దుర్మార్గుఁడు, పరులుచెప్పెడుబుద్ధులువినఁడు, వానిపల్కులువినక, పాండుకొడుకులకు రాజ్యభాగమిమ్ము. అదనీకు శ్రేయస్కరమగును.

ధృ:— తమ్ముఁడా! నీపల్కులఁగొంత కలంకతీరెను. నీవు ధర్మనందనుని చిత్త మెఱుఁగుదువు. హితమును గర్తవ్యమును ధర్మమును నెయ్యదియో దానినాకెఱిఁగింపుము.

వి:— అన్నా! నీమనస్సులోనుండుదానిని నన్నునొత్తి చెప్పుమనియెదవా? చెప్పెదవినుము. రాజ్యము నీకులభించెను గదాయనితలఁచి, నీతమ్మునిపుత్రులకుఁబాలునీయనొల్లకున్నావు. నీవేరాజ్యమంతయు మ్రింగ దలంచితివి. నీకోరిక నెరవేరదు. మత్స్యము మాంసముపైగలకోర్కెచే గాలమును మ్రింగును, పిమ్మటనదియే పట్టుపడి నశించును. నీవుచేయుకార్యమట్లే యున్నది.

పాండవులకుఁబుడమిపాలిచ్చి వారితో నీకొడుకులంగూడి మనునట్లుచేయుము. అన్నా! లోభమనునది చెడ్డగుణము. దానిచేఁ గల్గుహానియింతంతయనఁగాదు.

తే॥ "నియతితపమున నింద్రియనిగ్రహంబు
భూరివిద్యయు శాంతికిఁ గారణములు
వానియన్నింటికంటె మేలైన శాంతి
కారణము లోభముడుగుట కౌరవేంద్ర."

కావున నీవు లోభంబువిడిచి, వనవాసంబునం గుందిన కుంతీపుత్రులం దడయక పిల్చి, వారిపాలు వారికిచ్చి, వారలనిలుపుట నీకొడుకులనిలుపుటయగును.

ధృ:- తమ్ముడా! నీవచనంబులు నిర్మలములు నీతియుతములు. రాజనీతిబోధకములు. అయినను నేను నాపుత్రుల విడువను "ధర్మోజయతి" యనియుండువాఁడను.

వి:- అన్నా! ఏలయిట్లు పల్కెదవు? నీకుమారుల దెసధర్మ మించుకైనఁ గలదా? నిష్కారణముగా వారు పాండవులకు హానిగలుగఁజేసిరి. నీపుత్రులు గుణహీనులయినను వారినివిడువమంటినా? పాండవులవిడువ రాదంటిని. నీకుహితముగోరి చెప్పుచున్నాఁడని నాపల్కులు వినుము. నీతిమార్గముతప్పక నడచుటయే యుత్తమధర్మము "నీతిలేనివానినిందింతురులోకులు," న్యాయమార్గమవలంబించుటకంటె ధర్మమొక్కటిలేదు.

ఆ॥ సకలపుణ్యకర్మచయమునొకదెస
వినుము పాడితప్పకునికియొక్క
వలను దీనితుల్యతులు తెలిపెడునెడఁ బాడి
కలిమియందపెద్దగానుపించు॥

విన్నము పూర్వము ప్రహ్లాదుఁడను రాక్షసరాజ పుత్రుఁడు విరోచనుండును, అంగిరసుండను బ్రాహ్మణునికొడుకు సుధన్వుండును, దమదమప్రాణంబులు పన్నిదంబుగానొడ్డి, యొక్క ధర్మసందేహవిషయమై ప్రహ్లాదునడిగిన, నమ్మహీపతిపుత్రునియందలిపక్షపాతముచే నీతిమార్గమునుదప్పక, మధ్యస్థుడై తగవును జెప్పి, సుధన్వునిగెలిపించెను. అప్పుడుమృతినొందినపుత్రునిప్రాణంబులసిమ్మని ప్రహ్లాదుఁడు సుధన్వునింబ్రార్థింప, నద్దయాళుఁడు విరోచనునింబునర్జీవునిగాఁ జేసిచనియె. కావున నీవును న్యాయమార్గంబువిడువకుము. పాడితప్పకుండుటయే పరమధర్మము. పాడిగలిగిన నిహపరంబులు రెండునుగలుగును, కీర్తియున్నంతకాలముస్వర్గలోకానుభవముగలుగునని బుధులు చెప్పుదురు. కావునసీవుకీర్తిప్రియుండవై నీతిమార్గముతప్పక చరింపుము.

ఉ॥ నీతిపథంబునన్ బ్రతుక నేర్చుటయుత్తమభంగి, శౌర్యసం
జాతములై కరంబమరుసంపదలొందుటమధ్యవృత్తి,యు
స్ఫీతములైనభారవహజీవనముల్దలఁపంగనిష్టముల్,
నీతికి బాహ్యులైనధరణీవర యెత్తెరవారినుత్తముల్?

———:0:———

8 ఇంద్రియనిగ్రహముధర్మములలోనుత్తమమైన
దనిధర్మవ్యాధుడు కౌశికునకు జెప్పుట.

కౌశికుఁడుశిష్టాచారక్రమంబులెల్లవినిధర్మవ్యాధునింజూచి, "అయ్యా! ఇంద్రియంబులనఁనెవ్వి? వానినిగ్రహింపకున్నఁబాపమెట్లుతొడరును? వానినిగ్రహించుటచేఁగల్గుఫలమేమి? ఈవిషయములనాకెఱింగింపు" మనివేఁడుకొనఁగా నవ్విప్రవర్యునకుఁగిరాతుఁడిట్లనిచెప్పెను, "అయ్యా! నీవడిగినవిషయములుబ్రహ్మవి

కావునన్ ఓ ధరణీసురోత్తమా! నీవును సాధుసంగము చేసి, జితేంద్రియుఁడవు గమ్ము, ఎల్లకడలకుఁ బాఱు నింద్రియముల నిగ్రహించుటయే ధర్మములకెల్లఁ దుదియైన ధర్మము.

---

## 9 భగవంతుని భక్తితో నాశ్రయించుటయే పరమధర్మము. నారద పుండరీక సంవాదము.

భీష్ముఁడు సకలధర్మములు ధర్మరాజునకుఁ జెప్పఁగా విని, యుధిష్ఠిరుఁ డాతాతతో "అయ్యా! మనుష్యులకు శ్రేష్ఠమైనదియు నవశ్యంబుగాఁ గావింపఁదగినదియు నైన ధర్మమెయ్యది? దానినాకెఱిఁగించి నన్నుఁ గృతార్థునిగాఁ జేయవలయును" అని ప్రార్థించెను. కృపాభరితుఁడై భీష్మాచార్యుఁ డిట్లనియె. "ధర్మనందనా! వినుము; తొల్లి తీర్థయాత్రాపరుఁడును, జపతత్పరుఁడును నైన, పుండరీకుఁడను బ్రాహ్మణసత్తముఁడు, నారదమహామునిం జూచి, భక్తితోఁ బ్రణమిల్లి, నీవు నన్నడిగిన విధముగా నమ్మహామునినడుగ, నతం డతనికిట్లనియెను" ఓ భూసురోత్తమా! పరమాత్ముఁడైన నారాయణుఁడు పరబ్రహ్మంబనఁగను బరమాత్ముఁడనఁగను, బరతత్వంబనఁగను నీశ్వరుఁడనఁగను, విష్ణుఁడనఁగను బరగుచుండును. అతనివలననే భూతసృష్టిస్థితిసంహారములగుచున్నవి. అట్టినారాయణుని భక్తితో నెప్పుడు స్మరించుచు, నతనిశరణంబు వేఁడుట మనుష్యులకెల్ల ముఖ్యమైన కార్యము.

ఆ॥ సర్వశాస్త్రవాక్యసమితి నాలోకించి
మఱియుఁ బృథవిచా[illegible]హిమఁ దెలిసి
నిశ్చయింపఁబడియె నిష్ఠ నారాయణు
నెపుడుఁ దలఁపవలయు నిది యొకండు॥

కావున నీవు సకలవిధములైన శాస్త్రార్థములయందువా దంబులకుం జొరక, నారాయణపరాయణుండవై యతనిం దలంపుము. దాన సర్వశుభములు నుగలుగును. ఆదేవుండు భక్తసులభుండు. ఆశ్రితవాత్సల్యనిధియై వెలుంగు" నని యిట్లు నారదమహాముని యుపదేశింపగా, నా నైష్ఠికుండు నియతచిత్తుండై నారాయణస్మరణప్రభావంబునం గృతార్థుండయ్యెను. కావున, పాండునందనా! నీవును నతిభక్తితో విష్ణుని గొలువుము. దానిచేంబడయరాని పదమును, జెందరాని శుభమును లేదు.

ఈవిషయమునే శ్రీకృష్ణస్వామి భారతయుద్ధారంభమందు, పార్థునకుపదేశించెను. "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ, అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామిమాశుచ" దీనిభావమేమనగా, ఓపార్థ! నేనీకుపదేశించిన కర్మయోగజ్ఞానయోగభక్తియోగములనెడు మూండుమార్గములలో నీ కెయ్యది చేయ నిష్టమో దాని ఫలాపేక్ష లేక, యేవిధమైన సంగము లేక, కర్తనేననియు హంకారభావమును బొందక, పరమాత్మనైన నాయందు కర్తృత్వభావమారోపించి, నేనే పరంబుగను, ప్రాప్యంబుగను దలంచి, నన్ను శరణుపొందుము. అట్లుచేసితివేని నన్నుం బొందుటకడ్డమైయున్న పాపములన్నిటనుండి నిన్నుందప్పించెదను.

గీ॥ "క్రిందుకొను సర్వధర్మవికల్పములను
నెడలవిడిచి దృఢంబుగ నేనొకండ
శరణముగ నాశ్రయింపుము సకలదురిత
ములకుం దొలంగింతు నిన్నుం బ్రమోదమంద॥"

"కమలాక్షున్ శరణంబు వేండ నిజనుల్ కల్యాణసంయుక్తులే"

అనురీతిగా భగవంతుని శరణంబు వేఁడుటయే, పరమధర్మము. అదియే సర్వశ్రేయస్సులకును మూలము. నీవునట్లే చేయుము.

---

### 10 అన్నిధర్మంబులుత్తమములైనవని భీష్ముఁడు ధర్మరాజునకుఁ జెప్పుట. భృగుడను విప్రుని చరిత్రము.

భారతయుద్ధములో బంధువులనెల్లఁ గూల్చితినని దుఃఖించుచున్న ధర్మరాజునకుఁ జిత్తోపశమనముగావించుకొఱకు, బహువిధములైన ధర్మములు పితామహుండైన భీష్ముఁడు తెలుపఁగావిని, యారాజవర్యుఁడు దివ్యజ్ఞానసంపన్నుఁడైన పితామహుంజూచి "ఓమహానుభావా! అనేకవిధములైన ధర్మములు మీరు నాకెఱింగించితిరి. వానిలో నెల్ల మహోత్తమమైన ధర్మము నాకుపదేశింపుఁ" డని యడిగెను.

అప్పుడు భీష్ముడు "ధర్మనందనా! అనేకవిధములై విస్తరిల్లు ధర్మములలో నొక్కటియైనను నిరర్థకమైనదియు నిష్ఫలమైనదియు లేదు. అన్నియు సద్గతికిఁ గారణములే యగును. ఎవ్వరికే ధర్మముపైఁ గోర్కి కలదో దానినే పూని యాచరించుటచే వారికి శుభంబులు కలుగును. లోకములో మనుష్యులు తమకుఁ బోలిన ధర్మముల నాచరించి, దానిచే వెలుఁగుటను మనము చూడలేదా? అదియట్లుండనిమ్ము. పూర్వమొకప్పుడు నారదమహర్షి దేవేంద్రునెడకుఁ బోయిన, నతండతనికి సత్కారంబులాచరించి యుచితాసనంబుపై నునిచి, "మునివర్యా! నీవు భూలోకంబుననుండి వచ్చితివి కదా? అందేమియాశ్చర్యముకంటి" వనియడిగెను. దానికమ్మహర్షి యమ్మహేంద్రునకు భృగుండను బ్రా

హ్మణుని చరిత్రమును జెప్పఁదొడఁగెను. దానింజెప్పెదవినుము”

“ గంగానది దక్షిణ తీరమున మహాపద్మమను పట్టణంబుగలదు. అందుధర్మనిత్యుఁడును సత్యవ్రతుండును, అహింసాపరుఁడును, జితేంద్రియుఁడును నిజధర్మతత్పరుండును, క్రోధవర్జితుండునునైన భృగుండను బ్రాహ్మణవర్యుఁడొక్కఁడున్యాయసంపాదనముచే; దేవపూజలు, పితృకార్యములు,అతిథిసత్కారములుమొదలగు పుణ్యకర్మములు చేయుచు,పుత్రదారాసమన్వితుఁడై వసించుచుండెను. ఇట్లుండనొక్కనాఁడతనియింటికి బ్రాహ్మణశ్రేష్ఠుఁడొక్కఁడతిథియైవచ్చినఁ బరమభక్తితో నాతని కాతిథ్యమిచ్చి, యమ్మహాద్విజుంజూచి భృగుఁడిట్లని ప్రశ్నించెను. “అయ్యా నేను లోకసామాన్యమైన గుణకర్మములందుఁదగిలి, యుత్తమమైనధర్మమేదియో తెలియలేకున్నాను? అఖండమైన సుఖమెద్దానఁగలుగును? ఏదిధర్మములలో మిక్కిలిశ్రేష్ఠమైనది? దానినాకెఱిఁగించి నన్నుఁగృతార్థునిగాఁజేయుము”

అనియిట్లడిగిన యాగృహస్థునకభ్యాగతుండైన విప్రుండిట్లనియెను. “అయ్యా ధర్మమార్గంబులనేకములుగలవు. అవియెల్లనుమేలైనవి. కొందఱు బ్రహ్మచర్యవ్రతముచేతను,, కొందఱు భవ్యములైనగృహస్థధర్మములాచరించుటచేతను, మఱికొందఱు వనభూములనుండి తపస్సులు సల్పుటచేతను, కొందఱు దానాది పరోపకారకృత్యములాచరించుటచేతను. వేఱుకొందఱు భగవదర్పణమగునట్లుగాయజ్ఞయాగాదులుచేయుటవలనను నిత్యమైన సౌఖ్యమును బొందుదురు.

కం॥ జననీజనకారాధన
మునగురుభక్తియుసుస్మృతమునశాంతినిదాం
తినిసత్యమునవహింసను
వినుకాంక్షురుమోక్షపదమువేఱ్వేఱజనుల్॥

ఇట్లుజనులకైహికాముష్మిక సుఖంబులొందగూర్పంజాలు ధర్మములు బహుప్రకారములై యున్నను వానిచేనాత్మావలోకనంబను పరమానందము కలుగుట దుర్లభము. అయ్యా! నీవు నాబుద్ధివినుము. నైమిశారణ్యమున గోమతియను నదీతీరమున, పద్ముండను పేరుగల సర్పరాజున్నాడు. వాడుమహాధర్మనిపుణుండు, దయాన్వితుండు, సుజనస్తోత్రపాత్రుండు, అతిథిపూజాతత్పరుండు; నీవాతనికడకుంబోయియుత్తమధర్మము నెఱుగుమ" అనియాబ్రాహ్మణుడు భృగుచేననుజ్ఞాతుండై వెడలిపోయెను.

వినుమోధర్మనందనా! "భృగుండప్పుడే యిల్లువెడలి, యెడనెడబహుతీర్థసేవనంబుసేయుచు నైమిశారణ్యముసొచ్చి, గోమతీతీరమున, మహాపద్మహ్రదముతటమున, భుజగరాజైన పద్మునిమందిరంబుగాంచి, లోనికింబోవగా, నాగరాజభార్యయెదురువచ్చి, యాతనిందోడ్కొనిచని, యర్ఘ్యమిచ్చి "అయ్యా! మీరిందులకువచ్చినకారణమేమి?" యనియడిగెను. దానికిబ్రాహ్మణుడు నేను నీపతినిజూడవచ్చితిని. ఆతండెందున్నాడు? నాకునెఱింగింపు" మనెను. అప్పుడా సర్పాంగన "స్వామీ! నావిభుండు తనవంతు నెలవరుస వచ్చినందున సూర్యుని రథమునుమోచుటకై పోయియున్నాడు. ఇంక నెనిమిది దినములలోనిటకువచ్చును. నాపురుషుండిందు లేడని మీరుశంకింపవలదు. మీకేమికావలయునో తెల్పినచో, దానినేను దప్పక చేసెదను. ఇదినాకర్త

గొనుక్కయాజ్ఞ నతిథులనాదరించుటకంటె ధర్మములేదు." అని మిక్కిలి వినయంబుతోఁ దెలుపగా భృగుఁడయ్యురగరాజువల్లభతో "దేవీ! నాకేమియు వాంఛ లేదు. నీమగనింజూచుటకై యిటకు వచ్చితి. ఆమహానుభావుఁడు వచ్చునంతకునదిగో వనముననిలిచియుండెదను. అతఁడువచ్చినతోడనే నారాకయతని కెఱింగింపు" మని చెప్పి, చేరువనుండు వనములో నిరాహారుఁడై వేచియుండెను.

తనవరుసదినములు తీఱినతోడనే సర్పరాజు, సూర్యుఁడనుమతి చేయఁగా మరలితన యింటికి వచ్చెను. అప్పుడాతనిభార్య వానికిం బరిచర్యలు చేసి, ప్రియంబుగనన్నంబుపెట్టి" నాథా! ఒక బ్రాహ్మణోత్తముఁడు, చాతకమువానఁగోరెడు చందముగా మీరాకకై యెదురుచూచుచు, సమీపారణ్యములోనున్నవాఁడు. వచ్చినకారణమేమియనియతఁడు నాకుఁ దెల్పఁడయ్యె. ఆహారమిచ్చినను గైకొనక యుపవాసవ్రతముతోనున్నవాడు. మీరు త్వరగా నతనిఁ జూచుటకుఁబొండు. సద్బ్రాహ్మణుల కోర్కెఁ దీర్చుటకంటె ధర్మమొక్కటి కలదా?" యనిచెప్పెను

పద్ముఁడు భార్యపలుకులకు సంతోషించి తత్క్షణము వెడలి భృగునింజూడవచ్చెను. వారిరువురు తరుచ్ఛాయాశీతలమైనసికతాతలంబున సుఖాసీనులై సంభాషణకుఁ జొచ్చిరి.

ప.— ఓమహీసురోత్తమా! నీవిందులకువచ్చిన కారణమేమి? ఏలయిట్లుభుజింపక నియతితోనున్నావు?

భృ:— ఓ అహివర్యా! నేను బ్రాహ్మణశ్రీవరునిపుత్రుఁడను. ధర్మారణ్యమునుండి నినుఁజూడవచ్చితిని. నీవుసూర్యునారాధించుటకయి చనుటనునీభార్యచేవింటిని. వాడినచేనివాఁడు

వానకెదురుచూచునట్లు నీరాకకై యెదురుచూచుచుంటిని. నా మనఃక్లేశము దొలఁగింప నీవ యర్హుఁడవగుదు.

ప:— నీకొఱతఁదీర్చుటకంటెను నాకు వేఱుకార్యముక లదా? నీవు పుణ్యాత్ముఁడవు. నాయింటికివచ్చుటం జేసి నాజన్మము సఫలమయ్యెను. మహాత్మా! నీకేమికావలయునో చెప్పుము.

భృ:— నాకోర్కి పిదపఁజెప్పెదను. వేరొక్క విషయమును గూర్చి సందియము తత్తరపడుచున్నది. దానినాకుముందుగాఁజెప్పవలయును.

ప:— అదియేమి? నాకుఁజెప్పుము.

భృ:— నీవుసూర్యసిద్ధంబు పఠింపఁబోయినప్పుడు నీవ వినిన యట్టియాశ్చర్యములఁదేని దానినాకుముం దెఱింగింపుము.

ప:— అయ్యా! సూర్యుఁడాశ్చర్యములకెల్ల నాస్పదమై యున్నాడు. ఆతనివలననే భూతములెల్లను జరించుచున్నవి, వాన కురియుచున్నది. చెట్టుకొమ్మలపై విహంగములు వ్రాలియుండు నట్లు సూర్యకిరణంబులాధారంబుగా వాలఖిల్యాది మహామునీం ద్రులు వసియించుచుందురు. ఇదిమిక్కిలియాశ్చర్యమైనదికదా? పరమాత్ముఁడును, బరముండును, నిరంజనుండును శాశ్వతుండు నున్నైన పరమపురుషుఁడు. సూర్యునియందు వెలుఁగుచున్నాడు. ఇంకొక యాశ్చర్యమువినుము. ఒక్కనాడుమధ్యాహ్నమునసూ ర్యతేజుండైన పురుషుఁడొక్కఁడు సూర్యబింబమునకెదురుగాన తిత్వరితగతింబఱతెంచివచ్చిన, దినేశుండును సంతోషసంభ్రమం బులుబెనంగొన వానిందన చేతులతోఁబట్టిసన్మానించెను. అప్పురుషుఁ డు సూర్యబింబముసొచ్చి దానిలోలయించెను. దానింగని నేను వెఱఁగంది, యాతఁడెవ్వఁడగునోయని ప్రభువునడుగ, నన్నాత్మా

నరకంబునఁగని, సూర్యభగవానుఁడిట్లనియెను. "సర్పకులవర్యా! వినుము. ఈతఁడు సురగరుడగంధర్వాది దేవతలలో నొక్కఁడు గాఁడు. ఉంఛవృత్తిగల బ్రాహ్మణుఁడు. అస్ఖలితనియమవ్రతుండు. ఫలమూలనీరమారుతాహారుఁడు. దొరకినదానితోఁ దృప్తి చెందునుగాని, దొరకొననివానికి నోరు తెఱచి యెదురుచూడఁడు. సర్వభూతములయందు సమతయుఁ బ్రియంబునుగల్గి వర్తించువాఁడు. వాఁడు నేఁడిట్లు సిద్ధిఁబొందెను." అయ్యా! బ్రాహ్మణపుంగవా! ఇంతకంటె నాశ్చర్యమైనది వేఱుకలదా?

భృ:—నీవడుగఁజూచిన యాశ్చర్యములను జెప్పితివి, నా సంశయంబును దీర్చితివి సిద్ధిఁబొందుటకు మార్గమును నెఱిఁగితిని. నాకనుజ్ఞయిమ్ము, పోయివచ్చెద, ననియావిప్రుఁడు సర్పరాజుంబొగడి, తననివాసంబు చేరఁబోయెను."

"ధర్మనందనా! నీవుపగమధర్మంబెయ్యదియని యడిగితివి. దానికై నీకీభృగుపద్ముల సంవాదరూపమైన యితిహాసమును నారదముని దేవేంద్రునకుఁ జెప్పినరీతిగా వివరించితిని. అన్నిధర్మంబులను త్రినుములేయైనను, సర్వభూతసమదర్శనత్వంబును, అనాకాంక్షిత్వంబును బరమసిద్ధికి మూలంబులైన ధర్మంబులనుటకీ యితిహాసము నిదర్శనమైయున్నది.

క॥ కోరికలఁ గోరక, యనసం
గారూఢతఁగల్గి, యెల్లయందును సమతం
గూరినచిత్తంబుఁగల
సారాత్మకులే పదంబు జనుటకు శక్తుల్॥

## II సామాన్యపురుషార్థములు.

### 1 గురుభక్తివిశేషము ఏకలవ్యునికథ.

పూర్వము హస్తినాపురమున కురుకుమారులకెల్ల విలువిద్యగఱపుచున్న ద్రోణాచార్యులమహాప్రసిద్ధివిని, హిరణ్యధన్వుం డను నెఱుకురాజకొడుకేకలవ్యుఁడనువాఁడు, తనకు ధనుర్విద్య నేర్పవలయునని యాచార్యుని వేఁడఁగా, వానిని నిషాదపుత్త్రుఁగా నెఱింగి శిష్యునిగాఁ జేకొన నొల్లకున్న, వాఁడు తనయున్నయెడకుఁ బోయి, ద్రోణునిరూపంబు మన్నున నమర్చి, దానికతిభక్తితోడఁ బ్రదక్షిణంబుఁ జేసి మ్రొక్కుచు, సంతతాభ్యాసశక్తిచే, శస్త్రవిద్యారహస్యంబులెల్ల నెఱిఁగెను.

ఒక్కనాఁడు పాండవకౌరవులు ద్రోణాచార్యులయనుమతిఁగొని, వేటకుక్కలతోను భటులతోను వేఁటాడుటకై యేకలవ్యుఁడున్న వనమునకువచ్చిరి. అప్పుడొకభటుని కుక్క తోడుతప్పిపఱచి, యేకలవ్యుఁడేకాంతముగా బాణము వేయుచున్నయెడకువచ్చి మొఱిగిన, నయ్యెలుఁగువిని యాయెఱుకు దాని ముఖమునం దేడుబాణము లొక్కయుమ్మడినిట్లు ప్రయోగించెను. అప్పుడా సారమేయము ముఖమునం గ్రుచ్చుకొన్న బాణములతోఁ బరుగులిడుచు కురుకుమారులయొద్దకు వచ్చిన, దానిం గని యద్భుతంబందుచు, నెవ్వరుదీని నిట్లేసిరోయని విచారించుచుండిరి.

అప్పుడు వారెదుట, జింకతోలుధరియించినవాఁడును, మెఱుఁగుఁబోలిన బాణంబులు గలవాఁడును, దృఢమైన నీలదేహము గలవాఁడునునైన నిషాదునొక్కనిఁగని, యాతనిం జూచి, "ఓరి! నీవెవ్వఁడవు? ఎవ్వరు నీకు విలువిద్యనేర్పిరి?" అనియడి

గిరి. ఎఱుకుఁడిట్లనియె. "నేను నిషాద రాజపుత్రుఁడను. ఏకలవ్యుఁడను వాఁడను. ఆచార్యులైన ద్రోణునకు శిష్యుఁడను" అనిన నారాజకుమారులసూయాగ్రస్తులై వానిం జూడక మఱలి వచ్చి, ద్రోణునకంతయుఁ జెప్పిరి.

పాండవ మధ్యముఁడైన యర్జునుఁ డేకాంతముగా నాచార్యునిం జూచి "గురువర్యా! మీరు నాకు విలువిద్య నొరులకంటె నెక్కుడుగా నేర్పెదనని చెప్పితిరి. నాకంటెను మీకంటెను మించినవానినొక్కని, నిషాదుని మేమడవిలోఁ జూచితిమి. వాఁడు మీ శిష్యుఁడట. ఇట్లు చేయఁదగునా" యనియడిగిన ద్రోణుఁడాశ్చర్యపడి, యర్జునుం దోడ్కొని నిషాదునొద్దకుఁ బోయెను.

ఆచార్యుఁడు వచ్చుటఁజూచి నిషాదుఁడు పరుగెత్తికొని వచ్చి క్రిందఁబడి మ్రొక్కి, చేతులు మోడ్చుకొని తన శరీరంబును, అస్త్రశస్త్రంబులును సర్వంబును నివేదించి "గురువర్యా! నేను మీకు శిష్యుఁడను. మిమ్ము నారాధించి మీ ప్రసాదంబున నివ్విలువిద్యఁ గఱచితి" ననియెను. ద్రోణుఁడప్పుడు నీవు నాకు శిష్యుఁడవైతేని నాకు గురుదక్షిణగా నీకుడిచేయి పెనువ్రేలు కోసియిమ్మనియడిగిన, వాఁడు తడయక నట్లుచేసెను. దానిచేనతఁడు బాణసంధానలాఘవము చెడి విలువిద్య కలిమికి హీనుఁడయ్యెను. అర్జునుఁడప్పుడు సంతోషించెను.

ఏకలవ్యుఁడు గురుభక్తి ప్రభావము చేతనే ధనుర్విద్యలో నిపుణుఁడయ్యెను. గురుశుశ్రూషలు సేయుచు, గురుముఖముగాఁ దెలుసుకొనని విద్యలు ప్రకాశింపవు. అట్టి విద్యచే మనుష్యులకు గర్వమును మదమును గలుగును.

క॥ గురుశుశ్రూషలు సేయుచు
పరమక్లేశమునఁ జేసి పడసిన విద్యల్
స్థిరియించుగాక గురుముఖ
విరహితముగఁ బడసినవియు వెలయునె యెందున్॥

## 2 సత్సహవాసము.

### వ్యాసమహర్షి ధృతరాష్ట్రునకు దుర్యోధనుని విషయముగాఁ జెప్పినపలుకులు.

పాండవులు తమసమయము తప్పక వనవాసము చేయుచుండగా, దుర్యోధనుడు దుర్మార్గులైన కర్ణ, శకుని, దుశ్శాసనులమాటలువిని, పెద్దలగు భీష్మాదుల పలుకులు వినక వారిపైదండెత్తి వెడలుటకు నిశ్చయించెను. ఈసంగతిని వేదవ్యాసమహాముని యెఱిఁగి ధృతరాష్ట్రునొద్దకువచ్చి యిట్లనియె 'ఓ కురువంశవరా! నీకుమారుఁడగు దుర్యోధనుఁడు దుర్మార్గుఁడై, వనంబుననున్న ధర్మజాదులమీఁదికి యుద్ధమునకుఁ బోవ సమకట్టెను. ఇట్లుపోవుట తగునా? నీవేలవాని శిక్షింపవు? ధర్మాత్ములను సత్యవ్రతులును శూరులునైన పాండవులతో విరోధము చేయుట యెంతమాత్రమును దగదు. వారితో సఖ్యము జేయునట్లు దుర్యోధనునకుం జెప్పుము. వాఁడు దుర్జనుఁడు. దుర్జనుఁడైనవాఁడు సజ్జనసాంగత్యముచే సుజనుఁడగును. పువ్వులతోఁ గూడిన నారకు వాసన కలుగుటలేదా? కావున నీపుత్రుఁడు కొన్నిదినంబులు పరమధర్మాత్ముఁడును, సుజనవర్యుండును రాజర్షియునైన ధర్మపుత్రునియొద్దయుండెనేని, మంచిగుణములు

గలవాఁడగును. అమ్మహాత్ముని యొద్దకు నీకొడుకుం బోవ నియమింపు
ము. జనులకు సత్యమును దయయు శమయు, మఱియు ననేకవి
ధములైన సత్ప్రవర్తనములెల్ల సత్సాంగత్యము చేతనే కలుగును"

క॥ తిలలును నీళ్లును వస్త్రం
బులుఁ బుష్పనుగంధవాసమున సౌరభముం
బొలువెసఁగఁ దాల్చుఁగావున
నలయక సత్సంగమమున సగుసద్గుణముల్ ॥"

దుర్యోధనుఁడు తండ్రిపలుకులు వినక దుర్జనులైన దుశ్శాసన
కర్ణాదులం గూడుకొని తుదకు నష్టాత్ముఁడయ్యెను.

### 3 పితృవాక్యపరిపాలనము.

### రామ పరశురామ పూరుల చరిత్రములు.

### (1) రాముఁడు వనమునకు బోవుట,

పూర్వము యోధ్యానగరములో దశరథుఁడను చక్రవర్తి తన
పూర్వకర్మసుకృతవిశేషంబున రామలక్ష్మణ భరతశత్రుఘ్ను
లను నలువురు కొడుకులం బడసి, త్రైలోక్య రాజ్యంబును బొం
దినట్లు సంతోషము బొందియుండెను. అంతట నబ్బాలురు దిన
దినప్రవర్ధమానులై యుపనీతులై యెల్లవిద్యలు నేర్చి వివాహితు
లైరి. పిమ్మట దశరథుఁడు సుగుణాభిరాముఁడును కోదండ వి
ద్యాప్రవీణుండునైన శ్రీరాముని యౌవరాజ్యమున కభిషిక్తుని
గాఁ జేయఁదలంచి, మునిముఖ్యులైన వసిష్ఠాదులతో నాలో
చించి, పట్టాభిషేకమునకు శుభముహూర్తమును నియమించి
యుండెను.

అప్పుడు భరతుని దాది మంథరయనునది, భరతమాతయగు కైకయి యొద్దకుఁబోయి, "ఓయీ! వెఱ్ఱిదానా! నీవు మోసపోయితివిగదా? టక్కరియైన నీముసలి మగని కార్యమును చూచితివా? నీకొడుకునకు యువరాజ్యంబియ్యక, కౌసల్యా పుత్రుఁడైన రామునికుఁ బట్టముఁగట్టఁ బూనియున్నాఁడు. ఆసవతి కొడుకైన రాముఁడు నిన్నును నీకొడుకును బట్టితోలి యవని నెల్లనేలు." అనియిట్లు బహువిధంబులగు భాషణములఁ గైక మనంబు కలఁచి, దానికి శ్రీరామపట్టాభిషేకమునకు విఘ్నోపాయంబు తెలిపింపఁ, నదియు సంతోషించి, తత్క్షణంబ దశరథునిపాలికిఁజని "నాథా! తొల్లి నాకు మీరు కరుణించి రెండు వరంబు లొసంగితిరిగదా? వాని నడుగుటకు నాకిప్పుడు సమయమయ్యెను. క్షత్రియ ధర్మనిరతులైన రాజులకు సత్యవాక్యపరిపాలనంబవశ్యం" బనిన, నమ్మహీపతి తనసతింగనుంగొని, "ప్రియా! నీవింత చెప్పనేల? నీయిష్టమెట్టిదో దానిం జెప్పుము. తప్పక చేసెద" నని ప్రతిజ్ఞ చేసెను.

రాజానవలలోఁ జిక్కుటయెఱిఁగి, కైకయప్పుడు భరతుని యౌవరాజ్యపదవిలో నిల్పునట్లును, రాముని పదునాల్గేండ్లు వనవాసమునకుం బోవ నియమించునట్లును వేడుకొనియెను. కోపింగొని చెవులు నారాచచందమైన యక్కర్ణకఠోర వాక్యములను విని, దశరథుఁడు మూర్ఛిల్లి, కొంతవడికి ప్రజ్ఞాన్వితుఁడై, రామునిపైగల నిరతిశయప్రేమచే నవ్వరంబులుగోరక యొండువరంబులు వేఁడుమని కైకేయి నెంత ప్రార్థించినను, అమ్మూర్ఖురాలు తనపట్టువదలక తనకోరినవరంబులే యిమ్మనియడిగెను.

ఈవృత్తాంతమంతయు రాముఁడెఱిఁగి, తనతండ్రికిసత్య

ప్రతిజ్ఞాభంగము గాకుండునట్లు చేయఁదలఁచి, సీతాలక్ష్మణసమేతుఁడై రాజ్యసౌఖ్యములెల్ల తృణముగా నెంచి వనంబునకుఁబోయెను. తనయగ్రపుత్రుఁడట్లు వనంబునకుఁబోవుట నెఱిగి, దశరథుఁడు శోకాగ్నిచేఁ బొగులుచు "హా రామ! హా రామ!" యనుచుఁ బరలోకగతుఁడయ్యెను.

### తండ్రిమాటను నిలిపిన కొడుకే కొడుకు.

**2 పరశురాముఁడు తండ్రిమాటలు విని తల్లిం జంపి మఱల బ్రతికించుట**

పూర్వము జమదగ్నియను మునివరుండు రేణుకయను భార్యతోడను, రుమత్యుత్సాహ విశ్వావస పరశురాములనియెడు నల్వురుపుత్రులతోడను, తపోవనంబుననుండ, నొక్కనాఁడు పుత్రులెల్లను వన్యఫలంబులు తెచ్చుటకై యడవిలోనికిఁజనిరి. నీళ్లు తెచ్చుటకయి రేణుకాదేవియు, పుత్రుల వెంటనంటిపోవుచు, సమీపముననున్న సరోవరమునందు, చిత్రసేనుఁడను రాజు తనసుందరులతో జలక్రీడలాడుటను జూచి, కామమోహితయై యతనితో సరససల్లాపములాడి మగిడియింటికి వచ్చెను. దాని దుశ్చరిత్రమంతయు జమదగ్ని తన దివ్యదృష్టిచే నెఱిఁగి మహాక్రోధపరవశుఁడై, పుత్రులు మగిడివచ్చినతోడనే వారిలో మొదటిమువ్వురంజూచి "అయ్యలారా! వ్యభిచారిణియైన మీ తల్లిని వధింపు" డనియెను? వారప్పుడు "తండ్రీ! యెంత దుశ్చరితయయ్యును దల్లిం జంపుట ధర్మమగునా?" యని మాతృఘాతకపాపమునకు వెఱచి, తండ్రి పంచిన కార్యమును జేయరైరి. జమదగ్ని కోపించి కొడుకులను మువ్వురను ఘోరారణ్యములో మృగపక్షులవలె జ్ఞానహీనులై యుండుఁడని శాపమిచ్చెను.

అంత ముని పరశురాముంజూచి "అన్నా! నీవతిశీఘ్రంబునం బోయి మహాపాతకియగు నీతల్లిం జంపు" మనివచిన, వాఁడు శాపభీతుండై తండ్రివచనంబుల నతిక్రమింపక తల్లిం జంపివచ్చెను. అప్పుడు శమితక్రోధుండై మునిపుంగవుఁడు చిన్నకొడుకుం జూచి "అన్నా! నీవు నావంపుచేసితివి నీకార్యమునకు సంతోషించితిని, నీకిష్టమైన వరములడుగు" మనియెను. పరశురాముఁడు తండ్రికతిభక్తితో మ్రొక్కి "తండ్రీ! నీకు నాపైననుగ్రహముకలదేని, నాతల్లి సకలదోషవిముక్తయై మఱల జీవించునట్లును, నాసహోదరులెల్ల విగతశాపులై యెప్పటియట్ల వర్తింపను, గృపచేయవలయు" ననిప్రార్థించిన, నతఁడు కొడుకు కోరినవరములొసంగెను. అంత వారుముందువలెసుఖముగానుండిరి.

ఆ॥ పడినవారి మరల బ్రదికింపనోపును
జనకుఁడనుచుఁ జంపె జామదగ్న్యుఁ
డతఁడు సంపెననుచు నన్నలఁదల్లిని
జనకునాజ్ఞమీఱఁజంపఁదగదు॥

3 పూరుఁడు రాజ్యమును సంపాదించినవిధము.

పూర్వము యయాతియను రాజు శుక్రాచార్యుని కూఁతురైన దేవయానియను బ్రాహ్మణకన్యను వివాహమై, దానియందు ధర్మపుత్రులంబడసి, మరియు వృషపర్వుఁడను దానవేంద్రుని పుత్రికయగు శర్మిష్ఠయను దానిం బెండిలియై కొడుకులం గనియుండ, నవ్విధంబంతయు ప్రథమభార్యయైన దేవయాని యెఱిఁగి క్రోధశోకపరిపీడితయై, తండ్రియొద్దకుజని, యల్లుఁడుచేసిన యపకా

రంబు నెఱింగించిన, శుక్రుడు కోపించి యయాతింజూచి, "ఓరీదు
రాత్మా! నీవు కామమోహితుడవై నాకూతునకప్రియంబులు చే
సితివి కావున, నీవు యౌవనంబు లేక జరాభారంపీడితుండవు గమ్ము" ని
శాపంబిచ్చెను. అప్పుడా రాజు గడగడ వణకుచు "అయ్యా. స్త్రీ
లు పుత్రునికొఱకు బురుషులను బతిగాఁ గోరినప్పుడు వారి ప్రార్థన
యంగీకరింపక తిరస్కరించుట మహాపాపమని ధర్మశాస్త్రముల
యందుఁ జెప్పఁబడియున్నది. నేను పాపభీతుఁడనై శర్మిష్ఠను భార్య
గాఁ జేసుకొంటిని. నాపై నింతకోపమును బూనదగునా" యని ప్రా
ర్థింప శుక్రుఁడు కరుణించి "నీవు నీ ముసలితనము నీ కొడుకులలో
నొక్కనికిచ్చి వాని యౌవనంబు పుచ్చుకొని, రాజ్యసుఖముల
ననుభవించి, మరల వానికి వాని యౌవనంబు నిచ్చి నీ వార్ధక్యమును
నీవయనుభవింపుము. అట్లు నీ ముదిమిని గొనునట్టి సుతుఁడే రాజ్యా
ర్హుండును వంశకర్తయు నగు" నని యనుగ్రహించెను.

ఆంత యయాతికి ముదిమి వచ్చుటచే నింద్రియములకొవ్వ
తగ్గెను. శరీరముయొక్క సంధులు వదలెను. ముడుతలేర్పడెను. తల
యందు నరలు గల్గెను. ఉబ్బసమును దలనొప్పియును వచ్చెను.
ఇట్లు శుక్రుని శాపంబున ముదిమిచే బాధితుఁడై, యయాతి కొడుకు
లనెల్ల రావించి "పుత్రులారా! నాకు విషయసౌఖ్యముల యందు
తృప్తి లేకున్నది. మీలో నొక్కఁడు నా ముదిమిగొని తన జవ్వనం
బు నాకిచ్చునది" యనిన పెద్ద కుమారులందఱు విని నవ్వి,
"అయ్యా! దైవవశంబున మనుష్యులకు ముదిమియు వ్యాధులు
నుగలుగును. వానిననుభవింపక తీరదు. ఇది యేమి కార్యము? తన
జవ్వనంబిచ్చి యొరుని ముదిమిని గొను కుమతులెందైననుందురా?"
యని యొప్పఁబడకుండిరి. అప్పుడు యయాతి యలిగి వారినెల్ల

రాజార్హులుగాకుండునట్లును, ధర్మాధర్మ వివేక రహితులగునట్లును, వారిపుత్త్రులును వారివంశమువారును అల్పాయుష్కులై చెడిపోవునట్లును శాపంబిచ్చెను.

అంతయయాతియందఱికంటెఁ జిన్నవాఁడైనవాని, శర్మిష్ఠాపుత్త్రుఁ బూరుఁడనువానింబిలిచి యడిగిన, నతఁడంగీకరించిన, తనముదిమివానికిచ్చి నవయౌవనసంపన్నుఁడై యభిమతసుఖంబులెల్లననుభవించి, వేయేండ్లు చనినతర్వాత, పూరుజవ్వనంబు వానికిచ్చి, తన జరాభారంబుఁ దానతాల్చి వానిరాజ్యాభిషిక్తుం జేసెను. అప్పుడు కొందఱు ప్రజలు కనిష్ఠపుత్త్రునకేల రాజ్యమిచ్చితివని యడుగ, దానికిరాజు, పూరుఁడు పిన్నవాఁడయ్యును గుణములలోఁ బెద్దవాఁడనియు, సుపుత్త్రుఁడనియు, తండ్రికార్యము చేసినవాఁడనియు వారికెఱిఁగించి మఱియునిట్లనియెను.

క॥ తనయుండుతల్లిదండ్రులు
పనిచినపనిసేయఁడేనిపలుకెదఁగాఁ జే
కొనఁడేనివాఁడుపుత్త్రుం
డనఁబడునేపితృధనమునకర్హుండగునే॥

4 పట్టుదల. భగీరథుడు గంగను దెచ్చినకథ.

పూర్వము కాలకేయులను రాక్షసులు పగలెల్ల సముద్రజలములోఁ డాఁగియుండి రాత్రులందు బయటికివచ్చి లోకంబులకు మహోపద్రవములుసేయుచుండ, దేవతలెల్ల మహామునియైన యగస్త్యునిం బ్రార్థించి జగంబులకుఁ గాలకేయులవలన గల్గుబాధలెఱింగింప, నమ్మహాముని తనతపశ్శక్తిచే సముద్రోదకములెల్ల

పానంబు చేసెను. అప్పుడు రాక్షసులెల్లబయల్పడిరి. వారిని దేవతలు నిర్మూలము చేసిరి. నాటంగోలె సముద్రము నిర్జలంబై యుండెను.

ఇట్లుండ నిక్ష్వాకువంశమున జనియించిన సగరుండను రాజు సకలరాజులను జయించి మహీతలంబేలుచుండెను. అతనికి మహాదేవుని వరప్రసాదంబున వైదర్భియను భార్యయందఱు వదివేవురుకొడుకులు జనించిరి. శైభ్యయను భార్యయందసమంజనుఁడను కొడుకునుగనెను. షష్టిసహస్రసంఖ్యగల సుతులకు సాగరులనిపేరు. వారతిదర్పితులు, కూరులు, కపిలమహాముని కోపాగ్నిచే నందఱు నొక్కటజలశూన్యమైన సముద్రభాగమున భస్మీభూతులైరి, అసమంజనుడును గ్రూరుఁడై రాష్ట్రంబులోని బాలురనదిలోఁబడవైచుచుండగా నతఁడు తండ్రిచే విడువఁబడియెను. సగరుఁడప్పుడు తనకు మనుమఁడును, అసమంజస పుత్రుఁడునైన, యంశుమంతుఁడను వానికి రాజ్యమిచ్చి తపోవనమున కేగెను.

అంశుమంతుడు రాజ్యము పెద్దకాలమేలి, తనపుత్రుఁడు దిలీపుఁడనువాని రాజ్యాభిషిక్తుం జేసి "అయ్యా! నీపితామహులు కపిలమహాముని క్రోధానలంబున మడిసిరి. వారికి సద్గతిగావించు విధము చేయు" మని చెప్పి తానునుదపోవనంబున కరిగెను. దిలీపుండట్లు చేయసమకట్టెనుగాని నిష్ఫలారంభుఁడై మృతినొందెను. అంత నతనికొడుకు భగీరథుఁడను వాఁడు తనపితామహులకైన దుర్గతినివిని, దుఃఖించి, నొకైనవారిని సద్గతిప్రాప్తులుగాఁ జేయఁదలఁచి, హిమవంతమున కేగి నియతాహా

రుఁడై గంగాదేవిం గూర్చి యతుల తపస్సు చేయఁగా, నద్దేవి ప్రత్యక్షమై వరంబు వేఁడుమనిన, "తల్లీ! నీదగు పుణ్యోదకంబులు నీఱై పడియున్న నాపితామహులపైఁ బ్రవహింప, వారికి మంచిలోకంబులు కలుగును; కావున నీవు నావెంట భూలోకమునకు వచ్చి సముద్రములోఁ బ్రవహింపు"మని ప్రార్థించెను. అప్పుడు త్రిలోకపావనియైన గంగ "నేనాకాశమునుండి భూమిపైఁ బడునప్పుడు నా వేగమును సహింపను, నిరంతర జలప్రవాహంబుఁ దాల్పను, నీలకంఠుఁడైన పరమశివుఁడొక్కఁడే యోపుఁగావున, నద్దేవుని నీదగు తపస్సుచే మెప్పించి, నన్నుఁ దాల్ప ప్రార్థింపు"మని చెప్పి, వెడలిపోయెను.

అంత భగీరథుఁడు తన కార్యము సిద్ధింపనెంచి, మఱియు వేయేండ్లు శివునిం గూర్చి తపస్సు సల్పెను. శివుఁడు ప్రత్యక్షమై "నేను గంగను దాల్చెదను, నీవు భూలోకమునకు గంగావతరణము చేయు"మనిన, వెండియు నమ్మహీపతి గంగ నారాధించిన, నాతనికిం గరుణించి గంగ యుత్తుంగ తరంగ సంఘాతములతో భూమిపైఁ బడఁగా దాని శివుఁడు తనజడలోఁ దాల్చెను. శివుని జటాజూటరంధ్రములనుండి నేలకుదిగి గంగ భగీరథుని వెంట భూమిపైఁ బాఱి సముద్రములోఁ జొచ్చి దానినిండించిన, గంగోదకసిక్తులై సాగరులు సద్గతికిం జనిరి. భగీరథుని కీర్తి భూమిపై శాశ్వతముగా నిల్చెను. అప్పటినుండియు గంగను ధరించిన శివునకు గంగాధరుఁడనియు, గంగను భగీరథుఁడు తెచ్చుటచే నమ్మహానదికి భాగీరథియనియు, సగరుల కారణంబున జలపూరితమగుటచే సముద్రమునకు సాగరంబనియు, నామంబు గలిగెను.

పెద్దలగువారు మంచివిషయములోఁ బట్టుదల కలిగి, తాము చేయఁదలఁచిన కార్యమును, విఘ్నములు వచ్చినను వెనుకఁదీయక చేయుచుందురు.

## ౫ బ్రహ్మచర్యము; అష్టావక్రుఁడను ముని కుమారుని చరిత్రము.

ధర్మరాజు భీష్మాచార్యులవారింజూచి "అయ్యా! కన్యాదానంబు చేయుటకు వరుఁడెట్టిగుణంబుగలవాఁడుగానుండ వలయు?" నని యడిగిన నాతనికి గాంగేయుఁ డిట్లనియె. "ఓ ధర్మనందనా! నీవు పెండ్లికొఱకు విషయమై యడిగిన విషయము స్పష్టముగా నెఱింగించు కథయొక్కటి చెప్పెదవిను" మని యిట్లనియె.

"పూర్వమష్టావక్రుఁడను మునికుమారుఁడు బ్రహ్మచారియైయుండిగురుకులవాసము చేసి, వదాన్యుఁడను పేరుగలముని వర్యునికూఁతురు సుప్రభయనుదానిఁదనకు భార్యగానిమ్మనిముని వర్యునడిగిన, నతఁడు "నీవుయోగ్యుఁడవైనను, ముందుగాను త్తరదిక్కునకుఁబోయిరమ్ము. అందు హిమగిరి తటంబున శివుఁడు తపస్సుచేసినస్థలమునకు సమీపముగానొక్క దట్టమగుకడిమి చెట్లయడవిగలదు. అందొక్క యుత్తమగుణాలంకృతయైన నారీరత్నమున్నది. దానింజూచిరమ్ము తర్వాత నాకూఁతునీ కిచ్చెద" నని చెప్పెను.

అష్టావక్రుఁడట్లే చేయుదునని, మునివరుఁడెఱింగించిన యెడకుఁబోవఁగానందొక్క రమ్యమైన హర్మ్యముకనఁబడియెను. అమ్మేడవాకిటనిల్చి లోనికిఁదన పేరు చెప్పిపుచ్చఁగా, సురూపులగు

కన్యకలనేకులుపఱతెంచివచ్చి, యష్టావక్రునిందోడ్కొనిచని, లోపలిగదిలో వివిధరత్నవిరాజితమైనపాన్పుపై విశ్రమించియున్నతమయజమానురాలిముందరనిల్పిరి. అప్పుడియసుందరాంగియు, ప్రౌఢవయస్కయునై యుండెను. వచ్చినమునిపుత్త్రుని జూడఁగానదిడిగ్గన లేచి యెదుర్కొని, యిందురమ్మని చేయిచూపి, తనధవళపర్యంకముపై గూర్చుండునట్లుచేసి, శాస్త్రోక్తవిధముగా నాతనింబూజించి తాను వేఱొకసెజ్జపైఁ గూర్చుండి తగిన సంభాషణంబునకుఁ జొచ్చెను. తోడికన్నియలెల్లనుదమ తమచోట్లకుఁజనిరి.

అంతరాత్రియయ్యెను. అష్టావక్రుఁడునిద్రించుచుండగా నక్కోమలి మెల్లన లేచి చలిగానున్నదని చెప్పుచు నాతనిపాన్పుపై శయనించుటకువచ్చెను. మునిపుత్త్రుఁ డూరకుండెను. వదవడి యాలతాంగి బ్రహ్మచారినిదిగిచి కౌఁగలించుకొనగా, నతఁడు కదలని చిత్తముకలవాఁడై యించుకయైన మన్మథ వేదన లేక మ్రానువలెనుండెను. అట్లుండుటంజూచి యత్తన్వి "అయ్యా! మగవారు భోగపరులు, స్త్రీలు తాల్మిగలవారు. నేనువచ్చి నిన్ను కోరినను నీవునన్నొల్లకున్నావు. ఇది యేమి యాశ్చర్యము! నన్ను వివాహమైనాతో సుఖములనుభవింపుము. నీకిందొక్క విధమైనకొఱంతయు లేదు." అనినదానితో మునికుమారుఁడిట్లనియె.

"నేనుబ్రహ్మచారిని. భార్యఁ గోరియున్నవాఁడను. పరదారాభిగమనంబు పాతకములలోఁబెద్దయందురు. ఈయతినింద్యమైనపనికెట్లునేను సమ్మతింపఁగలను? నన్నుగారింపకుము. నేనుబోయెద, నాకనుజ్ఞయిమ్ము" అనిదిగ్గనలేచిపోవఁ జూచెను.

అప్పుడా మృగాక్షి " అయ్యా! తొందరపడకుఁడు. మీరు వచ్చిన కార్యమయినతోడనే పోవచ్చును. శయనింపు" డని తినసెజ్జకునచ్చెను. అంత సూర్యోదయ మగుటయు నక్కాంతి ముని వరుని స్నానము చేయించి, యతఁడు సంధ్యా వందనాగ్ని కార్యము లాచరించిన పిదప, నమృతోపమానమైన యన్నంబు పెట్టించి, యుచితంబులగు మాటలచేఁ బ్రొద్దుపుచ్చి, రాత్రియగుటయు, మఱల నాతని శయనంబునకుఁ బిల్చె, నప్పురుషవరుండు సమ్మతింపఁడయ్యెను. అప్పుడది " నేనుకన్యను. వివాహమునకుఁదగిన వయస్సుగలదానను. స్వతంత్రముగల్గి వర్తింతును. నన్నుఁబాణిగ్రహణంబు జేసికొని సుఖంబుగానుండు" మనిన, నమ్మహనీయచరిత్రుఁడు "ఓతోయజలోచనా! స్త్రీలు తమకుఁబోలినట్లెల్ల చేయరాదు. వారికి స్వాతంత్ర్యము లేదు.

గీ॥ " బాల్యమునఁదండ్రియౌవనప్రాప్తిమగడు
వార్ధకంబునఁదనయుఁడు వామనయన
నరసి నడుపఁగా నెందుననంగనలకు
వలసినట్టులు చేయఁగావచ్చునెట్లు?"

కావున నిన్ను నీవిచ్చినను నేను పరిగ్రహించుట ధర్మము కాదు. ఏలనన్ను బాధపెట్టెదవు? నీతలంపేమి? నాకుఁబనులుగలవు; నేనుపోవలయు. నన్నునిచిపుచ్చు" మనెను

అని యిట్లాబ్రహ్మచారిసత్తముఁడు ధీరచిత్తుఁడై పల్కుటంజూచి సంతోషముతో నక్కాంతయిట్లనియె. "అయ్యా! నేను నిన్నుఁ బరీక్షించుటకై యిట్లుచేసితిని. నేను త్రవదిశను. నిన్ను వదాన్యుడిందుఁ బుత్తెంచుటెఱుఁగుదు. నీనిష్ఠయు, స్త్రీలయందుఁ దగులనిచిత్తస్థితియుఁగంటిని. నీవింకఁ బోయి సుప్రభనువి

వాహమై సుఖముగా నుందుము" అనివాని సగౌరవంబుగా బంపెను.

ఓధర్మపుత్రా! అష్టావక్రుఁడట్లు త్తరదశచే ననుజ్ఞాతుఁడై మరలితన యాశ్రమమునకు వచ్చి సుప్రభను బెండిలియై, యనేకధర్మకార్యములు చేయుచు గౌరవకీర్తులంబడసెను. కన్యాదానమునకు వరుండెట్టివాఁడుగా నుండవలయునో, దానినీయుతిహాసముచే నెఱుఁగుము"

### 6. ధైర్యము. మూఁడువిధములు.

ధైర్యమనునది యెల్లయాపదలకు మందువంటిది "ధృతిచే సహాయయుతుఁడగు" నన్నట్లుగా ధైర్యమే మనుష్యుల కావత్సమయములఁ దోడై యుండును. ధైర్యము లేనివాఁడు వగలో మునిఁగి తాను జేయవలసిన కార్యములం దసమర్థుఁడగును. వివేకముగలవాఁడు సుఖదుఃఖములయందు గర్వవిషాదములను బొందకుండును. ఆపదలను ధైర్యముతో సహించి సౌఖ్యపడిన వారనేకులున్నారు. శ్రీరామనలహరిశ్చంద్రాదిపురుషవర్యులచరిత్రములును, సీతాదమయంతీ చంద్రమతులాది స్త్రీరత్నముల వృత్తాంతములును దీనికి నిదర్శనములు.

క॥ "ధృతియారోగ్యము నొసఁగును
ధృతియుజ్వలలక్ష్మిఁ బెచ్చుధృతిగీర్తినము
న్నతిఁ జేయుఁగాలగత్యవ
గతిగలిగిసఁగలుగుధృతివికారవిదూరా"॥

ఆపదలకోర్చుట యొకవిధమైన ధైర్యము. వెఱపుఁగొనక

శత్రువులపై నడచుటయును, ఉగ్రములయిన యాయుధముల మొనలపైకి ఉఱుకుటయును వేఱొకవిధమైన ధైర్యము. ఇది క్షత్రియులకు సహజమైన గుణము. ఉత్తములైన యోధులు రణరంగముపైఁ దమప్రాణములు విడుచుటకు సమ్మతింతురుగాని, పగవారికి వెన్నిచ్చి యుద్ధభూమినుండి తొలగిపాఱిపోవనొల్లరు.

మూఁడవవిధమైన ధైర్యమొక్కటి కలదు. అది మిక్కిలి శ్రేష్ఠమైనది. చిత్తచలనము గావించునట్టి వస్తువులు సమీపముగానున్నను వానిం జూచి మనస్సులో నేవిధమైన కోరికయు స్పృహయు లేక వర్తించుట. అష్టావక్రుఁడు తన్నుత్తరదిశ పరీక్షించినపుడు చూపిన మనోధైర్యము మిక్కిలి శ్లాఘ్యమైనది. పూర్వమర్జునుఁడింద్రలోకమునకుఁ బోవఁగా నందలి దేవదాసి యూర్వశి యనునది యతనిం గామించివచ్చిన నాతఁడు సమ్మతింపక దానిం దిరస్కరించిపంపెను. ఆతఁడు మనోధైర్యము లేనివాఁడైనచో నూర్వశివలలోఁ జిక్కి మహాదుఃఖమనుభవించియుండును. పరులసొమ్మపహరింప నొకనికి మంచిసమయము దొరకినను దానట్లు చేయనొల్లకుండుట, మేలైన మనోధైర్యము సూచించును మనోధైర్యము లేకపోవుటవలనఁగదా మనుష్యులు తృష్ణకులోఁబడి దుఃఖమనుభవించుచున్నారు.

క॥ "మదిసుఖముఁగోరి దుఃఖం
బొదవంగలకార్యములకునుత్సాహముసే
యుదురొప్పని తృష్ణంబడి
చదురేమియు లేని కుట్టిజనులాతురులై"

జితేంద్రియులును జితమనస్కులునైన మహాత్ములకీధైర్యము సహజమైయుండును.

ఏధైర్యముచేనొక్కఁడు, తనకెంత సంకటమైనను ధర్మమార్గముఁతప్పక తానాచరింపవలసినట్టివిధి విధాయకములైన కృత్యములను ఫలము కీర్తిమొదలైనవానిఁగోరక చేయుచుండునో, యదియే యుత్తమమయిన ధైర్యమనియు, నదియేసాత్వికధృతియనియు శ్రీకృష్ణుఁడుతనకు భక్తుఁడైనయర్జునునకుభగవద్గీతలోఁజెప్పియున్నాఁడు. అర్ధకామాది ఫలాపేక్షకై కష్టములకోర్చుట రాజసధృతి, మదమోహనిద్రాలస్యములను వృద్ధిఁబొందించునట్టి యల్పఫలములకై ధృతికల్గి పాటుపడుట తామసరూపమైనధృతి. ఇదిమిక్కిలి నింద్యమైనది.

## 7 దానము.

### (1) దానముయొక్క మేలిమి? వేదవ్యాసమహాముని ముద్గలుని చరిత్రమును ధర్మరాజున కెఱిఁగించుట.

పాండవులరణ్యవాసము చేయునప్పుడు వారిఁజూచుటకై వ్యాసమహర్షి యేతెంచెను. ధర్మరాజును దమ్ములును బాఁచాలియు మునివరున కాతిథ్యమిచ్చి నమస్కరించిన, వనవాసాయాసముచేఁ గృశించియున్న పాండవులంజూచి వగచి, ధర్మరాజునకు మునీంద్రుఁడిట్లనియెను. "ఓధర్మనందనా! మనుష్యులకు సుఖదుఃఖములు కాలవిపర్యయమునవచ్చుచుండును. కాలమెవ్వరికినొక్కరీతిగానుండదు. నీవుబుద్ధిమంతుఁడవు. కష్టములకోర్చి సౌఖ్యములనుభవింపుము. మనుష్యులు తపస్సుచే సర్వసుఖములంబడయఁజాలుదురు. క్షమయు, నహింసయును, సత్యమును సమత్వమును, శాంతియు, నింద్రియజయమును సంగపరిత్యాగ

మును మొదలయినగుణంబులుగలుగుట యేతపస్సుయొక్క లక్షణములు.

గీ॥ ఇందుఁ జేసిన పుణ్యంబులందుఁగుడుచు
మీఁదిజన్మంబునకునది మేలుసేయుఁ
గానదనశక్తితోఁగూడ దానధర్మ
చింపరోపకారములు చేయువలయు"

అనియిట్లుపదేశించిన ధర్మపుత్రుఁడు "మునీంద్రా! దాన తపంబులు రెండును మేలని యొఱింగించితిరి. వీనిలో మనుష్యులకెట్టిచేయ దుష్కరమైయుండును? ఏదియెక్కువఫలమునిచ్చు" ననియడిగెను. మునిపుంగవుఁడిట్లనియె "అయ్యా! దానతపంబులు రెండును శ్రేష్ఠంబులైనవి, వీనిలో దాన మూర్జితమైన ఫలము నిచ్చును. అదయే విశేషము. ఏలనఁగా నదిధనసాధ్యమైనది. ధనమునసంపాదించుట కష్టమైనకార్యము. నరులకుఁ బ్రాణము లకంటెను ధనము తీపైనది. శత్రురాజులతోఁబోరాడుటయు, నాయుధముల దెబ్బకోర్చుటయు, సముద్రములను గడచి పర దేశములకుబోయి యిడుములనుభవించుటయు, కృషిపశుపాల నాదికష్టములకులోనగుటయు, పరుల కధీనులైనవయుటయును ధనమును సంపాదించుటకేకదా? ఈప్రకారమనేక విధములుగా దుఃఖములనుభవించి యార్జించినధనమును విడుచుట కష్టమైనది కావున, దానమేమేలైనది. అన్యాయార్జిత ధనమునిచ్చుటచే ఫల మేమియుఁగలుగదు. ధర్మమార్గముగా లభించినయట్టి ధనము పాతికయైనను దానమిచ్చుటచే ఫలముగల్గును. "దేశేకాలేచ పాత్రేచ తద్దానంసాత్వికంస్మృతం" అని భగవద్గీతలోఁ జెప్పినవిధముగా, పుణ్యదేశములయందు, పుణ్యకాలముల మహాత్ము

లును, సద్ధర్మనిరతులును నైన పెద్దలకు దానమిచ్చుట సాత్త్విక దానమందురు. పూర్వము ముద్గలుండను పుణ్యాత్ముఁడైనబ్రాహ్మణ శ్రేష్ఠుఁడు, సత్పాత్రమునందు ధర్మార్జితమైన ధనము నిచ్చి పుణ్యలోకంబునకుఁ బోయెను. అముద్గలుని చరిత్రము నువినుము"

" పూర్వము కురుక్షేత్రమున సత్యవ్రతుండును జితేంద్రియుండును, శిష్టాచారనియతుండును, అతిథిప్రియుండును నైన ముద్గలుండను బ్రాహ్మణోత్తముఁడు తనభార్యాపుత్రులతో వసియించుచుండి, యుంఛవృత్తియే తనకు జీవనోపాయముగాఁ గలవాఁడై యుండెను. అతఁడు పాడ్యమి మొదలుకొని పదునాల్గు దినములొక్కొక్కగింజ యకాఁదూమెడువడ్లు నమకూర్చి, పదునేనవదినమైనపర్వంబునాఁడు దానినిపాకము చేయించి, దేవపితృపూజలు చేసి, యతిథులకుఁబెట్టి, మిగిలినయన్నంబును దానుభార్యాపుత్రసహితుఁడై భుజించును. ఇట్లుండగా నొక్క నాఁడు పర్వదినంబున దుర్వాసుఁడను మునివర్యుఁడు వెంట్రుకలు విరియఁబోసుకొని, వస్త్రముధరియింపక పిచ్చివానివలె దుర్భాషలాడుచు, నాతనియింటికతిథియై వచ్చెను. వచ్చిన మునివర్యుని జూచి యేవగింపక, ముద్గలుఁడాతనికిఁ బూజలుసల్పి యన్నము బెట్టెను. అతఁడుకడుపునిండఁగుడిచిమిగిలినయన్నమును దనమేనుపై నలఁదికొని మరలి పోయెను, మునిపతియిట్లేపర్వము పర్వంబునువచ్చి చేయుచుండినను ముద్గలునకుఁగోపమును వగయును గలుగలేదు. ఇట్లాఱుపర్వములైన దుర్వాసుడు ముద్గలుంజూచి " అయ్యా! నీచిత్తమున నొక్కకొఱఁతయుఁగానలేను. నీయట్టిదానశీలుని నేనెందును జూడలేదు. మనుష్యుల కాఁకలియును

నదిపిశాచమువంటిది. అదికోపంబును రేపును, అధర్మకార్యము లుచేయ ప్రోత్సాహపఱచును. వివేకము చెఱుచును.

నీవు మనమున నేవగింపవు. నన్నవమానపఱచవు. నా పైఁగినియవు. ఆకలికిదూలిపోవు మనస్సులోనేవిధమైన వికారమును జెందవు. మనమునునింద్రియములనునీయధీనముగాఁ జేసుకొనుటచే నీవేతపశ్శాలివైతివి. నీయొక్క ధర్మమునకుఁ బ్రీతులై దేవతలు దివ్యరథారూఢులై వచ్చి నిన్నుభార్యాపుత్రసహితంబుగాఁగొని పోవనిదిగోవచ్చియున్నారు. నీవీయొడలితోడనే స్వర్గమునకుఁబొమ్ము” అనిసంతోషముతో దుర్వాసుఁడు వెడలి పోయెను.

కావున నోధర్మనందనా నీవును దానాది సత్కార్యనిరతుఁడవై తపస్సుసల్పుము. నీకుసర్వశుభములుదానఁగలుగును. పదుమూఁడవయేటికడపటఁ బిత్రుపైతామహంబైన రాజ్యమును బొందిసుఖించెదవు” అనియిట్లుపాండవులనాశ్వాసించి వ్యాసమహర్షి తనయాశ్రమమునకుఁబోయెను.

## (2) దానపాత్రవిషయమైభీష్ముఁడు ధర్మరాజున కెఱింగించినవిషయములు.

ముందొకప్పుడు ధర్మరాజు యెట్టివారికి దానమియ్యవలయునని భీష్మాచార్యులవారినడుగనప్పుహానీయుధర్మజుఁడిట్లనియె. “అయ్యా! దానమనునది యెల్లవారికిని సామాన్యముగానుండవలసినగుణము. నిరుపేదయైనవాఁడు తనకుఁగల భంగియొరులకియ్యవచ్చును. అతఁడుకుంచెడు ధాన్యమిచ్చుటయు, ధనకోటిని

ధనవంతుఁడిచ్చుటయును నొకేవిధమైన ఫలమునే యిచ్చును. ముఖ్యముగా నిచ్చుచోటఁ బాత్రమెఱుఁగవలయును. సత్పాత్రములకిచ్చినదానము పెక్కుమడుఁగులై ఫలమిచ్చును. దూరముగానుండివచ్చువారలును, అపూర్వులైవచ్చియాచించువారును, సదాచార సంపన్నులును, విద్యగలవారును, వేదశాస్త్రములు జదివినవారును, దానముగొనుటకుఁదగినవారు. దారిద్ర్యముచేఁ గుందుచు నెవ్వరినడుగనేరక యార్తుఁడైయున్న బ్రాహ్మణునకు దానమిచ్చుట మిక్కిలి శ్రేష్ఠమయినది.

చ॥ అడిగిననిచ్చుకంటెనునయాచకుఁ గాఁగ నెఱింగియిచ్చుటె
క్కుడు ఫలమిచ్చుదానవిధికోవిద, వేఁడుటచావు, వేఁడగాఁ
బడుటది పెద్దచావు, తగుప్రార్థనపూర్ణము చేయునాతఁడా
యడిగినవానిఁదన్నునదయారతిఁగావఁగఁజాలువాఁడగున్॥

పూర్వము యయాతి మహారాజు దేవేంద్రునియొదకుఁబోయిన నతఁడు రాజుంజూచి నీవుపూరునిరాజ్యాభిషిక్తుఁజేసి వానికేమి యుపదేశించితివియడుగ, నమ్మహీపతి చెప్పినవాక్యములు వినుము.

కం॥ ఇచ్చునదిధనముపాత్రున
కిచ్చుగనొరువేఁడకుండునదియభిముఖులై
వచ్చినయాశార్థులవృథ
పుచ్చకచేయునదిసర్వభూతప్రీతిన్॥

అపాత్రునకు దానమిచ్చుట శిలను దేవప్రమానుగాఁగొని సముద్రమునులంఘింపదలఁచినట్లును, షండునకుఁబుత్రినిచ్చినట్లును, దూదిలో నేయివేల్చినట్లును నిష్ప్రయోజనమగును. పునుకలోను, కుక్కతిత్తిలోనుబోసిననీళ్లు మిక్కిలి నింద్యమైదుష్టమగునట్లు, అయోగ్యులైనవారికి దానము చేయుట వృథయగును.

పాడియు నాడియుఁబ్రతుకువారు, పరిహాసకులు, దుర్జనులు, అంగహీనులు, ఉన్మత్తులు, మ్లేచ్ఛులు, మూర్ఖులు, కులము చాలనివారు, వేదము చదువనివారు, దురాచారులు మొదలగు హీనులెల్లను దానమునకుఁదగిన పాత్రములుగారు. అట్టివారి కిచ్చుటచే దోషమువచ్చును. ధర్మలబ్ధమైనధనమును పాత్రములకుఁ బెట్టకుండుటయును పాపము.

గీ॥ పాడిదప్పకుండఁబడసినయర్థము
పాత్రములకు నీగి, పాత్రములకు
బెట్టకునికియునఁగనెట్టనరెండు వి
ధములఁగీడుదొడరుధరణినాథ॥

దానములలో నన్నదానమును, భూదానమును, గోదానమును, శ్లాఘ్యములైనవని చెప్పుదురు. వీనిచే మనుష్యులకుఁ బాపములుతొలఁగును. మీఁదిజన్మమునకు మేలుకలుగును, అయితే నింద్యమైనపాత్రములకిచ్చుటవలన లాభములేదు. ఓటికుండలో నీరుపోసినట్లేయగును. కావున ధర్మనందనా! దానమిచ్చుచోటఁ బాత్రమెఱుగవలయు. అన్నిదానములకంటె సర్వభూతములకభయమిచ్చుటయును, శత్రువునకైనను ప్రాణదానము చేయుటయు మిక్కిలి విశిష్టములు.

## 8 సంతుష్టి; లేకతృ.

### వామనుఁడు బలిచక్రవర్తితోసంభాషించుట.

పూర్వము విష్ణుదేవుఁడు బలిచక్రవర్తిని భంగపఱచుటకై కశ్యపమహాముని భార్యయైనయదితియను పుణ్యాంగన గర్భము

వారాశిపరివృతమేదినీవలయసామ్రాజ్యంబు గల్గియుండియును తృప్తిని జెందరైరి. ఉన్నదానితోఁదృప్తిఁజెందువానికిఁగల్గుసుఖము వారు బొందరైరి. ఆశవంటిదుఃఖమును నిరాశవంటి సుఖమును లేదు. "సంతుష్టుఁడీమూఁడు జగములఁబూజ్యుండు, సంతోషికెప్పుడు జరుగుసుఖము, సంతోషిగాకుంట సంసారహేతువు, సంతసంబున ముక్తిసతియు దొరకుఁ, బూఁటపూఁటకు జగంబులయు దృచ్ఛాలాభతుష్టినిదేజంబుదోన పెరుగుఁ, బరితోషహీనతప్రభ చెడిపోవును జలధారననలంబు సమయునట్లు" కావునవోరాజా! నీవు ప్రభువనినిఖిలంబునడుగుట నాకుఁదగవుకాదు. నాకుఁదగిన కొలదియేను వేఁడుకొంటిని. ఈపదత్రయమునుజాలదనకయిమ్ము. చాలునాకదియే"

అనియిట్లువామనుఁడు బలిచక్రవర్తికి సంతుష్టియొక్క విశేషమును, తనకుఁగలదానితో సంతోషపడనివాని దుఃఖమును విస్తరించిచెప్పగా, నప్పుడాఖర్వుని యఖర్వతేజోబుద్ధులకు బలిచక్రవర్తిమెచ్చి భూదానముచేయఁదలంచెను.

ఆశయయెల్లచేటులకుమూలము. నిరాశయపరమసుఖము.

## ౨ కీర్తిప్రియత్వము.

### ఇంద్రద్యుమ్నమహారాజ చరిత్రము.

ధర్మరాజు వనవాసము చేయుచుండిన కాలమునఁ నాతని యొద్దకు మార్కండేయమహామునివచ్చి వివిధములైన ధర్మములెఱింగింపగా, నమ్మహీపతి యమ్మహర్షింజూచి "మునీంద్రా! మీకంటె వృద్ధులైనవారు జగతిలోనున్నారా?" యనియడిగెను. దానికిఋషిపుంగవుఁడిట్లని చెప్పెను.

పూర్వ మింద్రద్యుమ్నుఁడను జనపతి ధర్మమార్గము తప్పక రాజ్యపరిపాలనము చేసి యింద్రలోకమునకుఁ బోవఁగా బహుకాలమున కాతనికీర్తి భూలోకములో నాసిపోయెను. అంత దేవతలు నీవింక స్వర్గలోకములో నుండ లేవని వానినుర్వి పైఁద్రోచిన నతఁడు నేనుండు కడకు వచ్చి నన్నెఱుఁగుదువా యని యడిగెను. అప్పుడు "నేను అయ్యా! నేను నిజముగా నిన్నెఱుఁగను. హిమశైలశృంగమునందుఁ బ్రవాళకుండను పేరు గల ఘూకమున్నది. దాని నడుగు" మంటిని. రాజు నన్నుం దోడ్కొని యులూకముపాలికిం జని నన్నడిగి నట్లడుగ నదియుఁ గొంతసేపు చింతించి "రాజా! నిన్ను నే నెఱుఁగఁజాలకున్నాను. ఇంద్రద్యుమ్నంబను కొలనియందు నాకంటె వయస్సునఁ బెద్దయైన నాళీకజంఘుఁడను బకవల్లభుఁడున్నాఁడు. ఆతనింగని యడుగునది" యని వాక్రుచ్చెను.

అప్పుడు రాజు నన్నును ఘూకమును మోచికొని నాళీకజంఘునొద్దకుం జని తనపేరు చెప్పి "నన్నెఱుఁగుదువా" యని యడుగ నాబకశ్రేష్ఠము "అయ్యా! నేను నిన్నెఱుఁగను. నాకంటెను జిరకాలజీవియైన యుగంధరుఁడను పేరుగల కచ్ఛపము కొలనిలోనే యున్నది. దానినడిగిన నీవిషయమై చెప్పనోపు" నని యెను, అప్పుడందఱు సరస్సులోనున్న కమఠమును బిల్వఁగా నది బయటికి వచ్చెను. అప్పుడు బకరాజు ముసలి తాఁబేలుం జూచి "అయ్యా! ఒకసందేహము తీర్చుకొనుటకై వీరిందు వచ్చియున్నారు. నీవీయింద్రద్యుమ్నమహారాజు నెఱుఁగుదువా" యని యడిగెను. కొంతసేపు తనలోఁ దలపోసి కన్నుల నీరు తెచ్చుకొని కమఠ మిట్లనియెను. "అయ్యా! ఈమహాగుణభూష

ణుఁడైన యింద్రద్యుమ్న మహారాజుని మఱువ వచ్చునా? నా కెన్నియో మాఱు లిందువచ్చి నన్నాదరించి ప్రాణభయంబు లేక చేసెనే. ఆదయామయుని నాకెన్నఁడైన మఱువంగరాదు అతఁడు యజ్ఞదక్షిణార్థముగ విప్రవరుల కిచ్చిన గోగణంబులు గొరిజలచేఁ ద్రవ్వటచేతనే కదా యీసరోవర మేర్పడెను.

అనియిట్లు చెప్పఁగా దేవదూతలు విమానంబులుగొని వచ్చి రాజుంజూచి " మహీవల్లభా! నీకీర్తిజగంబులో శాశ్వతమై నిల్చెను. నీవుమఱలస్వర్గమునకురమ్ము" అనివానిందోడ్కొనిచనిరి.

క॥ తనకీర్తియెంతకాలము
వినఁబడునిజ్జగమునందు వెలయఁగనందా
కను బుణ్యలోకసౌఖ్యం
బున నెంతయునుల్లసిల్లుపురుషుండనఘా॥

"ఓ ధర్మనందనా! నాకంటెవృద్ధులైనవారి నెఱిఁగించితిని, కీర్తియేపుణ్యలోకములనిచ్చును. కీర్తియేధనము. కీర్తి లేనివాఁడు కేవలము శవమువంటి వాఁడు."

ఉ॥ కీర్తియు నిచ్చుఁ బుణ్యగతి కీర్తియు తల్లియుఁబోలెఁ బ్రోచు మన
త్కీర్తియ యాయువున్ సిరియుఁ గీర్తివిహీనుఁడసూవశంబుడూ
త్కీర్తికి నెల్లచేటులును గిట్టవహారించు ననండె తొల్లి భ
ర్తృహరుండు నాఁబరఁగునంబుజసూతి జగద్ధితంబుగన్॥

## 10. ఆశ్రితపోషణము.

### శిబియను రాజర్షి చరిత్రము.

తొల్లి భృగుతుంగమను పర్వతమున శిబియను రాజు యజ్ఞము చేయుచుండఁగా, నతని మహాగుణంబు లెఱుంగ వేఁడి

యింద్రాగ్నులిరువురు శ్యేనకపోతరూపములు దాల్చిరి. అప్పుడు శ్యేన భయంబుచేఁ గపోతంబు పఱతెంచి శిబి మఱువు సొచ్చిన, దానిని విడువక తఱుముకొని వచ్చి శ్యేనము శిబి కిట్లనియెను. అయ్యా! నిన్ను సత్యసంధుఁడనియు, నిర్మలుఁడనియు, ధర్మజ్ఞుఁడనియు, లోకంబు కొనియాడును. నే నాఁకలిగొనియున్నపుడు నేను మ్రింగదలచిన కపోతమును డాచి, నాకాహారవిఘ్నము చేయుట నీకుఁ దగునా? సర్వభూతము లాహారముచేతనే జీవించి వర్ధిల్లును. ఈపావురంబు నాకియ్యనినాఁడు నాకు బుభుక్షావేదనచేఁ బ్రాణవియోగమగును. నన్నుఁగానలేక నాపుత్రులును భార్యయు జీవింపనేరరు. ఒక్కకపోతంబు రక్షించి, పెక్కుజంతువులకు హింసగావించుట ధర్మవిరోధమగును. ఒకధర్మమునకు బాధసేయు ధర్మమును ధర్మముగా ధర్మజ్ఞులు గైకొనరు. నీ వెఱుఁగనిది కలదే? పావురంబు విడువుము.''

శిబి యిట్లనియె "పక్షివరా! నీవు ధర్మ మెఱిఁగినట్లు పల్కుచున్నావు. నామఱువు సొచ్చిన పావురమును నే నెట్లు విడుతును? ఆశ్రితులను పరిత్యజించుటకంటె లోకములోఁ బాతకమొక్కటి లేదు. ఈకపోతమాంసంబునం గాక నీ యాఁకలి యన్యమాంసాదులచేఁ దీరదా? నీకుఁ గావలసినంత మృగమహిష వరాహ ఖగమాంసంబులు దీనికంటె మిక్కిలిగాఁ బెట్టెద. ఈకపోతంబుపై నాగ్రహము విడువుము. ప్రాణభయంబుచేఁ వచ్చి నన్నాశ్రయమడిగిన దానిని విడువను.''

డేగయప్పల్కులు విని "అయ్యా! నాకిప్పక్షి వేదవిహితమైన మాంసము. 'శ్యేనాః కపోతాన్ ఖాదయంతి.'' యను

వేదవచనంబులు వినలేదా? ఇది యే నాకాహారము గావలయును. దానిని దయకిమ్మని" యెంత యడిగినను దానిని విడువనని పట్టుపట్టిన రాజుం జూచి మఱియు డేగ యిట్లనియె "భూపతివర్యా! ఈపావురము నాకు విహితభక్షణము, దీని నీకుఁ గావఁబుద్ధిగలదేని నీ దేహములోనుండి కోసి దీనియంత మాంసమును దూఁచి నాకుఁ బెట్టుము. అప్పుడు నేను సంతోషమును బొందఁగలను."

అనిన రాజు సంతోషించి పక్షిం జూచి "ఓ విహగోత్తమా! మేలు చేసితివి. ఇదిగో నాయొడలి మాంస మిచ్చెద"నని తక్షణంబ తులలో నొక్కవైపు పావురము నుంచి, రెండవ తక్కడలోఁ దన దేహమునుండి మాంసమును గోసి వైచెను. తన యంగములోని మాంసమునంతయు బెట్టినను కపోతశరీరమాంసమే వ్రేగై యుండెను. దానిం గని శిబి యాశ్చర్యపడి దేహమెల్ల నెత్తురు దొరుఁగ నత్తులమెక్కి తాను గూర్చుండెను.

అప్పుడు వాని గుణోన్నతికి వాసవదహనులు మెచ్చి, శ్యేనకపోతరూపంబులు విడిచి తమ తమ నిజరూపంబులతోఁ బొడసూపి రాజుంజూచి యిట్లనిరి. "ఓమహాత్మా! నీశౌర్యధైర్యాదిగుణము లనన్యసాధారణంబులు. నీ కాశ్రితులయందుఁగల వాత్సల్యము కొనియాడఁ దగినది. భూలోకములో నీకీర్తి శాశ్వతమై నిల్చెను." అని వానిం బలువిధంబుల స్తుతించి వాఁడు కోరిన వరంబులిచ్చి యింద్రాగ్నులు చనిరి.

ఆశ్రితులను గరుణతోఁ బ్రోచుటయే యుత్తములయొక్క గుణము.

## 2 ధర్మరాజు గంధర్వులచేఁ జెఱఁగొనబడిన దుర్యోధనాదుల విడిపించుట.

పాండవులు ద్వైతవనంబులో వన్యమూలఫలంబు లాహారంబుగాఁ గడుదీనవృత్తి నున్నారనియు, వారికి మనస్తాపమతిశయిల్లునట్లుగాఁ దాను మహావైభవంబు మెఱయ వారికిం బొడసూపుట లెస్సయనియు, దుర్బుద్ధియైన దుర్యోధనుఁడు తనకాప్తులైన కర్ణ, శకుని, దుశ్శాసనులతో దుర్మంత్రంబు జేసి, ఘోషయాత్రనెపంబున ద్వైతవనంబునకుఁబోవ నిశ్చయించెను. తండ్రియగు ధృతరాష్ట్రుఁడు పాండవులు ద్వైతవనంబులో నున్నారని నెఱిఁగి కొడుకుం బిల్చి, " అయ్యా! పాండవులు నీచే మూఁడుబన్నము వడియున్నారు. వారుకోపించిరేని నిన్నును నీవారినినిర్మూలము చేయుదురు. అమ్మహాత్ములకు మీరుకీడు చేయఁజూతురు. దాననెగ్గగును. మిమ్ములంజూడఁగనే భీమసేనునకుఁ గోపంబతిశయిల్లును, వాఁడు మీకుమిత్తియని నేను భయపడుచుందును. మీరందుఁబోనేల? వలయునేని గోపులరక్షింపనొరులంబంపుదము" అనియతని వారించెను. అవినీతుఁడైన కొడుకుతండ్రిపలుకులు వినక, పాండవులు మునివేషులై యున్నారనియు, వారుసమయమతిక్రమించి తమపై యుద్ధమునకు రారనియు, ధర్మరాజునకుఁదమ్ములెల్లలోఁబడినవారు గనుక వారాతనియాజ్ఞను మీఱి నడుచుకొనరనియునుడివి, సోదరపరివారామాత్యభృత్యస్త్రీజనంబులతోడను, రథగజతురగపదాతి వర్గంబులతోడను మిక్కిలి వైభవంబు మెఱయఁ బురంబువెలువడి ద్వైతవనంబునకుఁ బ్రయాణమయ్యెను.

దుర్యోధనుఁడుమహావిభూతితో వనంబుజొచ్చి ఘోష

మధ్యంబునందొక్క రమణీయప్రదేశంబున శిబిరంబుగావించు
కొనియుండ, గోపాలకులెల్ల నతనిం జూడవచ్చిరి. గోసమృద్ధికి
సంతసిల్లి యతఁడు వారలకు బహుమతులొసంగెను. అంతనోర
సస్వాదనకుతూహలుఁడై తనయిష్టులైన కర్ణాదులతో నతడుకొం
తసేపువిహరించెను. తర్వాత గాయక నర్తకాదులును వందిమా
గధజనంబులును రాజుంగని యభితంబులునడసిచనిరి. అటమీఁ
ద మృగయావినోదంబునందగిలి జింకలం దఱుముచు, నేనుంగు
లంబట్టి బంధించుచు, సింహంబుల హింసింపుచు, మహిషశా
ర్దూలాదులమర్దించుచు, రాజమృగయులతోఁ గాననంబంతయుఁ
దిరిగెను. ఇట్లు బహుప్రకారంబుల విహరించి దుర్యోధనుఁడు
జలక్రీడఁగావింపనెంచి ద్వైతవనసరోవరంబు డాయుంజని, తనభృ
త్యులంబిల్చి కొలనిగట్టున క్రీడాగృహంబులు నిర్మింపనాజ్ఞయి
చ్చెను. అచ్చటనే ధర్మరాజు మునిజనసహాయుఁడై సద్యస్కంధ
మను యజ్ఞమును జేయుచుండెను.

సేవకులు చెరువునకు సమీపముగాఁ గ్రీడాగృహంబు
లుగట్టుటకుఁబూనఁగా, నప్పుడు గంధర్వులుకొందఱు పఱతెంచి
వచ్చి " ఓభృత్యులారా! ఇదిగంధర్వరాజగు చిత్రసేనునికొల
ను. అతఁడిందుఁదనభార్యలతోనిప్పుడు విహరింపవచ్చును. మీ
రిందుండరాదు. తొలఁగిపోవుడని వారలందఱుముగా, వారుమగు
డంజని దుర్యోధనునకంతయు నెఱింగించిరి. అతఁడు దుర్మదాం
ధుఁడై, యెదిరినిదన్నును నెఱుఁగక సేనలంగూర్చుకొని తమ్ముల
తోను, తక్కిన దొరలతోను, గంధర్వులపైఁబడెను. కురుసేనల
కును గంధర్వులకును బెద్దపోరయ్యెను. చిత్రసేనుఁడు దుర్యోధను
నెదిర్చి యతని సేనలపై బాణవర్షము కురియుఁగానతండు నిలుప

లేకపోయెను. కర్ణుడు విరథుండై భంగపడి రణరంగమునుండితొ లఁగెను. దుశ్శాసనాదితక్కిన దొరలును రణసంరంభముడిగిరి. కురుసేనలువాతాహతిందూలుమేఘములవలెఁ జెల్లాచెదరయ్యెను. అప్పుడు చిత్రసేనుని యాజ్ఞాప్రకారముగా దుర్యోధనాదులను గంధర్వులు బంధించి కొనిపోయిరి. అమాత్యులుకొందఱు పఱతెంచివచ్చి ధర్మరాజుశరణంబుజొచ్చి "ఓధర్మనందనా! నీతిజ్ఞులంగావుము. దుర్యోధనుఁడు సోదరస్త్రీసమేతముగా నిందువచ్చి గంధర్వులనెదిర్చి, వారిచేఁబరాజితుఁడై పట్టువడియెను. నీవువారిచెఱఁదలంగఁ జేయు" మని మొఱపెట్టుకొని, జరిగిన వృత్తాంతమంతయు సవిస్తరంబుగా నెఱిఁగించిరి.

భీమసేనుఁడంతయువిని పరమసంతోషభరితుఁడై యన్నంజూచి "అన్నా! మనము చేయఁదలఁచినపనిని గంధర్వులు చేసినకార్యమును లఘువుగాఁ జేసిరి. ఊరకుండఁగనే మనలను జయమునొందెను. నీచుఁడైన దుర్యోధనుఁడు మనలనవమానింపఁదలచి యిందులకేతెంచి దానికిఁదగిన ఫలమునుగుడిచెను. అప్పాపాత్మునకుఁగృపసేయవల" దనియెను. ధర్మరాజు కరుణాపరతంత్రుఁడై తమ్మునింగనుంగొని "భీమసేనా! ఇది పరుషవాక్యములకు సమయమా? గంధర్వులచేఁజిక్కిన కౌరవులనువిడిపింపకుండుట నీకుధర్మమగునా? జ్ఞాతులైనవారితోఁ గలహించినను సహజమైనబంధుస్నేహమును జూపకుండనుపేక్షింపరాదు. శరణాగతరక్షణంబు నీవంటి బలసంపన్నులకు గర్తవ్యమగును. కావుననీవును దమ్ములును రథంబులెక్కి సర్వాయుధసన్నద్ధులరై చని దుర్యోధనుని బంధుసహితముగా విడిపింపు" డనియెను.

అప్పుడు మఱియు భీముఁడుపూర్వవైరమెల్లఁదలఁచుకొని

యన్నతో నిట్లనియెను "అక్కటా! ఈదురాత్ముఁడు మనలను
లక్కయింటిలోఁ గాల్పనెంచెను. నాకువిషముపెట్టెను. నన్ను
గంగలోఁద్రోపించెను. మాయాజూదంబునమనసిరియెల్లనుగొని
యెను. సాధ్వియుఁబరమపతివ్రతయునైన ద్రౌపదిందలపట్టియీ
డ్పించి,సభలో నవమానపరచెను. వీఁడు మనకెగ్గుచేయనిదినము
కలదా?నీవిదంతయుఁ దలఁపక కేవలముకరుణయవూనియుందు
వు. ఇట్టులైన మనకుఁగార్యహానిగలుగదా?"

అనికోపించి పల్కినభీమసేనునిశాంతవచనంబులననున
యించి ధర్మరాజిట్లనెను. "తమ్ముఁడా! ఇదికోపమునకవసరము
కాదు. దుర్యోధనుని మంత్రులు మనబలపరాక్రమంబు లెఱిఁగి
కదా మనయొద్దకు వచ్చిప్రార్థించిరి. దుర్యోధనుఁడునునీబలవిక్ర
మంబులెఱుఁగును మనమువిడిపింతుమనియాసఁగొనియుండును.
కావుకావుమనిదీనజనులఱవఁగా, వారియెడబలహీనులైననుదమ
చూపినంతచేయుదురనిన, నీవంటియుత్తమశూరునకూరకుండఁద
గునా?దుర్యోధనుఁడు పగవాఁడైనను దుర్నీతిపరుఁడైనను, వానిమ
నమునిగ్రహించుట మేలుగాని, వాఁడుపరులచేఁజిక్కినప్పుడువాని
యెడనుపేక్షించుట ధర్మముకాదు. తమ్ముఁడా! యిదిమనకుఁ
బుణ్యంబును గీర్తియును సంపాదించుకొనుసమయము. లెమ్ము,
తమ్ములంబిల్చుకొని వేగముగాఁగదలి గంధర్వులనోర్చి, దుర్యో
ధనాదుల విడిపింపుము"

అనియిట్లు ధర్మరాజు పలువిధంబుల నాశ్రితుల విడువ
రాదని చెప్పఁగా, నట్టకేలకు భీమసేనుఁడు సమ్మతించి, యా
యుధసన్నద్ధంబైన తేరెక్కి, తమ్ములతో గంధర్వులపైఁబడి వా
రినశ్రమముననోడించి, దుర్యోధనాదులను విడిపించి ధర్మరాజు

ముందట తెచ్చి నిల్పెను. ధర్మరాజు ధార్తరాష్ట్రునిం గనుఁగొని " అయ్యా! ఇట్టిసాహసంబు లెన్నఁడు నొనర్పకుండుము. దుర్జనులంగూడినవాఁడు సాహసక్రియలందుఁ గడంగి నశించును. తమ్ములను స్త్రీలను గైకొని పురంబునకుఁ బోయి సౌఖ్యముగా నుండుము. నీవు మనస్సులో దీనిం దలఁచుకొని దుఃఖపడకుండు" మని బుద్ధిసెప్పియతని వీడ్కొలిపెను. దుర్యోధనుఁడు యవమానంబు బొంది దీనవదనుఁడై చనియెను. ఆశ్రమవాసులెల్లరు ధర్మరాజుయొక్క ధార్మికత్వంబును బొగడుచుండిరి.

గీ॥ శరణుజొచ్చినరక్షింపఁజాలియుండి
కడపబుచ్చినమూర్ఖులోకములుదప్ప
బుణ్యకర్మంబులఫలతఁబొందుననఁడె
కమలగర్భుండుతొల్లిజగద్ధితముగ॥

## 11 ఆశ్రితుల ధర్మము.

### భీష్ముఁడు ధర్మరాజునకు నాశ్రయంబు విడువ రాదని చెప్పుట.

" ఓజ్ఞాననిధీ! ఒక పురుషుఁడు తనజీవనమున కాస్పదమైన పురుషునెడ నెట్టివిధంబుగా నడుచుకొనవలయు," నని యొకప్పుడు భీష్మాచార్యుని ధర్మరాజడుగ, నభ్యాపతికి భీష్ముఁడిట్లనియెను.

" అయ్యా! కాశీశ్వరుని దేశముననొక బోయవాఁడు వేటకై పోయి విషలిప్తమైన శరంబుచేనొక్క మృగంబునేయ, నదిగుఱితప్పి యొకమహావృక్షమునం దాకెను. పువ్వులను గాయ

లను గలిగి యొప్పుచుండిన యాభూరుహం బప్పుడే విషంబు తగిలి యెండిపోయెను. ఆవృక్షము తొఱ్ఱలో నివసించుచుండిన చిలుక యొక్కటి బహుదినంబులుగాఁ దానందు వసించుటను దలఁచి, చెట్టుపై నధిక భక్తియు విశ్వాసమును గలది కావున, దానివిడిచి పోవక యెండ వానల కోర్చి యందే యుండెను.

దానియుదాత్తవృత్తి కచ్చెరువంది దేవేంద్రుఁడు మనుష్యరూపము ధరించి దానియొద్దకు వచ్చి "ఓకీరమా! ఈయరణ్యములో ఫలభార వినమ్ర శాఖలుగల తరువులనేకము లున్నను నీవు వానిపై నిల్వక, శుష్కించియున్న నీచెట్టును వదలకుండుటకుఁ గారణంబేమి?" యనియడిగెను. అనిన చిలుక యిట్లనియె. "అయ్యా! బహుదినంబులుగా నీచెట్టు నాకు ఫలములిచ్చుచు, రమ్యమైన నివాసముఁ గాపించుచుండినది. ఇప్పుడిది యెండిపోయెనని నేను దానివిడిచిపోవుట తగవగునా? ఓ దేవేంద్రా! యది చేసిన మేలును మఱచినట్లు కాదా?".

దేవేంద్రుఁడ ప్పక్షి తన్నెఱుఁగుట కాశ్చర్యపడి, యిది పూర్వజన్మమునందుఁ జేసినపుణ్యముచేఁ గలిగిన జ్ఞానమని తలఁచి, యక్కీరమునకు మేలుగావింప నుద్దేశించి దానితో "ఓవిహంగోత్తమా! నీదుపలుకులువిని మెచ్చితిని. నీకాశ్రయంబైన వృక్షముపైఁ గల భక్తి యెంతయు విశేషమైనది. నీకు వరమిచ్చెద వేఁడుకొను" మనఁగా, నది తాను వసించియుండిన చెట్టునకుఁ బేరిలమి వేఁడెను. అమరపతి యప్పుడమృతవర్షంబు కురిపించి చెట్టును మఱల జీవింపఁ జేసి, దానికి మునుపటికంటె నతిశయము మెక్కువగునట్లు చేసి పోయెను.

అయ్యా! కౌరవోత్తమా! మేలైన యాశ్రితులిట్లు తమ ప్రభువులకుఁ బరెలమి సేయుదురు."

## 12 మానుషప్రయత్నమవశ్యమైనది.

### (1) ద్రౌపదీ ధర్మరాజుల సంవాదము.

పుడమియును రాజ్యమును బంధువులను విడిచి, దివ్య భోగముల కెల్ల వెలియై యడవులలో నిడుమలు గుడుచుచున్నతి సభర్తలం జూచి పరితపించి, ద్రౌపది యొకప్పుడు ధర్మరాజున కిట్లనియెను. "ఓమనుజేంద్రా! అవినీతులైన ధార్తరాష్ట్రులచేత నపహృతరాజ్యుండవై తమ్ములతో వనంబునకువచ్చి, ధర్మమే పెట్టయని తలచి, శత్రువుల నుక్కడఁగింప యత్నము చేయకుండుట నీకుఁదగునా? ధర్మదూరులైన దుర్యోధనాదులందు ధర్మబుద్ధి గల్గి నర్తింపనేల? నికృతి పరులందు నికృతి సేయనివారు వంచితులగుదురు. పాపాత్ములయెడ క్షమగల్గి యుండనేల? బలవిక్రమాతిశయములుగల నీతమ్ములు నీయాజ్ఞకు లోఁబడి, చెఱలోఁ బడిన సింహశిశువులవలెఁ బరాక్రమంబు విడిచి, యుత్సాహరహితులై యున్నారు. వారి కనుజ్ఞయిమ్ము, దుర్మతులైతున దుర్యోధనాదుల నెల్ల నొక్క పెట్టున సంహరించి వారు నీరాజ్యలక్ష్మి నీకొప్పగింతురు."

అప్పలుకులు విని ధర్మరాజు "యాజ్ఞసేనీ! ఇది కోపమునకు సమయము కాదు. కోపము ధర్మకామార్థహాని గావించును. కోపమును వదలినవాఁడు దేశకాలతత్త్వమెఱిఁగి తేజంబు జూపి శత్రువుల నోడించును. ఓర్పుగలవానికి జయము సిద్ధించును. మ

నము పద్మూడేండ్లు వనంబులోనుండి తర్వాత శత్రువులపై దండెత్తుట లెస్స" యని చెప్పెను.

ద్రౌపది మఱియు నిట్లనియె "ఓ అజాతశత్రూ! శత్రువులయెడ క్షమయు దయయు, ధర్మమును జూపువారుగలరా? ధర్మాత్ములును సత్యసంధులును బరాక్రమ సంపన్నులునైన మీకు విహీనతయును, అన్యాయపరులైన ధార్తరాష్ట్రుల కున్నతియుం గావించిన విధికి నేనేమందును? విధిబలవంతమైనదని యూరకుండుట పురుషులకుం దగునా? తొల్లి నీతిమంతులైన బ్రాహ్మణులు నాజనకు నెఱుకువచ్చి చెప్పిన వాక్యముల వినుము. బుద్ధిమంతులగువారుత్సహించి కర్మములు చేయుచుండవలయును స్థావరములట్లు జనులు జీవింపనేరరు. దైవమును మనుష్యునియత్నమును ఫలసిద్ధికిం గారణములైయెనను, నరుడు ప్రయత్నపరుండు గావలయును. అర్థసిద్ధినిశ్చయించి కర్మములకుం జొరనివానికి దైవానుకూల్యమెట్లగును? పురుషప్రయత్నము లేక తిలలోనుండి తైలమును, గాష్టములోనుండి నిప్పును బడయ వచ్చునా? కర్మమునందు గృతోత్సాహుండైనవానికి దైవముతోడై ఫలసిద్ధియొనరించును. దైవము సహాయ మొనరింపనియెడలం గర్తకృతిప్రయత్నుండై నిల్చుంగాక. దైవంబుతోడున్నను లేకపోయినను, మనుష్యుండుత్సాహవంతుండై కార్యములం దాసక్తిగల్గి యుండవలయునుగాని, కేవలము దైవపరుండై యూరకుండరాదు"

అనియిట్లు ద్రౌపది దైవమానుషముల విధములు చెప్పి కౌరవులతో యుద్ధమునకు బూనుమని యెంత చెప్పినను, ధర్మరాజు బుద్ధిమంతుండును ధీరుండును గనుక, సమయ మతిక్రమించుట

ధర్మమునకు గాదనియు ధర్మవిరోధము లేకుండునట్లు పురుషార్థములం బడయనగుఁడు యత్నము చేయుట లెస్సయనియు చెప్పి ద్రౌపదీదేవి కోపంబును పశమింపఁ జేసెను.

## (2) భీష్ముఁడు ధర్మరాజునకు దైవమానుషంబుల తెఱఁగెఱింగించుట.

ఒకప్పుడు భీష్మునింజూచి ధర్మనందనుఁడు దైవమానుషంబులలో బెద్దదేదియనియడుగ నప్పురుషవరుఁడు కురువర్యునకిట్లనియె. "అయ్యా! తొల్లి బ్రహ్మదేవుని, నీవునన్నడిగినట్లు వసిష్ఠ మహామునియడుగఁగ, నద్దేవుఁడు చెప్పిన వాక్యములను వినుము. పురుషప్రయత్నము పొలము వంటిది (క్షేత్రము) దైవమనునది విత్తువంటిది (బీజము) ఈ రెండును గూడినేనియుఁ గృషి చేయువానికి ఫలసిద్ధియగును. పురుషుఁడు పూనుకొనని కార్యములయందు దైవమెట్లు ఫలమొసరించును. జనులు తమతమపనులను నడుపఁగా దైవముతోడై యనుకూలపడుటకు సందర్భము కలుగును.

గీ॥ పౌరుషంబు దైవంబుతోఁ బాటు లేక
ఫలముఁ బొందంగ నేరదు పార్థివేంద్ర
విత్తు సహకారిగాకున్న రిత్తనేల
సంధ్యమగుఁగాక తా ఫలవంతమగునె!

అయ్యా! వినుము. అనలమించుకయైనను వాయువుసహాయముచే వృద్ధిఁబొందునట్లు సత్కార్యములం జేయుచున్నచో, నవి దైవానుకూల్యమహిమచే వృద్ధినిగనును. చమురులిగ్గనేని దీపము

లంజంపి, యజ్ఞులయందు వేల్చుట శ్రుతి సమ్మతమైనది. పూర్వము రంతిదేవుఁడనురాజు దినమునకు రెండువేలు గోవుల చొప్పున చంపి, వేయిసంవత్సరములు యాగము చేసెను. వానికిఁ బుణ్యలోకములు లేకపోయెనా? డేగకాహారముగా శిబితన దేహమునుండి మాంసమును గోసియిచ్చినది హింసయగునా? అట్లే మనుష్యులు దీపము పెట్టినపుడు దానిలోఁ బురుగులుపడి చచ్చును. నేల దున్నునపుడు నాగంటిమొనలో ననేకములైన ప్రాణులు చచ్చును, ఆపాపంబులు మనుష్యులను బొందునా? తమతమ కర్మవశమున నాయువు దెగినట్టిజంతువులు చచ్చుచుండును. చంపువాఁడునిమిత్తమాత్రమేయని బుధులు చెప్పుదురు.

అదియట్లుండనిమ్ము. రాజులకు వేఁటాడుట ధర్మమైనది. సస్యాదులకు మృగములు హానిచేయుచుండును. లోకబాధకరములైన క్రూరమృగములనుజంపుట హింసకాదు. మఱియు విషము పెట్టువారిని. గృహంబులం గాల్చువారిని, చోరులను పరస్త్రీల నపహరించువారిని మొదలగు క్రూరకర్ములను దండింపకుండుట రాజులకు ధర్మముకాదు. అట్లు దండించుటచే రాజులకు హింస తోడరదు. వధ్యులైనవారిని వధింప వలయును. ఇది రాజనీతి ప్రకారము.

మఱియు రాజులు యుద్ధములో జయముగొనుటకై పరబలంబులపై నడరి, నత్తురుపట్టులువాఱ శత్రుసేనలంజంపుదురు. అదిహింసయగునా? న్యాయయుద్ధమున శస్త్రాగ్నిచే మృతినొందినవాఁడు మోక్షసామ్రాజ్యమునకు యుక్తుఁడగును. యుద్ధములోను హింసవదలుచోట్లుకొన్నికలవు. శత్రువుపడినను, పాఱినను, నాయుధము పడవైచినను, వాహనమునుండి పడినను, వానింజం

పుటచే హింసకలుగును.

కావున నెల్లభూతములను తనయట్లతలఁచుచు న్యాయపరుఁడై బుద్ధిపూర్వకముగా హింసచేయక, సాధ్యమైనంతవఱకు హింసకెడగల్గి వర్తించువాఁడే పుణ్యాత్ముఁడు. అతఁడే హింసచేయనివాఁడగును.

---

## 14 సాహసము కూడదు.

### (1) భీమసేనునకు హనుమంతుఁడుపదేశమిచ్చినవిషయము.

గంధమాదన పర్వతంబున పాండవులు వసించుచుండిన కాలమున, భీమసేనుఁడును ద్రౌపదియు నప్పర్వత సానువుల యందు విహరించుచుండఁగా నపూర్వమైన వాసనయు రమణీయతయునుగల సహస్ర పత్రకమల మొక్కటి వాయు వశంబున వారికిముందుగా పడియెను. దానింజూచి ద్రుపదరాజపుత్రి సంతోషించి యివ్విరి తావికినిసొగసునకును మెచ్చి, యిట్టిపువ్వులు నాకనేకములు తెచ్చిపెట్టుమని భీమసేనునడిగి, ధర్మరాజాదులున్నయెడకుఁబోయెను.

భీముఁడు ద్రౌపదికి మనఃప్రియంబు సేయనెంచి గదా బాణాసనంబులుధరించి, పువ్వుందెచ్చిన గాడ్పున కభిముఖుఁడై యొకదట్టమగు నరణ్యమార్గముగాఁ బోవుచుండెను. దారిలోనతఁడు మదించిన యేనుగు చందమున నించుకేనియు భయములేక, క్రూరమృగంబుల జంపుచు, మ్రాకుల విఱుచుచు, బర్వతశృంగంబు లెక్కుచు, నానాప్రకారంబుల విహరించి యొక్కయెడ శంఖనాదము గావించెను. అప్పుడవ్వనంబునసుఖము

గాఁ శయనించి యుండిన హనుమంతుఁడను కపివర్యుండా నాదంబు విని, యది వాయుపుత్రుఁడును దనకుఁ దమ్ముఁడునైన భీముని శంఖారావంబగుట యెఱిఁగి, యాతనికి హితంబు సేయఁదలచి, యతఁడు వచ్చుమార్గమున కడ్డముగాఁ దోఁకను జాచెను. భీమసేనుఁడు తనకెదుటనున్న తోఁకఁ జూచి, కోఁతిగని, దానికినిద్రాభంగము నరింపఁదలఁచిసింహనాదముచేసి దానికిసమీపముగా వచ్చెను. హనుమంతుఁడాతనింగనుంగొని మెల్లనలేచి యనాదరంబుతో "అయ్యా! నేనిందు జరారోగపీడితుఁడనై యలసినిద్రించుచుంటిని, సుఖనిద్రలోనుండిననన్ను నేలబోధించితివి? తిర్యగ్జాతులకు ధర్మము తెలియదు. సర్వభూతములందు దయతో వర్తించునట్టి ధర్మవిశేషమెఱిఁగినవారు మనుష్యులేకదా? నీవువృద్ధులసేవింపవు. ధర్మమెఱుఁగక మాబోటి పెద్దమృగములకు భయము గలుగ జేసితివి. మనుష్యులకు రాఁగూడనట్టి యువ్వనంబునకేల వచ్చితివి? నీవెవ్వఁడవు? అమృతకల్పంబులైన ఫలములుకొన్ని యిచ్చెద. వానిందని వెడలిపొమ్ము, నాబుద్ధివిను"మనియెను.

భీముఁడిట్లనియె "నేను పాండురాజు సుతుఁడను. కుంతీగర్భమున వాయువరమునఁ బుట్టినాఁడను. నాపేరు భీముఁడు. నీవు పొమ్మన్నమాత్రాన నేను వెడలిపోవువాఁడనుగాను. నాకు నీవు త్రోవనియ్యవలెను. పూర్వము రామకార్యార్థమై హనుమంతుఁడను వానరవీరుఁడు, సముద్రము లంఘించి పోయినట్లు, నేనునిన్ను గడచి పోవుదును. నాబలపరాక్రమములు చూచెదవా?

ఆమాటలు పల్కులువిని హనుమంతుఁడిట్లనియె "అయ్యా! కోపింపకుము. నేను ముసలివాఁడను, లేవలేను. నీకిష్టమైనచో

"నాతోఁకను బాయఁద్రోచి పొమ్ము" అనిన భీముఁడు మెచ్చక తనయెడమచేతితోఁ దోఁకనెత్తఁబోయి విలుగానందున, రెండు చేతులతోనుబట్టి యెత్తసమకట్టెను. అప్పుడును వాఁడు తోకను గదల్పలేక దేహమెల్ల చెమర్ప, సిగ్గుచేఁ దలవంచుకొని వానరేంద్రునింజూచి "అయ్యా! నేనెఱుఁగక పలికిన గర్వపుం బలుకులకు సహింపవలయును. నీవు వానరరూపమైవచ్చిన దేవతవో లేక సిద్ధుఁడవో, నాకుఁ జెప్పు" మనివేఁడుకొనెను. అంత హనుమంతుఁడుతనవిధంబంతయు భీమసేనున కెఱింగింపనాతఁడతి భక్తితో నన్నకు మ్రొక్కెను. తమ్మునిం గౌఁగిలించుకొని హనుమంతుఁడిట్లని హితోపదేశము చేసెను. "అయ్యా! నీవు సౌగంధికవనములోనుండి కమలంబులు దేఁబోవుచున్నావు. అందేమియు సాహసక్రియలు సేయకుండుము, అవ్వనము దేవతోపయోగ్యమైనది. దేవతలు బలిహోమనమస్కారాది భక్తిక్రియా సాధ్యులుగాని, సాహసంబుచే వశ్యులుగారు. నీవు క్షత్రియ ధర్మనిరతుండవై యెల్లచోట్ల బలవిక్రమములు చూపుదువు. పరధర్మ మెఱుఁగవు. పెద్దలను సేవించి ధర్మంబు ఎఱుఁగుము. ఆలోచించి సర్వకార్యములు చేయవలయును. విద్వాంసులతోను ప్రబుద్ధులైన మంత్రులతోను గార్యాలోచనము చేయవలయునుగాని, బాలకులతోను, నధిక శ్రీ దర్పితులైన మూర్ఖులతోను, లఘుజనులతోను, మంత్రము సేయరాదు. ముందు లెస్సగా విచారించి కార్యములు చేయువారికిఁ గార్య సిద్ధియగును.

గీ॥ కార్యసిద్ధిఁబొందఁ గాలంబు దేశంబు
నెఱిఁగి బుద్ధిమంతు లెల్లప్రొద్దు

సాహసంబువిడిచిసామాద్యుపాయప్ర
యుక్తిఁజేయుదురుయథోచితముగ॥

(2) చిరకారియను మునికుమారునికథ,

పూర్వము మేధానిధియను మునివర్యుఁడు తన భార్యాపుత్రులతో వనంబునందుఁ దపస్సుచేయుచుండెను. వానికొడుకునకుఁ జిరకారియనుపేరు. వాఁడెల్లపనులను దీర్ఘాలోచనపరుఁడై చేయుచుండుటచే వానికాపేరుగలిగెను. ఒకప్పుడు భార్యచేసిన చిన్నతప్పునకుఁ గోపించి మునివర్యుడు కొడుకుంబిల్చి, తల్లిం జంపుమనియాజ్ఞాపించి యాశ్రమంబువెడలి పోయెను. అతఁడు పనులెల్ల చిరవిచారముతోఁ జేయువాఁడు గనుక తనలో నిట్లని యాలోచించెను.

"అయ్యో! నాతండ్రి యిట్లు చేయునా! అతనియాజ్ఞను నెరవేర్పకుండుట ధర్మముకాదు. జనకుఁడే దైవమనియు, నతనికింబ్రియంబైన కార్యమును జేయుటచే దేవతలెల్లఁబ్రీతిఁజెందుదురనియు, ధర్మజ్ఞులైన పెద్దలు చెప్పుదురు. జనకునికార్యము చేయక యతనిందిరస్కరించుటకంటె వేఱుపాపము లేదు" అని యిట్లు తండ్రివిషయమై తలపోసిచూచి, తల్లిందలఁచుకొని, కన్నులనీరునించుచు "ఆహా! తల్లివంటివారు లోకములో కలరా? అరణిలోనుండి వహ్నిపుట్టువిధముగా, నేను తల్లిగర్భములో నుండి కరచరణాద్యవయవములతోడ జనించితిని. అక్కటా! గర్భవేదన నోర్చి పుత్రునిపైఁగల ప్రేమాతిశయంబుచేఁ దనదేహసౌఖ్యలను పాటింపక, తల్లిపడుపాటులుచూడ నెంతదుర్మార్గులకైనను

జాలిపుట్టకుండునా?

సీ॥ వచ్చిపోయిపూరా చువాఁడు నాకిడుములఁ
గనునె తల్లి పుట్టఁ బట్టితోషఁ
దండ్రి సెప్పినట్లుగన్న శాస్త్రంబులు
వంబగానివమునసఫలయగుట.

తల్లిగలవాఁడనుభవించు సౌఖ్యము, గృహాధనధాన్యాదివస్తువుల చేఁగల్గదు. ఆకసంబునకంటెఁ దండ్రిపొడవైనయెడల, ధరణికంటె వెడ్డైనది తల్లియేగదా!

కం॥ జనకుండధికుండు వాధ్యా
యునకుబదమడుంగు లక్కఱనివ్వాఁడా
జనకునకుడశగుణంబుల
జననిగురుత్వమునదిప్రశస్తముశ్రుతులన్॥

కావున నట్టితల్లిని వధించుట ధర్మమగునా? ఈఘోరకృత్యము జేయ నాచేతు లెట్లాడును.?

అనియిట్లు బహువిధంబులం జింతింపుచు చిరకారి యాలటచే వేగిరపడక యున్నాని కుమారుఁడు ప్రొద్దుపుచ్చుచుండగా, నక్కడతండ్రి "అయ్యో! స్వల్పదోషమునకు భార్యం జంపుమని కొడుకు ననిచివచ్చితినే! ఆహా! కోపమెంతదుర్గుణము, నరకోపాధి కర్జముగాన నందురుగదా. నాపుత్రుఁడు వేగిరపడి తల్లింజంపియుండునో? అతఁడు చిరకారియని ప్రసిద్ధముగాఁ బేరు వడసియున్నాఁడు. అయ్యో! పుత్రకా! నాకును నాతపంబునకును నిందరాకుండ, నీకుమాతృవధదోషము బొందకుండ, నీచిరకారిత్వమును సకలజనులుపొగడునట్లుగా నీతల్లింజంపకుందువుగదా?" యని యనేకవిధములుగాఁ బలవరించుచు నతిత్వరితముగా నాశ్ర

మంబునకు మఱలివచ్చెను.

పుత్రుఁడప్పుడు చేతిలోనున్న వధసాధనంబుఁబడవైచి, తండ్రి చరణంబులపై బడియేడ్చిన, నమ్మహాత్ముఁడు తనయుని గాఢాలింగనమును మూర్ధాఘ్రాణంబునుం జేసి, యభినందించి "అయ్యా! కుమారకా! నీవు కార్యవిచారము చిరముగా ధైర్యముతో నడుపుట చేనన్నును నాకులంబును రక్షింపఁ జాలితివి, నీగుణంబులు పేర్కొన నావశముకాదు. నీకీర్తిలోకములో నాచంద్రతారార్కముగా నెగడుగాక" యనిదీవనలిచ్చెను.

క॥ వినుమచిరవృత్తి జేసిన
పనికర్తకునావహించుఁబశ్చాత్తాపం
బనఘా,చిరభావితబు
ద్ధినిరూపణకృతముశుభము దేజముఁ దెచ్చున్॥

## 16 అసూయ చెడ్డది.; వ్యాఘ్రగోమాయువుల సంవాదము.

ఇతరుల విద్యాబలంబునకును ధనతేజోరూపములకును జూపోవకుండుట కసూయయందురు. ఇదిమనుష్యులు విడువఁదగిన దుర్గుణములలోఁ బ్రధానమైనది. దుర్యోధనుఁడు పాండవులలక్ష్మికిని బలమునకును దేజంబునకును దనమనంబెరియ నసహ్యాపడి, వారికిఁగీడు సేయఁబూనెను. అసూయాగ్రస్తుఁడైనవాఁడు తెప్పలులేకయే మనోవేదనచేఁగుంది, యెండవేడిమికి నింకితరుఁగు నల్పజలాశయంబునుంబోలె, దహింపఁబడిన వాఁడై తఱిగి పోవుచుండును. పాపవ్యవసాయమునందు బుద్ధిని జొనుపును. దుర్జనుల

కసూయయే వైరకారణమగును.

పూర్వము పురికయను పట్టణములో పౌరకుండను రాజు క్రూరకర్ముఁడై చచ్చి, పుట్టుచుగు బుద్ధితోనొక్క గోమాయువై పుట్టెను. "తన చేసిన దానం బడకఁ బోవశివునకువశమే? కీడు చేసినఁ దప్పదుకీడయగును." అన్నట్లుగా, బుద్ధిగల యానక్క పుణ్యము సంపాదింపఁదలఁచి, తొల్లింటిదుర్గుణంబులెల్ల వదలి సద్వ్రతంబులు చేయుచు, మాంసముదినక, చెట్లనుండి క్రింద రాలిన ఫలపత్రములు భక్షించుచు వర్తించుచుండెను. వనంబులోని తోడి నక్కలెల్లనవ్వి "ఇది యేమివ్రతము? మానుము, మేముమాంసము తెచ్చియిచ్చెదము, భుజింపు" మన్నను వినక పూర్వజాతిస్మరణంబుగల యానక్క దృఢమగు నిశ్చయముతోనుండెను.

ఒక్కనాఁడు వనంబులోని మృగములకెల్ల రాజై యుండిన, శార్దూలమొక్కటి, యానక్కఁజూచి "అనఘా! నిన్ను సౌమ్యుఁడవని యెఱిఁగితిని నీవు నాకుమంత్రిముఖ్యుఁడవై నాకార్యములెల్ల నరయుచుండు" మని ప్రార్థించెను. అప్పుడు నక్క పులింజూచి "రాజా! నిన్నుఁగొల్చుటకంటెనాకు వేఱుపనియున్నదా? నీవు నామాటచొప్పున వర్తిల్లునట్లును, నీమూలభృత్యులు నాపై నసూయపడినీకు దుర్బుద్ధులుచెప్పినను, దానివినక నన్నే మన్నించి నాబుద్ధివినునట్లును, సమయంబుచేయుము. అట్లైన నీకు నేనుమంత్రిగా నుందు" ననియె. దానికి శార్దూల మొప్పుకొని నక్క చెప్పినట్లు వినుచు న్యాయముతప్పక వర్తిల్లుచుండెను.

ఇట్లుండఁ గొంతకాలమునకు, గోమాయువును రాజు మన్నించు విధమును, తమమాటలు చెల్లక నక్క పల్కులే

పాటిగాఁగైకొని రాజు వర్తించు విధమునుజూచి, చూపోపక మూలభృత్యులందఱు గుంపుగూడి,నక్కను భంగపఱచవలయు ననితలఁచి, పులిభుజించుమాంసము నపహరించి,నక్కబొక్కలో దాఁచి,పులియొద్దకునచ్చి, "అయ్యా! ఈనక్క కేటివ్రతము.నీవు తినుమాంసమునపహరించి తనబొక్కలో దాఁచినది. దీనికపటము నెఱుఁగకయున్నాళ్లమేము మోసపోతిమి. ఇదియే నీకార్యము లెల్లనడప మేమునీయెడకువచ్చి చెప్పభయపడుచుందుము." అని పలువిధములుగాదానికినక్కపై గోపముగల్గునట్లుచేసిరి. అప్పుడు శార్దూలము నక్కంబట్టిచంపుట కాజ్ఞయిచ్చెను.

పులితల్లియప్పుడు పఱతెంచి వచ్చి "అయ్యో కొడుకా! మోసపోయితివిగదా? ఈనక్క మనయెడకువచ్చియున్నాళ్లయ్యనే ఎప్పుడైననిట్టియకార్యము చేసెఁగదా? నేఁడిట్టిది చేయునా? నివిదియెల్లఁదలంపకయసూయచే మూలభృత్యులాడినపల్కులు నిజముగానమ్మితివి.

"బుద్ధిమంతునివలన దుర్బుద్ధులధిక
వలనహీనులు రూపసివలనఁ జెనటి
వారసూయలు సేయుదురిరవమున
నింతయెఱుఁగంగవలవదె యీవుకొడుక."

మనకీనక్క చేసిన మేళ్లుకనుఁగొనవలదా? హితులైనమంత్రులను గుటిలస్వభావముగలవారు కపటోపాయంబులఁ జెఱుపఁజూతురు. చక్కఁగానంతయువిచారింపక నక్కంజంపఁబంచుట నీకుధర్మమగునా?" యనిహితోపదేశముచేసెను.

శార్దూలమప్పుడు తనచేసినదానికివగచి, నక్కరాఁబనిచి గాఢాలింగనముచేసికొని కనుఁగవ నశ్రువులురాల బహువిధంబు

లైనపలుకులదానిం గొనియించి మొప్పటియట్లతనయెడ నుత్రియై యుండునట్లువేడుకొనగా,నది " నీవునన్ను మొదటమన్నించితి ర్వాతిభంగపరచితివి నీసేవకులక అపులంబడకుండునట్లు నాకువాగ్దానముచేసి మాటనుమీఱితి నేనునడచితివి నేనునీయొద్దనిలువనేరను. ఒకనిభంగపెట్టి పిదపసంగతునిగాఁజేసుకొనుట మేలగునా" యని చెప్పియచ్చోటువాసిపోయెను

---

### 16 మిత్రద్రోహము మహాపాతకము.

#### 1. కర్ణుఁడు శ్రీకృష్ణమూర్తితో సంభాషించుట.

శ్రీకృష్ణమూర్తి పాండవులదూతయై కౌరవసభకువచ్చి రెండుపక్షములవారికిసంధిగావింప ప్రయత్నించెను. అయితే దురాత్ముఁడగు దుర్యోధనుఁడు సంధిమాటల కియ్యకొనకుండుటయే గాక శ్రీకృష్ణమూర్తి నిపట్టిబంధింపనుద్యోగించెను. కృష్ణుఁడుతన విశ్వరూపమునుజూపి కౌరవులకుభీతిగలుగఁజేసి, ధృతరాష్ట్ర భీష్మ ద్రోణవిదురులనీడ్కొని మఱలివచ్చునపుడు కర్ణునింబిలచి సతని చేయిపట్టుకొని " కర్ణా! నీవునాతోఁగొంతదూరమురమ్మని చెప్పి యతనితో రథంబెక్కి వెడలిపోయెను.

కృష్ణుఁడుదరహాస్యముగాఁ గర్ణునకిట్లనియెను "అయ్యా! నీవు రాధకొడుకుకాదు కుంతీమహాదేవి కన్యయైయుండినపుడు దుర్వాసమహామునినారాధింప, నమ్మహామునిదానికొక మంత్రముపదేశించెను. అమ్మంత్రశక్తియెటులుగ వేఁడి కుంతిసూర్యుని దలఁచిన నప్పుడతఁడేతెంచి దానికిగర్భదానముచేసిపోయెను. దానికడుపులోనీవప్పుడుజన్మించితివి. కావుననీవుపాండునందనుండగుదు. యు

ధిష్ఠిర భీమార్జుననకులసహదేవులకుఁ బెద్దవాఁడవు నీవీకౌరవులను విడిచి పాండవులపాలికి వచ్చినయెడల, నేనునిన్ను సకలమహీసామ్రాజ్యమునకునభిషిక్తునిగాఁ జేయుదు. ధర్మరాజయువరాజై నీకుధవళచామరంబులు వైవను, భీముడుసితచ్ఛత్రంబుపట్టను,సవ్యసాచిసారథ్యంబుసేయను,కవలుమున్నగురాజకుమారులెల్ల నీకు భక్తితోఁబనులు సేయను, నీవు రాజ్యాభిషేకమునకురథంబెక్కి వెడలుటయెంత మేలగునో చూడుము. కర్ణా! నాపల్కులువినుము అటులైనకౌరవపాండవులు తమలోఁగలహంబుడుగుదురు. అదిజగమునకుక్షేమకరమైనది. నిన్నుగన్నకుంతీదేవియు సంతోషించును. ఇంతేగాకద్రౌపదియునిన్నునారవమగనిగాఁ జేకొనును. నీవు ధర్మములనెల్లనెఱిఁగినవాఁడవు. పాండవులంగూడుకొని యీభువనక్షయంకరమైన భారతయుద్ధమును మాన్పుము"

అనియిట్లుపల్కుచున్న మాధవుంజూచి రాధేయుఁడిట్లనియె " కృష్ణా! నీపల్కులొప్పునుగాని నేనుపాండవులను జేరరాదు కుంతినన్నుఁగని యించుకయేనియుదయలేక చెడిపోవునట్లునదిలో వైచిపోయెను, నేనుసూతకులంబున నతిగౌరవంబుగా బెరిగితిని. నేఁడునాపుట్టుకయెఱిఁగి నాతల్లిదండ్రులను సోదరులను బాసిపోవుట తగవగునా? అదియునుంగాక దుర్యోధనుఁడు నన్ను సూతపుత్రుఁడనక. తనసూనుల తమ్ముల కంటెను నాకుసంప్రీతియొనర్చి నాయందు బద్ధస్నేహము గలిగియున్నాఁడు. నేనర్జుననకు సరియగువైరియని తలఁచి నేనాతనియుద్ధములోఁ జంపఁగా శత్రువులైన పాండవుల ననాయాసంబుగా గెల్తునని తలఁచియున్న కురుపతిని నేనీసమయమునవిడుచుట మిత్రద్రోహముకాదా. నేనిన్నాళ్లు పార్థునకుఁ బగయైయుండి, నేఁడాతనిఁగూడినచో జనులు

నన్నుఁజూచి నవ్వరా? నీవునిష్పక్షపాతివై నాకు హితముపదేశించితివి, ఏనను నేవందులకురాను. దుర్యోధనునకుఁ జెలియైయుద్ధంబునఁదోడుసూపి యర్జునునిం జంపుదు. లేక యతనిచేమృతి నొందుదు. ఇదియే నానిశ్చయము"

అనినఁ గృష్ణమూర్తి చేయునది లేక కర్ణుని ధైర్యమునకును మిత్రుల దెసగల్గు సద్భావమునకును సంతోషించి, నిన్నుయుద్ధరంగములోఁజూచెదగాక యనియతనివీడుకొలుప,నతండు రథముడిగిహస్తినాపురంబునకరిగెను.కృష్ణుఁడు పాండవులున్న యెడకుఁ బోయెను.

---

## (2) నాళీజంఘుని చరిత్రము.

ధర్మరాజు భీష్మునింజూచి రాజులకువలయువారెవ్వరు. వలవని వారెవ్వరని యడుగ నాతఁడిట్లనియె. "కౌరవేశ్వరా! తాలిమియు శీలమునుగలవారును, ధీరులును, ధర్మజ్ఞులును, సత్యసంధులును, వృథాకోపము లేనివారును. కార్యములందుసమర్థతగలవారునునైన సేవకులు, రాజునకు మేలాచరింతురు. అట్టివారింబ్రోచుట మంచిది. అయితే.

ఉ॥ క్రూరులులోభులుఁ గాతరులుఁ గొండియులుఁ జడులుంగృతఘ్ను
లుం। నేరనివారుఁబొంకునకు నిందకునోర్చినదుష్టబుద్ధులుఁ
ధీరత లేనిదుర్నయులతివ్యసనత్వము గల్గువారలన్
జేరువనున్కిభూపతికిఁ జెట్టయొనర్చు నరేశ్వరోత్తమా।

ఒప్పని గుణములుగల నిప్పురుషాధములలోఁ గృతఘ్నుఁడుమిక్కిలి యొప్పకుండుటను దెల్పు నితిహాసమొకటి చెప్పెదను

వినుము పూర్వమొక బ్రాహ్మణుఁడు తనకులవృత్తము లెల్ల మాని, బోయదానినొకతె నాలిగాఁ జేసికొని కిరాతులం గూడి వేఁటాడుచు, మాంసము భుజించుచు, భోగపరుండై యుండి ధనము సార్జింపనెంచి బేహారులు కొందరు సరకులు గొనుచు దేశాంతరమునకుఁ బోవుటఁ జూచి, తానును వారితోఁ బోయెను. వారందఱు భయంకరారణ్యమార్గముగాఁ బోవునెడ, వనగజం బొక్కటి వారిపైఁ బడి పలువురం జంప, బ్రాహ్మణుఁడు మృత్యువునకుఁ దప్పి, వేఱొకమార్గముగాఁ బోయిపోయి, యొక్క పెద్దమఱ్ఱిచెట్టుక్రింద విశ్రమించియుండెను.

ఆవటభూరుహము బ్రహ్మదేవునకు నెచ్చెలియైన నాడీజంఘుఁడను పేరుఁగల బకవల్లభుని నివాసస్థలము. అదివచ్చిన బ్రాహ్మణున కాతిథ్యమిచ్చి "అయ్యా! నీ వెవ్వఁడవు? నీ వేల యిందు వచ్చితివి? నీకేమి కావలయును?" అని యడిగెను. బ్రాహ్మణుఁడు తన పూర్వచరిత్రమంతయుఁ జెప్పఁగా విని బకమాతఁ డెట్లయిన నేమి, యాతని దారిద్ర్యమును బోఁగొట్టదలఁచి, తానుండుస్థలమునకు మూఁడుయోజనముల దూరమున నుండు మధువ్రజమను పురమును పరిపాలించు విరూపాక్షుఁడను రాక్షసరాజు నొద్దకు నాతని బంపెను.

విరూపాక్షుఁడు తనకు మిత్రుఁడైన బకవల్లభునిచే నంపబడిన బ్రాహ్మణునకు షడ్రసోపేతంబైన యన్నంబు పసిఁడిపళ్లెరంబులోఁ బెట్టి, కట్టనిచ్చి, కనకమణిరాసులు దక్షిణగా నిచ్చెను. ఆపాఱుఁడు మోయలేక వానినెల్ల మొసమూపుపీపులు నొవ్వనెత్తుకొని మెక్కుడురయంబునఁ గొక్కెర యున్న మఱ్ఱియొద్దకు వచ్చెను. బకము వానిం గని సంతోషించి యతని మేనం బొడమిన చెమట

బిందువులుతోలఁగ తనరెక్కలతో నల్లనవీచియంతరాత్రియగు టయు సుఖనిద్ర చేయుచుండెను.

ఆదుర్బ్రాహ్మణుడప్పుడు తనకు రేపటి పయనంబునకు నాహారంబుచింతించి నిద్రించుచున్న బకంబునుజూచి "యిది క్రొవ్వియున్నది, దీనిదేహములో మాంస మధికమయియున్నది, ఇప్పుడేదీనినడిచిచంపెద"నని పాపనిశ్చయుఁడయి కఱ్ఱతో దానిమోది చంపి, యాకలూడ్చి బొందువుప్రచ్చి మాంసమునంతయుఁ దీసిమూటగట్టుకొని యచ్చోటువాసిపోయెను. మఱునాడుదయమున విరూపాక్షుఁడు తనయెడకుఁ బ్రతిదినముఁను బ్రొద్దునసే వచ్చు నాళీజంఘుఁడాదినము రామికిఁగారణంబేమియగునోయని వగచి, తన భృత్యులఁగొందఱ నంపగా వారు బకవల్లభుడున్నయెడకువచ్చి, దాని డొక్కనుచూచి యిట్లుచేసినవాఁడు బ్రాహ్మణుఁడేయగుననితలఁచి, వానిపిఱుందకడువేగముగాఁబాఱి వానింబట్టిబంధించి రాజుముందరనివేశించిరి. "ఈకృతఘ్నుని నాముందరఁదేవలవదు, వీనింబొరిగొనితిను"డని రాజుచెప్పగా, రాక్షసభటులు "మహాప్రభూ! మేమంత దిక్కుమాలినవారమా?, యీపాపి శరీరంబును మేము ముట్టనొల్ల"మనిరి. అంత నతఁడువీనిందిన్నసుదనకున్నను చంపికుక్కలకెరయగునట్లుచేయుఁడన వారట్లేచేసిరి. కుక్కలునచ్చి యతని యొడలుమూచూచి కబళింపనొల్లక కడుపులు నకనక పడగా వెనుకకుఁబోయెను. ఆహా! కృతఘ్నునిదేహము మాంసమునుగుక్కలును తినుటకు సమ్మతింపవుకదా!

అంత నద్దను జేశ్వరుడు తనమిత్రునిమరణంబునకుపగచియతనికగ్నికార్యములుచేసెనుఅప్పుడుదేవేంద్రుడువచ్చి "అయ్యా! నీసఖుడు బ్రహ్మదేవునిజాడనరిగెను. ఇదిగోవచ్చుచున్నాఁడు, చూడు" మననా

శీజంఘుడు తనతోంటెరిగూపముతో రాక్షసేంద్రుని(మోల వచ్చి నిల్చెను. విరూపాక్షుఁడు సంతోషాశ్చర్యములు గడలుకొన బకవుం గవుంజూచెను. బకవల్లభుడప్పుడు తనకతిమునఁ బ్రాహ్మణున కయిన దుర్దశనువిని చింతాక్రాంతుఁడయి, యతనిం బ్రతికింపుమని దేవేంద్రుని వేఁడగా నతండట్లు చేసెను. విప్రుఁడులబ్ధజీవుఁడయి బకరాక్షసను రవల్లభులున్న యెడకువచ్చి వారినెల్లస్తుతించి తనధనసంచయము మోదికొని, మరలిమరలిచూచుచుఁ గడుసంభ్రమంబుతో నేగెను

ధర్మనందనా! కృతఘ్నతయుమిత్రద్రోహము ను దారుణమైన పాతకములు. బ్రహ్మఘ్నునకు నిష్కృతికలదుకాని, కృతఘ్నునకు బ్రాయశ్చిత్తము లేదు.

కం॥ ఆగయుమిత్రద్రోహము
దారుణమగు పాతకము కృతఘ్నతకంటెన్
వైరముగొనివిడువవలయు
నారెండు తెఱఁగులవారినాప్తుల నెనన్

---

## 17 వాక్పారుష్యము కూడదు

### (1) హంసరూపధరుఁడయిన బ్రహ్మదేవుడు సాధ్యుల కుపదేశించిన ధర్మప్రకారము.

ధర్మరాజుభీష్మునింజూచి "అయ్యా! లోకములో జనులుశాంతమును, క్షమయును, హింసలేమియును, మిక్కిలిమేలైనగుణములనికొనియాడుదురు. వానికేలయంత విశేషమేర్పడెను? నాకెఱింగింపుడన, భీష్ముడిట్లనియె. ఓధర్మనందనా! వినుముతొల్లిహంసరూపమును ధరించిబ్రహ్మదేవుడొక్కయెడ వేఁడుకమైతిరుగుచుండగా, సాధ్యులను దే

వతలు కొందఱు మాకు ధర్మముపదేశింపుమనియా దేవుని ప్రార్థించిరి. అప్పుడు పసిఁడిరాయంచయైయున్న నలుమొగంబుల దేవుఁడు వారితో నిట్లనియె.

వినుఁడు సాధ్యులారా! సత్యమును, ఇంద్రియనిగ్రహమును అహింసయు మేలైన ధర్మములు. వానిచే మనుష్యులకు బొందరాని మహోన్నత పదవి లేదు. అవి సత్సాంగత్యము చేత నే కలుగుచుండును. సత్పురుషులయినవారు పరుల మర్మమును వెలిపుచ్చునట్టి పలుకులును న్యాయవిరుద్ధములగు మాటలును, నిష్ఠురోక్తులును, బలుకరు. ఏలనఁగా వారవి సత్యములుగాఁ దలఁపరు. జనులు తమ్ము నవమానించినను నిందించినను మాఱాడక సైరణ కలిగియుందురు. అడిచినను, దిట్టినను, మహాపరుషంబులు వల్కి యల్కతో బొడిచినను, సైరించియుండు పుణ్యులు తమ్ముం బరిభవించిన వారు చేసిన పుణ్యములను బొందుదురు, తము చేసిన పాపములను వారలకియ్యఁజాలుదురు.

క॥ పలుకుపడినతనిఁ బాపం
బులు విడుచుం బలికినతనిఁ బొందును బాపం
బులు నోరు పాపము దనపై
నొలయింపఁగ నేల నిందయుడిగినఁ గాదే॥

ఓ సాధ్యులారా! మనస్సును వాక్కును నెవ్వనికి వశ్యములైయుండునో వారే సుకృతులు, వారే సర్వధర్మములు నెఱిఁగినవారు. వారికి అచేతనే మోక్షమున్నది.’’

అయ్యా! ధర్మపుత్రా! సాధ్యులకట్లు రాయంచరూపముననున్న బ్రహ్మ మఱియు ననేకవిధములైన ధర్మములెఱిగించి, యంతర్ధానమొందెను. మనుష్యులకు మాటల చేతనే కలహము నిందయు పాపమును స్నేహమును విరోధమును గలుగును. కావున నొవ్వనట్లు పలు

కుట,సత్యముపలుకుట,ధర్మమార్గమున బల్కుట,సర్వజనప్రియం బగువిధముగా బలుకుట,యనునీనాల్గువిధముల బలుకుటయే మంచిది.అట్లుపల్కువారికి దేవతలెల్లవశ్యులగుదురు.కాకితన్నుతిట్టుట లేదు,కోకిలతనకుధనమిచ్చునట్లుచెప్పుట లేదు,కాకిపల్కులుపరుష మైయుండుటచేతను కోకిలమాటలుమధురమైయుండుటచేతను, కాకిజనులకుం బగయగుచున్నది. కోకిలనందఱుమెచ్చి ప్రియంబు గానాదరింతురు.

క॥ కాకేమితన్నుందిట్టెను
కోకిలతనకేమిధనము కోకొమ్మనెనే
లోకముపగయగు బరుసపు
వాకునంజుట్టమగుమధుర వాక్యమువలనన్॥

(౨) ధర్మరాజుశిశుపాలునకుపదేశించినవిధము.

పూర్వము ధర్మరాజు సకల దిక్కులలోనిరాజులనెల్ల తనతమ్ముల సహాయముచే గెల్చి, శ్రీకృష్ణుని యనుమతిమీద రాజసూయమను యాగమును జేయఁబూనెను. ఆయాగమునకు వ్యాసాదిమహర్షులును, బ్రహ్మవిదులైన బ్రాహ్మణులును, శిశుపాలుడు మొదలగు రాక్షసాంశమున జనించిన రాజులును, నానా దేశాధీశ్వరులును, భీష్మద్రోణాది యాచార్యవర్యులును, దుర్యోధనాదులునువచ్చిరి. ధర్మరాజు వచ్చినవారినెల్ల నాదరించియాగమునుముగించునవసరమునభీష్మాచార్యుఁడాతనిం జూచియిట్లనియె."ఓధర్మనందనా! ఈసభలోననేకులుపూజనీయులు న్నారు.వారిలోనెవ్వడుసద్గుణంబులఁబెద్దయగునోయట్టివిఖ్యాతుడై

నమహాత్మున కర్ఘ్యమిచ్చి వానిం బూజింపుము. అట్టివాఁడెవ్వఁడగునో యనియడిగెదవేనిఁ జెప్పెదవినుము. జగములనెల్లసూర్యుడు వెలిగించు నట్లుతనదైన సద్గుణములద్యుతిచేనంతయును వెలిగింపఁజేయువాఁడును చంద్రుఁడుతనధవళచంద్రికలచే నానందము కలుగఁజేయునట్లుజనులకు నేత్రానందకర మగుసుందరదివ్యరూపమునుధరించిన వాఁడునునైన పరమాత్ముఁడు శ్రీకృష్ణుఁడీసభలో నున్నవాఁడు. అతఁడేయర్ఘ్యముగొన నర్హుఁడు. అతనికంటెఁ బూజ్యులైనవారీజగంబులోనుగలుగరు. అతనింబూజించుటయే నీవు గావించు యజ్ఞము యొక్క ఫలము".

భీష్మునివచనంబున ధర్మరాజు వాసుదేవున కర్ఘ్యమిచ్చెను. దానింజూచి శిశుపాలుఁడు సహింపనోపక కృష్ణు నాక్షేపించుచు, ధర్మరాజుతో నిట్లనియె. "ఓధర్మనందనా! ఈసభలో నిందఱుపెద్దలుండఁగా వారినెల్లవిడిచి యచ్యుతునకు నర్ఘ్యమిచ్చుట నీకుఁ దగునా? అతని వృద్ధని పూజించితివా? లేక యాచార్యుఁడనియర్ఘ్యమిచ్చితివా? ఆతఁడు రాజగు బుద్ధిచే నీవు మన్నించినయెడల యాదవులు భూమిపై గొప్పరాజులగుదురా? ఈకృష్ణుఁడెవ్వఁడు? వానికేల యర్ఘ్యమిచ్చి నీవీసభ్యులనవమతి చేసితివి? నీవుపురుషులలో శ్రేష్ఠుఁడవనియు, ధర్మజ్ఞుఁడనియు, నీగుణంబులను జనులుపొగడఁగావిని, నీయజ్ఞమునకు రాజులెల్లవచ్చి యున్నారు. వారినెల్లనీవిట్లుతృణీకరించుటధర్మమగునా? పేడికిసురూపయగుకన్యనిచ్చినవిధముగను, చెవిటికిమధురమగుపాటవినిపించిన, చందముగను, గ్రుడ్డివానికిఁచక్కని ప్రతిమచూపిన భంగియును నీవుకృష్ణునకుబూజలిడితివి. ఈవృద్ధుఁడగుభీష్మునిపల్కులువిని నీవు పేలవైతివి, నీవెఱుఁగకిచ్చినను సిగ్గింతలేక యీగోవిందుఁడాయర్ఘ్యము నెట్లుకొనియె?

అనియిట్లు కృష్ణ భీష్మ ధర్మరాజులనెగ్గులాడుచు సభలోనుండితనపరివారవర్గముతో వెడలెను

ఆశిశుపాలుపలుకుచుండఁ దనచని ధర్మనందనుఁడు వానిం బ్రియవచనంబుల సమాధానపఱచుచునిట్లనియె "శిశుపాలా! ఏలనీవిట్లు క్రూరముగాఁ బలుకుచున్నావు? రాజులకునునీవంటిగుణోన్నతులకును, వాక్పారుష్యము చనునా? అదివిషమువంటిదికదా? నిప్పుకంటెను దారుణమయినదికదా?

క॥ భూరిగుణోన్నతులనదగు
వారికిధీరులకుధరణీవల్లభులకు వా
క్పారుష్యము చనునెమహా
దారుణమదివిషముకంటె దహనముకంటెన్.

గురుఁడనియు, సమస్తలోకోత్తరుఁడనియు, నాదిమ పురుషుఁడనియు, సర్వలోక పూజ్యుఁడనియు నెఱిఁగికదా, భీష్ముడు శ్రీకృష్ణునకర్ఘ్యమిచ్చునట్లు చెప్పెను. శ్రీకృష్ణుని మహిమను నాఁడెఱింగినట్లు మనబోఁటివారికెఱుఁగవచ్చునా? ఊరకనిందించుటుడుగుము 'నీమూర్ఖత్వమును మాను'' మనిహితోపదేశము జేసెను.

ఏంతబోధించినను శిశుపాలుఁడజ్ఞుఁడై శ్రీకృష్ణస్వామిని నిందించి తుదకాతని చక్రాయుధము చేఁ ద్రెళ్లి క్రిందపడి చచ్చెను.

క॥ మనమునకుబ్రియంబును, హిత
మును, బథ్యముఁదథ్యమును, నమోఘముమధురం
బును, బరిమితమునునగుపలు
కొనరఁగఁబలుకునదిధర్మయుతముగసభలన్

## 18 ఆడిన మాటను దప్పరాదు.

### (1) బలిచక్రవర్తి శుక్రుని వచనంబులాక్షేపించి వామనునకు భూదానమిచ్చుట.

శ్రీవిష్ణుదేవుఁడు ముందు వామన రూపధరుఁడై బలిచక్రవర్తి యొద్దకువచ్చి మూఁడడుగులుభూమి యాచించినట్లు చెప్పితిమిగదా? బలిచక్రవర్తి యెంతచెప్పినను వినక వామనుడు మూఁడడుగులు భూమికంటె నెక్కుడనగా నేమియు నొల్లనని చెప్పఁగా, నప్పుడాభూపతి భూదానమిచ్చుట కొడంబడెను. అప్పుడుబలిచక్రవర్తి మంత్రియగుశుక్రుఁడిట్లనియెను. "ఓదనుజేంద్రా! ఈపొట్టివడుగు బ్రాహ్మణుఁడుగాఁడు. దేవకార్యముసాధించుటకై విష్ణుదేవుఁడివ్విధమున వామన రూపముతోఁ గశ్యపునకుఁబుత్రుఁడై జనించి, నేఁడు నీయొద్దకువచ్చి దానమడుగుచున్నాఁడు. ఈతనికిభూదాన మిచ్చినచో, నీలక్ష్మియు దేజమును నెలవును నైశ్వర్యమును సర్వమును హరించి దేవేంద్రునకిచ్చును. తనమూఁడుపాదములచే భూమ్యాకాశములు రెండునాక్రమించి మూఁడవ యడుగునకుఁ జోటులేదని చెప్పును. నీవీతని మోసముఁ గక దానమిచ్చెదనంటివి. ఇతడు దైత్యులకెల్ల యాపదఁగలుగఁ జేయును. కావున నీబ్రహ్మచారినిం బొమ్మనుము. నీవుచెడిపోవునట్లు చేయుదానము దానమగునా? పురుషుఁడు తనకుఁగల ధనమును నైదుభాగములుగా విభజించి నాలుగు పాళ్లుతానను భవించి యొక్కపాలుచే నాశ్రితులైనవారిని బోషింపవలయును. తన్నుమాలిన ధర్మము మొదలు చెడ్డబేరము. నీవీతనికి దానమియ్యక పోవుటచే, నీకసత్యదోషఫలము కలుగదు. ఏలనఁగా సర్వధనము నష్టమగునప్పుడును, ప్రాణహానియైనప్పుడును,

మాననష్టమగుచోటను, గోవిప్రాదుల సంరక్షణ యందును, స్త్రీలయందును, వివాహసమయములందును, బొంకవచ్చును. దానఁబాపమురాదు.

ఆ॥ వారిజాక్షులందు వైవాహికములందుఁ
ప్రాణవిత్తమాన భంగములను
జకితగోకులాగ్ర జన్మరక్షణమందు
బొంకవచ్చునఘము బొందఁడధిప॥

అని యిట్లు తనకు హితముగోరి చెప్పుచున్న శుక్రునివచనంబులాక్షేపించి బలియిట్లనియె. "ఆచార్యవరా! నీవు చెప్పినది నిజమగునుగాని పలికిలేదనుట ధర్మమగునా? అర్థులు వచ్చి యడుగ వారికిచ్చెదనని మొదట నుడివి, తర్వాత ధనలోభముచే వారికియ్యక పొమ్మనిచెప్పుట గృహస్థుపద్ధతియగునా? రాజులకు యుద్ధమునుండి తిరుగక చచ్చుటకంటెను, పలికి బొంకక నిజముగా నడుచుకొనుటకంటెను, వేఱొకధర్మమున్నదా? ఈ మహానుభావుఁడు నన్నువచ్చి యడుగనే నాతనికిచ్చెదనని చెప్పి యియ్యక పొమ్మన్నచో, నన్నుజనులుతిట్టరా? అయ్యా! మాననష్టముకంటెమరణమేమేలగునని పెద్దలు చెప్పుదురు. కావున నానిశ్చయము వినుము. ఇతఁడెవ్వఁడైన నాకేమి? నాకు రాజ్యమును, ధనమును, సర్వమును, నష్టమైనను, దానమియ్యకమానను.

క॥ మేరువు తలక్రిందైనను
బారావారంబులింకఁ బాఱినలోలో
ధారుణి వజ్రమైపోయిన
ధారాధ్వముఖండమైన దప్పక యిత్తున్॥

ఆ॥ బ్రతుకవచ్చుఁగాక బహుబంధనములైన
వచ్చుఁగాక లేమివచ్చుఁగాక
జీవధనములైనఁ జెడుఁగాక పడుఁగాక
మాటఁదిరుగలేరు మానధనులు॥

అని ఋట్లారాజు దృఢనిశ్చయుండును, దానకుతూహలతత్పరుండును, సత్యమార్గనిరతుండును నై యాదిదేవుండైన వామనదేవునకు భూదానమిచ్చి శాశ్వతమైన నిర్మల కీర్తిని బొందెను.

---

## (2) కర్ణుఁడు దేవేంద్రునకు కవచకుండలము లిచ్చుట.

పాండవులు వనములోనున్న పండ్రెండవ యేఁడు కడపట, దేవేంద్రుఁడు వారికి హిత మొనరింపఁగోరి, పాండవులకు విరోధియై దుర్యోధనాదులం గూడుకొనియున్న కర్ణునియొక్క కవచకుండలములను మాయోపాయంబున హరింపఁ దలఁచెను. ఈవిషయమును సూర్యుఁడెఱింగి, కవచకుండలముల నిచ్చినచోఁ దనపుత్రునకు యుద్ధములో మరణముగల్గునని వగచి, కర్ణునొద్దకువచ్చి యేకాంతముగా నాతనికిట్లనియెను.

సూ:—కుమారా! నీకు హితమొనరింపనెంచి యొక్క విషయము నీకు రహస్యముగాఁ జెప్పనిందులకు వచ్చితిని. నీవు బ్రాహ్మణులందు భక్తిగలవాఁడనియు, వారెద్ది యాచించినవంచనసేయక యిత్తువనియు నెఱిఁగి, యర్జునుని తండ్రియైన దేవేంద్రుఁడు నీయొద్దకు బ్రాహ్మణవేషమున వచ్చి, నీకవచకుండలముల నిమ్మని యడుగును. వానినియ్యకుము. అవిఅమృతమయములు

అనినీయెడనుండునేని శత్రువులు నిన్ను గెల్వలేరు; నీవునధ్యుఁడవుగావు. ముందుగాఁజెప్పితిని, మోసపోకుము.

కర్ణుఁడు:—తండ్రీ! నీవునా కత్యంత హితమొనరింపఁ గోరిచెప్పుటచే ధన్యుఁడనైతిని. ఐనను నావిన్నపమును జేకొనవలయును. నేను బ్రాహ్మణులు వేఁడినయెడల నాప్రాణమునైన నిత్తును. ఇదినాప్రతిజ్ఞ. కుంతీపుత్రుదెసగల పక్షపాతముచే దేవేంద్రుఁడువచ్చి నన్నడుగ నేనియ్యకున్న నాకీర్తి చెడిపోవదా? కీర్తితోనుండఁగాఁ జావువచ్చునేని చత్తుఁగాని యపకీర్తికిలోనై బ్రతుకనేరను. నాజన్మవ్రతములనుమానుటతగదు. వానిఁజెప్పెదవినుము.

సీ॥ విప్రుఁడుకడువేడ్క వేఁడినఁగలిమితోఁ
బొచ్చెంబుసేయకయిచ్చుటొకటి,
బలితంపుఁగతిఁ జుఁ బరిమార్చుటొక్కటి
సమరంబులోవెలఁజచ్చుటొకటి,
శరణాగతువినట్టి శత్రునినైనను గరుణఁ
గయ్యంబునఁ గాచుటొకటి,
భామినీద్విజవృద్ధ బాలాతురులకైన
యాపదఁ జెచ్చెరఁ బాపుటొకటి,
గీ॥ యనఘయివివ్రతంబులై చెల్లునాకునిం
దొకటితప్పనేని వికలకీర్తి
నగుదుఁగానునిత్తు నఖిలమ్మునెటుఁగనా
ఖండలునకుఁగవచకుండలములు॥

సూ:—కొమరా! నీకుబ్రతుకుతెరువు చెప్పినను వినవు. నీయెడఁగల నెయ్యముచే నీకుమేలెఱింగించితిని. దానినివినవలదా?

లోకములో మనుష్యుఁడు కీర్తిఁగోరుట సహజమే; నీవును నీసుతకళత్రములును, బంధువులును, మిత్రులును, జెడకుండునట్లుగా, కీర్తిసంపాదించుటమంచిది. అందఱును జెడునట్లుచేయుకీర్తియేల? ప్రాణములున్నచో మఱియుఁగీర్తి యార్జింపరాదా? ప్రాణముతోనున్నవాఁడు కీర్తియు లక్ష్మియుఁదేజంబును, సర్వంబునుబడయఁజాలును. పీనుఁగునలంకారము చేసినవిధముగా నీవుచచ్చినపిదప నిచ్చుకీర్తిచే లాభమేమి? అట్టికీర్తిపై నాసవిడిచి నామాటవినుము. నీవు కవచకుండలములతో నున్నయెడల నిన్నొకరుజయింపఁజాలరు. ఇంద్రుఁడే కాదు, మూఁడుమూర్తులొక్కటైవచ్చినను నిన్నుబోరిలోగెల్వనేరరు. శస్త్రాస్త్రములవలని భయమునీకుఁ గలుగదు. కావునవానినివ్వకుము. ఇచ్చినచో నీవు యుద్ధములో శత్రువులచే భంగపడుదువు. దేవేంద్రునకుఁ గవచకుండలములేల? వేఱువస్తువు లియ్యరాదా? అదిదానముకాదా?

కర్ణుఁడు:—తండ్రీ! నీకునాపైఁగల మక్కువచే నింత చెప్పితివి. నాపల్కులు కోపింపక వినవలయును, నేను ప్రాణమునకు వెఱవను. ధననష్టమునకు వెఱవను; అనృతంబునకే మాత్రము వెఱతును. బ్రాహ్మణులెద్దియడిగి కేని దానినిచ్చుటనావ్రతము. దానిమాన్ప నెవ్వరితరముకాదు.

అనియిట్లు కర్ణుఁడుధీరుడై, తనచేసిన వ్రతమునకు విరోధముగానడుచుటకొల్లనని చెప్పఁగా, సూర్యుఁడాతనితోనట్లైని నీవాదేవేంద్రుని యొద్దనుండి శక్తియను నాయుధమును ముందుగాఁగొని, తర్వాత నీకవచకుండలములనాతనికిమ్మని హితోపదేశముచేసి యంతర్ధానుఁడయ్యెను.

## (3) భీష్ముఁడు తనవ్రతంబువిడువనని తల్లితోఁజెప్పుట.

పూర్వము వసిష్ఠమహామునియొక్క శాపకారణమున నష్టవసువులు భూలోకములో మర్త్యులుగా జనింపవలసివచ్చెను. వారప్పుడు గంగాదేవినిజూచి " అమ్మా! మేము భూలోకములోమనుష్యులై పుట్టవలయును. మేము సామాన్య స్త్రీలగర్భములోనుండి జనింపజాలము. నీకడుపులోఁబుట్టెదము నీవుమమ్ము భూమిపైఁబెద్దకాలముండకుండునట్లు చేయుము. ప్రస్తుతము భూమిపై శంతనుఁడనురాజు ధర్మపరుఁడై ధరణి నేలుచున్నాఁడు. నీవాతనికి భార్యవగుము. అతండును నీయెడ మోహముగలవాఁడై యున్నాఁడు. మీయిరువురకు మేము కొడుకులమై పుట్టెద" మనిరి. గంగాదేవిదానికి సమ్మతించి, యపూర్వరూపలావణ్యసంపదగల మనుష్య స్త్రీరూపముధరించి, శంతనునికి భార్యయై పుట్టిన కొడుకులనెల్ల వరుసగా నించుకేనియు నాలస్యము చేయక, గంగలోఁద్రోపించుచుండెను. రాజుభార్యయందుఁగల మోహముచే మాటాడక యూరకుండెను. ఎనిమిదవవాఁడైన భీష్ముఁడను కొడుకునుజూచి రాజపుత్రస్నేహమున వానివిడువనోపనని భార్యనడ్డగింపగా, నదియప్పుడు నిజరూపమునుజూపి "మహీపతీ! నేనుగంగను, వసువులునన్నుఁబ్రార్థింపవారినినాయందు జనింపచేసి భూమిలోఁబెద్దకాలముండకుండునట్లు గంగలోఁద్రోచితిని. వీఁడెనిమిదవవసువు. ప్రభాసుఁడనువాఁడు. మహాబుద్ధిమంతుఁడును వీర్యవంతుఁడునై యుండును. వీనితో సుఖముగానుండు" మని గంగాదేవి వసువుల జన్మప్రకారమంతయుఁజెప్పి దేవలోకమునకుఁబోయెను.

శంతనుఁడు భీష్మునకు యువరాజ్య పదవియిచ్చి రాజ్య పరిపాలనము చేయుచుండి, యొక్కనాఁడు వేటకై యమునా నది రేవునకుఁబోయి యందు విహరించుచుండఁగా, సుకుమారి యుఁ గోమలాంగియునైన కన్యనొకదానింజూచి మోహించి "ఓమృగాక్షీ! నీవెవ్వరిదానవు? ఏలయిందు నోడలు నడుపుచు న్నా"వని యడిగెను. అకన్య "మహాప్రభూ! నేను దాశరాజు కూఁతురను. తండ్రియాజ్ఞచే నీరేవున నోడలు నల్పుచున్నాను. నాపేరు యోజనగంధి" యనెను. అప్పుడే శంతనుఁడు దాశ రాజుయొద్దకుఁబోయి తనకు భార్యగా యోజనగంధినిమ్మనియ డుగ, నతఁడు సంప్రీతుఁడై "పృథ్వీపతీ! నీబోఁటి వరునకు నా కన్నియ నిచ్చుటకంటె నాకుఁగూఁతునిగన్న దానిప్రయోజన మేమి? అయినను నాకొకకోర్కెకలదు. నాకూఁతువలన నీకు జ న్మించినపుత్రుని నీపరోక్షమున రాజుగాఁ జేయవలయును. అట్లు పనీవు దానివివాహమగుము" అనెను.

రాజు భీష్మునిఁదలఁచి యట్లుచేయ నొల్లక, ప్రతిహతమ నోరథుఁడై, తనపురంబునకువచ్చి యోజనగంధిని దలంచుకొని, సర్వకార్యములు మఱచి చింతాక్రాంతుఁడై యుండెను. భీష్ముఁ డు సర్వంబును మంత్రులచే నెఱిఁగి చతురంగ బలసమేతుఁడై దాశరాజుమీఁద యుద్ధమునకుఁబోనఁగా, నతఁడు భయపడి భీష్మునితో "మహానుభావా! నీవు తండ్రి కార్యముగానిందువ చ్చితివి. నాకూఁతు నీతండ్రికిచ్చుటకు నాకభ్యంతరము లేదు. అయితే దీనిగర్భంబులోఁబుట్టినవాని రాజుగాఁ జేయవలయునని కోరితిని. దానికినీతండ్రిసమ్మతింపఁడయ్యెను. ఇదినాతప్పగునా? నీవు ధర్మాధర్మ విదుఁడవు. కార్యాకార్య సమర్థుండవు. నాయి

ష్టంబు నెరవేర్పు"మనియెను. భీష్ముఁడప్పుడు తాను రాజుగా నుండననియు, యోజనగంధి గర్భములో జనించినవాఁడే రాజ్యమున కర్తృఁడగుననియు రాజసభలోఁ బ్రతిజ్ఞ చేసెను. దానివిని దాశరాజు మఱియు నిట్లనియెను. "అయ్యా! నీవు ధర్మమూర్తివి. నీవు ప్రతిజ్ఞను నెరవేర్పఁజాలుదువు. నీకొడుకు లట్లు చేయఁగలరా? వారు తర్వాత మత్సరించి నామనుమని రాజ్యము నపహరింపఁజూడరా?" యనెను. అప్పుడు మఱియు భీష్ముఁడు తాను వివాహమాడననియు, తండ్రికార్యము నెరవేర్ప నిత్యబ్రహ్మచారినై యుండుదుననియు, దాశరాజు సభలోఁ బ్రతిజ్ఞ చేసెను. అప్పుడు వాని ధైర్యమునకును, గురుకార్య ధురంధరత్వమునకును మెచ్చి, దేవతలాతనిపైఁ బుష్పవర్షములు కురిసిరి.

శంతనుఁడంత సత్యవతియను మాఱుపేరుగల యా యోజనగంధిని వివాహమై, దానియందు చిత్రాంగద విచిత్రవీర్యులను కొడుకులం బడసి, వారికి యౌవనంబు రాకమునుపే పరలోకగతుఁడయ్యెను. భీష్ముఁడప్పుడు చిత్రాంగదుని రాజుగాఁ జేసి, తాను సహాయుఁడై యుండెను. అంతఁ గొంతకాలమునకుఁ జిత్రాంగదుఁడు దుర్మదంబుచే గంధర్వుల నెదిరించి, వారిచేఁ బోరిలో మృతినొందెను. తర్వాత రాజై వచ్చిన విచిత్రవీర్యుఁడు స్త్రీలోలుఁడై శోషించి చచ్చెను. అప్పుడు శోకసముద్రములో మునిఁగిన తల్లిని మఱదండ్రను నాశ్వాసించి, భీష్ముఁడరాజకంబైన రాజ్యము నెప్పటియట్లు నిష్కళంకమగు బుద్ధితో నరయుచుండెను. సత్యవతి యతనింజూచి "పుత్రా! నీతండ్రి రాజ్యము నీయందే నిల్చెను. అప్రతిహతముగా నీకీర్తి దిక్కులందు వెలుఁగ, నీరాజ్యమును నీవే పరిపాలింపుము. మఱియు నీవు వివాహమై పుత్రు

లఁబడయుము. నీవుండఁగా నీకులము నీకు వెనుకవిచ్ఛిన్నమగు టధర్మమగునా?" యని పల్కెను.

భీష్ముఁడు సమ్మతింపక యిట్లనియెను. " అమ్మా? మీ కిట్లుపలుకఁదగునా? నేను పితృకార్యార్థమై పూనిన వ్రతములను విడువఁదగునా? నేనంత యెుుకలేఁవాఁడనా? సూర్యుఁడు తన తేజమును విడిచినను, చంద్రుఁడు శైత్యమును దొరఁగినను, అగ్నియుష్ణత్వమును బాసినను, నేను దాల్చిన వ్రతములను మాన్పను. నాఁడుసభలో నందఱువినఁగా నట్లు ప్రతిజ్ఞచేసి, నేఁడిట్లు మాటఁదప్పినచో నాకు దుర్యశంబురాదా? దుర్యశంబుకంటె నాకు మరణమేమేలగును."

అనియిట్లు భీష్ముఁడు రాజ్యపరిపాలనము చేయననియు, బ్రహ్మచర్యవ్రతంబు విడువననియుఁ దల్లికెఱిఁగించి, శ్రీవేదవ్యాస మహాముని ప్రసాదంబున, సన్వయవిచ్ఛేదముగాకుండునట్లు, విచిత్రవీర్యుని భార్యలైన యంబికాంబాలికలయందు వరుసగా, ధృతరాష్ట్రపాండులను పుత్రులంబడసి, సంతతి వృద్ధియగునట్లు చెసెను. ఆహా! భీష్మునివంటి ధీరచిత్తులైన మహాత్ములు లోకములోఁగలరా?

## (19) పగతురనమ్మరాదు.

### (1) శ్రీకృష్ణమూర్తి దుర్యోధనునియింటఁ గుడువనొల్లననుట.

కౌరవ పాండవులకు సంధిగావించి, రెండుతెగలవారును తమతమపాళ్ళుగొని సుఖముగానుండునట్లుచేయవలయుననుతలం

పున శ్రీకృష్ణుడుఁ పాండవుల దూతయై హస్తినాపురంబునకు వచ్చెను. కృష్ణుఁడు వచ్చుచున్నాఁడనువార్తనువిని ధృతరాష్ట్రుఁడు, భీష్మాదిపెద్దలు సెప్పఁగా నగరాలంకారముగావించి, పుష్పఫలగంధాది మంగళద్రవ్యములుగొని, బహువిధ వాద్యఘోషములుమ్రోయఁగా సోదరపుత్రామాత్యబంధువర్గముతో వాసుదేవునెదుర్కొనుటకుఁ బ్రయాణమయ్యెను. కృష్ణుడు వారలనందఱఁదగిన విధమున సంభావించి వారితోఁ గరిసగరంబు జొచ్చెను.

దుర్యోధనుఁడు దురభిమాని గనుకశ్రీకృష్ణు నెదుర్కొనరాలేదు. తనయిల్లు నలంకరించి కృష్ణుని రాకకు వేచియుండెను. కృష్ణుఁడు మొదటఁ గుంతీదేవి యింటికిఁబోయి నమ్మహాదేవినూఱార్చి, తమ్ముఁడైన సాత్యకితో దుర్యోధనునిమందిరంబునకుఁ బోయెను. అందలి ద్వారపాలకులు సంభ్రమముతోఁ బఱతెంచి కృష్ణునిరాకలోపల నెఱింగించిన, దుర్యోధనుఁడు భీష్మ ద్రోణ ప్రభృతులతోను దుశ్శాసనకర్ణ వికర్ణ శకునిప్రముఖులగు వారితోను సంభ్రమంబునవచ్చి కృష్ణుని యాలింగనము చేసుకొని, తనయెదుటనున్న కనకమయ సింహాసనముపైఁ గూర్చుండునట్లు చేసెను.

దుర్యోధనుఁడప్పుడు కృష్ణునితోఁదగిన విధమున సంభాషింపుచు, నతనిని దనయింట భోజనంబునకుఁ బిల్వనెంచి కూరలవిషయమైపలుక, నయ్యాదవేంద్రుడు తానచ్చటఁ గుడువనొల్లకుండుటను స్పష్టముగాఁదెల్పెను. కురురాజాశ్చర్యముతోఁ గర్ణునివదనంబుజూచి యచ్యుతునకిట్లనియె "కృష్ణా! ఇదియేటిమాటలు? మేము నీకువలయు నన్నపానీయములు సమకూర్చియుం

డగా నీవు మాయింట భుజింప నొల్లననుట నీతికిని, బాంధవము నకును దగియుండునా? కౌరవులును పాండవులును నీకొక్కవి ధమైనవారుగదా? నీవుమాయెడ దూతవై వచ్చితివి. కుడిచికూర్చుండియెల్ల పనులు చేసుకొనరాదా?"

కృష్ణుఁడప్పుడు చిఱునవ్వుతో దుర్యోధనునిచేయిపట్టుకొనియతనితోనిట్లనె. "అయ్యా! నీకంతెయేఁ జెప్పెదవినుము. వచ్చినకార్యమునుదీర్చుకొనికదా దూతలు భోజనముచేయవలయును. అదియునుఁగాక ప్రియుడు పిలిచి పెట్టెడు కూడు లెస్సయైయుండును. పగతుఁడనితలచి, యతనియింటఁగుడిచిన, నేమి సంభవించునోయనిసందేహముతోనుండునపుడు పెట్టునట్టికూడు నీచమైనది. నీవునాకుఁబగతుఁడవనుటకు సందేహము లేదు. నీవు నిష్కారణముగా సజ్జనులైన పాండవుల కపకారములు చేసితివి. ఆపాండవులు నాకుఁ బరమమిత్రులు, భక్తులు, ప్రాణసమానులు. తనప్రాణములకలుగు జనులు వైరులనుటకు సందేహమా? పూజ్యచరితులును దోడఁబుట్టువులునునైన పాండవులకు బాల్యమాదిగా నీవు కీడే చేసితివి. సజ్జనుల కపకారము చేయు వారు నాకు శత్రువులు. కావుననీయింటఁగుడువను."

క॥ పగవారియింటఁగుడిచిన
నగుఁదమకవమానమమృతమైనను దారుం
బగతులకుఁగుడువఁబెట్టఁగ
దగదొడఁబులకెప్పుడెవ్విధమువాటిలునో॥

అనియిట్లు శ్రీకృష్ణుఁడు దుర్యోధనుని యన్నంబు దుష్టాన్నమని నిరూపించి, తనకు భక్తుఁడును మహాత్ముఁడునునైన విదురుండు ప్రార్థింప, నతనిగృహంబునకుఁబోయియందుభుజించి రా

త్రియగుటయు నందే సుఖనిద్రచేసెను.

---

## (2) బ్రహ్మదత్తుఁడను రాజుతోఁబూజనియను శారికకైన సంవాదము.

పూర్వము ధర్మరాజు భీష్మునితో "అయ్యా! ఎవ్వరిని నమ్మవచ్చును? ఎవ్వరిని నమ్మరాదు? రాజులకు విశ్వసించుట విశ్వసింపకుండుటయును నీరెంటిలో నేది మేలగును?" యని ప్రశ్నింప నమ్మహీపతికి భీష్ముఁడిట్లనియెను.

"ఓ ధర్మనందనా! పూర్వము బ్రహ్మదత్తుఁడను రాజునగరిలోఁ బూజనియను గోరువంక పిట్టయొకటి పిల్లతో వసించుచు, రసవంతములైన పండ్లు తెచ్చి, తన పిల్లకిచ్చునపుడు, వానిలో మేమేలైనవానిని నేటి రాజకుమారునకును నిచ్చుచుండును. అప్పిల్లవాఁడును పక్షిపిల్లతో మచ్చికగల్గి ముద్దుగా మాటలుకఱపుచు వేడుకతో నాడుచుండును. ఇట్లుండఁగా నొకప్పుడు దాది సమీపమున లేనప్పుడు రాచకొమరుఁడు పిల్లతల నగల్చి దానిం జంపెను. అప్పుడు దాని తల్లివచ్చి తెగినపిల్లంజూచి "అయ్యో! ఇక్కుఱ్ఱఁడు నాపిల్లతోఁగూడి యాడుచు నేఁడిట్లు నిర్దయుఁడై దానిం జంపెనుగదా! వీఁడు రాచకొడుకుగదా? వీనికి పరిచయమెక్కడిది? రాజులు వేగముగాఁ గరుణవిడుతురు. చేసినమేలు మఱతురు. క్రూరస్వభావముగలవారును, మదముచేఁ గన్నుకప్పినవారునునైన రాజులను నమ్మవచ్చునా" యనికోపముతోఁ బగతీర్చెదఁగాక యనుచు, రాజకొడుకు గ్రుడ్లులు రెండును దనవ్రేళ్లతోఁ గ్రుచ్చి వెఱికి వేగముతో నాకాశమున కెగసి, రాజుంజూచి

"నీకొడుకు పాపము చేసెను. చేసినదానికి నేను మాఱు చేసితిని. హిం
సచేయువారికి దుఃఖప్రాప్తిగాకుండునా" యనెను.

బ్రహ్మదత్తుఁడు కోపమును శోకమును బొరయక శారి
కఁజూచి " పూజనీ! నీయెడఁ దప్పేమియు లేదు. నీవుపోవుటకు నా
మనంబు విషాదమును బొందుచున్నది. నాకొడుకు నీకుఁగీడా
చరించెను. దానికి మాఱుగా నీవాతని నేత్రహీనునిగాఁ జేసితివి.
నీవు పోనేల? నాయెడ మున్నున్నరీతిగ నేయుండుము. నీపై నాకేమి
యుఁగోపము లేదు. నీకేమియుఁగీడు చేయను. ఏల నా పల్కులు
వినకపోవుచున్నా"వని యడిగెను.

పూజని యిట్లనియె " రాజోత్తమా! మనస్సులోఁ బగ
జనింపఁజేసి మఱలనిన్నుఁ గూడుట న్యాయమగునా? నీకు నాయె
డ నెయ్యము చెడినది. తియ్యనిమాటలచేఁ బ్రయోజనమేమి?

క॥ నెయ్యము చెడినను మాటల
తియ్యఁదనము పెట్టి, పగ మదిన్మ్రుచ్చిలఁ జా
వయ్యెఁగలఁక య్యొమఱి చే
టయ్యె, నొకటి మూఁడుగాక యది మేలగునే?॥

పగ యొకసారి కలిగినయెడల నదిపోనేరదు. మ్రానులోనగ్ని
గూఢమైయుండువిధమున నది లోపలనే రహస్యముగానుండును.
పగగలవారిని నమ్మి చేరినయెడలఁ గాలాంతరముననైనఁ జేటు
గలుగక మానదు. సముద్ర జలములోపలనుండి యాఱక గన
గనయును బాడబాగ్నివలె జనులయొక్క చల్లనిమాటలలో న
లుకయుఁ బగయు మునిగియుండి పొగయుచుండును. నాకు నీయెడ
వసించుట తగదు. నీనేర్పుమాటలుడుగుము. నేను బోయెద"
అని యిట్లు శారిక రాజుమాటలకు లోఁబడక యవిశ్వాస

ము మనముననెలకొల్పి, రాజునగరివిడిచి తనకిమ్మైనయెడకుఁజని యెను. కావున, ధర్మనందనా! పగతురనమ్మరాదు. పగమొదటకొంచెమైనను తర్వాతనధికమై యగ్నివలె బెరుగును. తుదకు గీడు వాటిల్లఁ జేయును.

క॥ " తెగఁదీర్పక తెగనార్పక
తెగటార్పక కడముకొంతదిక్కుఁగనున్నన్
జగతీశ!యప్పునగ్నియుఁ
బగయునుమఱిపెరుగుఁగీడుపాటిల్లుఁదుదిన్ "॥

## 20 కామక్రోధాదులను విడువవలయును.

### (1) ప్రహ్లాదుఁడు తండ్రికిఁజెప్పిన వాక్యములు.

పూర్వము ప్రహ్లాదుఁడను రాక్షసరాజ పుత్త్రుఁడు, తనతండ్రియగు హిరణ్యకశ్యపుని యాజ్ఞను మీఱి విష్ణుదేవునియందధికభక్తిగల్గి, సద్గుణంబులకెల్ల నిధియైయున్నవాఁడని జనులుపొగడునట్లు వర్తించుచుండెను. తండ్రినాస్తికుఁడు. విష్ణుదేవునియెడ విరోధముగల్గి లోకములకుపద్రవము చేయువాఁడై యుండెను. బలమును సంపదయు వీర్యమును దేజస్సునుగలవాఁడని మదించి, యొకప్పుడు భక్తశిఖామణియైన ప్రహ్లాదుంజూచి "పుత్త్రకా! నేనెంతచెప్పినను నీవు విష్ణుదేవునిఁగొలుచుట మానవు. అతఁడు నాకంటెగొప్పవాఁడా? నేనింద్రాదిదేవతలనెల్ల నోడించి వారి సంపదలు గొంటిని. వారెల్ల నాకుఁగింకరులై పనిచేయుచున్నారు. నాయాజ్ఞనుమీఱవెఱతురు. నాకు వైరియు,నాకంటె హీనుఁడైన యావిష్ణునియందు భక్తినివిడువుము. విష్ణువనియు

గిష్ణువనియు, హరియనియు, గిరియనియుఁ బ్రేలకుండుమనికోపిం చి పలికెను.

ప్రహ్లాదుఁడప్పుడు శాంతముతో నిట్లనియెను. ఓరాక్ష సేంద్రా! ఆవిష్ణుదేవుఁడు సర్వభూతములయందు సముఁడైనవా డు. అఖిలజగమును గల్పించును, రక్షించును, సంహరించును. అతఁడన్నిరూపములందునువ ర్తించును. అమ్మహాత్ముని స్వభావ మెఱుఁగక నీవుపలుకుచున్నావు. నీమనస్సు నీకు వైరిగానియా దేవుఁడువైరిగాఁడు. నీవు మదముగల్గి మార్గముదప్పి వర్తించు చిత్తముగలఁవాఁడవు. లోకములెల్లను నిమిషములో జయించితి నని పొగడుకొనుచున్నావుగాని, నీమనస్సులోనుండు భయంక రులగు శత్రువులార్వురను గెలువ నేరకున్నావు. కామము, క్రో ధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము, అనునీ యాఱును మనుష్యులకు నిత్యశత్రువులు. వీనిచేతనే మానవుల కు సకలాపాయములు గల్గుచున్నవి. ధైర్యముకల్గివానినిసత్సహ వాసముచే నణపవలయును. వెలిపగఱను గెలుచుట గెల్పు కాదు. దానిచేలాభములేదు. లోపలి శత్రువులఁగూల్చువాఁడే పుణ్యా త్ముఁడు. అతఁడే దేవతాసముఁడు. వానికిసర్వమంగళములగును. కావున నీవుదుర్మదమునువిడిచి, యరిషడ్వర్గములనునీయార్వురు శత్రువులనులోఁబఱచి, శాంతస్వభావముకల్గి విష్ణుదేవునిగొల్వు ము. దాననీకు మేలగును.''

ఉ॥ లోకములన్నియుంగడియ లోనజయించినవాఁడ వింద్రియా
నీకముఁజిత్తమున్ గెలువ నేరవునిన్నునిబద్ధుఁజేయునీ
భీకరశత్రులార్వురఁ బ్రభిన్నులఁజేసినఁబ్రాఁకికో
నీకువిరోధిలేఁడొకఁడు నేర్పునఁజూడుము దానవేశ్వరా॥

అనియిట్లు ప్రహ్లాదుఁడు తండ్రికి హితముచెప్పఁగా, నాదురాత్ముఁడైన హిరణ్యకశ్యపుఁడు వినక, కొడుకుపైఁగోపించి వానిని హింసింపదొడంగిన, భక్తవత్సలుండైన విష్ణుదేవుఁడు నరసింహరూపమున బొడసూపి, యారాక్షసరాజుఁజంపి ప్రహ్లాదునింగాచెను.

(2) పతివ్రత కౌశికునకు హితోపదేశము చేసినవిధము.

తొల్లి కౌశికుఁడను బ్రాహ్మణుఁడు సంతతమువేదాధ్యయనముచేయుచు, సంధ్యావందనాది నిత్యకర్మానుష్ఠాన పరుఁడై యొక శ్రోత్రియ గ్రామమున వసించుచుండెను. అతండొక్కనాఁడు గ్రామ సమీపముననున్న వృక్షంబుక్రిందఁ గూర్చుండి వేదంబులు గుణించుచుండ, నాతనిపైఁజెట్టుమీఁదనున్న కొక్కెరయొకటి రెట్టవైచెను. దానింగని విప్రుఁడు కోపించి చూడఁగానది యప్పుడే చచ్చినేలపైబడియెను. బ్రాహ్మణుఁడు పరితపించుచు "ఆహా! నాహృదయములో నించుకైన దయలేక పోయెనుగదా'నిర్నిమిత్తముగా నీకొక్కెరను మృతినొందించితినే" యని తన్నుఁదాన నిందించుకొని, కృతస్నానుఁడై గ్రామంబునకుఁబోయి, శుచులైన బ్రాహ్మణుల యిండ్లయందు భిక్షయాడుగుచు, నొకపుణ్యగృహంబు వాకిటనిల్చి "భిక్షాందేహి" యనియెను.

ఆవచనంబువిని యాయింటిలోనున్న పుణ్యస్త్రీ బ్రాహ్మణునకు భిక్షయిడుటకై పాత్రశోధనంబు చేయుచుండెను. అప్పు

డు దానిభర్త మిక్కిలి యాఁకలిచే దూలుచు నింటికిరాగా,నతి నికిఁభక్తితో బరిచర్యలు చేసి, షడ్రసోపేతమైన యన్నముపెట్టి తాంబూలమిడి, చరణంబులొత్తుచు శయనంబుపై నిద్రింపఁజేసెను. అప్పుడు దానికి వీధిలో భిక్షుకై నిల్చిన బ్రాహ్మణుని జ్ఞాపకము రాగా భిక్షుఁగొని వీధిలోనికి వచ్చెను.

ఆపుణ్యాంగనను కౌశికుఁడు కోపించిచూచి " ఓసీదుష్టురాలా! నీకింతగర్వమా? భిక్షకొఱకు నేనువచ్చియెంతకాలమయ్యెను? కడుఁగ్రొవ్వుననన్నింతసేపు నిలువఁబెట్టి నన్నవమదించితివి.'' యనియెను. దానికాయిల్లాలు వినయంబుతోనిట్లనియె " విప్రోత్తమా! నేనుగర్వముచే నిట్లుచేసినదానను గాను. నీకుభిక్షయిడుటకై యత్నము చేయుచుండఁగా, నామగఁడువచ్చెను. అమ్మహాత్మునకుఁబరిచర్యలు సేయుచుండి నిన్నుమఱచితిని. కోపింపకుము.''

బ్రాహ్మణుఁడు దానివచనంబులకు సమ్మతింపక మఱియు నిట్లనియె "మగువా! నీమగఁడంతయెక్కుడవనా? నేనంతతక్కువనైతినా? ఏలక్రొవ్వునఁగన్నుగానరాక బ్రాహ్మణులకవమానముచేసెదవు? ఇంద్రాదిదేవతలెల్ల బ్రాహ్మణులయెడభక్తిగల్గి వర్తింపుచుండగా నీవేల వారిమహిమ యెఱుఁగక యిట్లుచేసితివి?'' యనియిట్లువలువిధములనా బ్రాహ్మణుఁడు పతివ్రతనుదిరస్కరించిపలుక, నదియప్పుడు వానికిట్లనియె. "అయ్యా! బ్రాహ్మణులు దేవతాసమూలగుటను నెఱుగుదు. వారిమహిమయు నెఱుగుదును. ఒకబ్రాహ్మణుఁడు తొల్లికోపించి సముద్రజలమును పానముచేయుటయును, మఱియొకఁడు దేవేంద్రుని భంగపఱచినదియును నేనెఱుఁగుదును. బ్రహ్మవిదులైన బ్రాహ్మణులప్రభా

వమును నేనెఱిఁగియెఱిఁగి కోఅవితోఁ దలగోకికోనుసంత వెట్టి దానముగాను. నావిధము చెప్పెదనువినుము. నాకుఁబతియే దైవము. భర్తకు భక్తితోఁ బనులు సేయుటయు, నతనికి హితమాచరించుటయు, త్రికరణశుద్ధిగల్గి యతనింగొల్చుటయు, నాకుబరమైనధర్మములు. నీవుధర్మసూక్ష్మమెఱుఁగవు. కేవలము వేదమునుమాత్రము చదివినవాఁడవు. నీవు కోపనుండవగుట నేనెఱుఁగుదు. నీకోధము చే నొక్క కొక్కెరమ్రానుక్రిందఁబడి చచ్చినదియెఱుఁగుదు. దీని నేను నాపాతిబ్రత్యమహిమచే నెఱిఁగితి. నీకుహితోపదేశము చేసెదనువినుము. అయ్యా! మనుష్యులయంతఃకరణములలో ఘోరమైనశత్రువులిరువురున్నారు. వారికి క్రోధమనియు, మోహమనియు పేర్లు. ఎఱియుచున్న నీశత్రుద్వయుంబునునణపలేనివాఁడు బ్రాహ్మణుఁడుగాఁడు.

గీ॥ క్రోధ మోహనామకులైన ఘోరశత్రు
లిరువు రెరియించుచుండుదు రెపుడునరుని
నంతరంగములోపల నడఁపకున్నఁ
గలదెయూరక బ్రాహ్మణ గౌరవంబు॥

భూసురోత్తమా! వినుము. సత్యంబుపలుకుటయును, హింసావిదూరుఁడగుటయును, గురుజనంబులసేవించుటయును, కామక్రోధాదులనణచుటయును, సకలభూతములను దనవలెఁజూచుటయును, యజన యాజనాధ్యయనాధ్యాపనదాన ప్రతిగ్రహములనెడు షట్కర్మలు చేయుటయును, బ్రాహ్మణులయొక్క ముఖ్యధర్మములు. పై గుణములే బ్రాహ్మణులయొక్క ధనమగును. నీకు ధర్మవిశేషంబు తెలియదు. దానినెఱుఁగుటకై మిథిలానగరమునకుఁబొమ్ము. అందు ధర్మవ్యాధుఁడను కిరాతుఁడున్నవాఁడు.

అతఁడు నీకు సర్వంబు నెఱిఁగించు''నని యిట్లు పతివ్రత బోధింప, నావిప్రుఁడు పతివ్రతయొక్క బుద్ధికిని, గుణంబులకును మెచ్చి, దానిం దీవించి చనియెను.

## 3 కోపము చెడ్డదని శమీకమహాముని తనకొడుకునకు బోధించుట.

పూర్వము జనమేజయుని తండ్రియైన పరీక్షన్మహారాజు వేఁటయందాసక్తి కలిగి యొక మృగంబు వెంటఁ దగిలి వనములోఁ బోవుచుండగా, శమీకమహాముని తపస్సు చేయుచున్న యాశ్రమమును జేరెను. అమ్మహాముని కన్నులు మూసుకొని ప్రపంచ మెఱుఁగక, యేకాగ్రచిత్తుఁడై తపస్సు సలుపుచుండెను. రాజాతనిం జూచి "మునివర్యా! నేను తఱుముకొనివచ్చిన మృగమిందు వచ్చెను. అది యెందు డాగెనో నాకుఁ జెప్పవలయు" ననియడుగ, నతండు మౌనియై ప్రతివచనంబియ్యకుండెను. రాజు కోపించి వేటచే నలసినవాఁడు గనుక కార్యాకార్య మెఱుఁగక, యతని మెడపై చచ్చిన పాము నొకదానిఁ దగిల్చి తనపురంబునకుఁ బోయెను.

అమ్ముని కుమారుఁడు శృంగియనువాఁడు, మహాక్రోధనుఁడు, తండ్రి మెడపైఁ జుట్టిన సర్పశవమును జూచి కోపించి, యిట్లు నాతండ్రి నవమానపఱచినవాఁడు నేటికేడవనాఁడు పాముచే కఱవఁబడి మృతినొందుగాక, యని ఘోరమగు శాపమిచ్చెను. పిమ్మటఁ గొంతసేపటికి మునివర్యుఁడు తపము చాలించి మెడయందు వ్రేలుచున్న సర్పమును జూచి, యిది యేమియని కో

దుకునదుగ నతఁడు జరిగిన వృత్తాంతమంతయు సవిస్తరముగాఁ జెప్పెను.

అప్పుడు శమీకుఁడిట్లనియెను. " పుత్రకా! నీవు రాజును శపించుటధర్మముకాదు. అతఁడు వేఁటతమకముననిట్లు చేసెను. జనులు స్వచారిత్రములు తప్పకుండునట్లు పరిక్షిన్మహారాజు రాజ్యమేలినట్లుగా నితరరాజులు రాజ్యపరిపాలనము చేసియున్నారా? నీవు కోపవశుఁడవై ధార్మికోత్తముఁడైన రాజునకు శాపమిచ్చితివి కోపము చే మనుష్యులు చేయరాని కార్యములు చేయుదురు. తపస్వులకు ముఖ్యముగాఁ గ్రోధమును విడువవలయును. అది తపస్సును జెఱుచును, అణిమాదులైన యెనిమిది గుణములను బాపును. ధర్మమునకు బాధకలిగించును. నీవు ముందువెనుకవిచారింపక ధర్మవిరుద్ధమైన కోపంబు జేకొని, యన్యాయముగా రాజునకు హాని చేసితివి. క్షమలేని నీతపస్సులు? ఎఱుకగలవాఁడు క్రోధమను మహానలమును నెఱుకయను జలముచే నార్చి శాంతిచిత్తుఁడై ప్రవర్తించును.

గీ॥ పాపములకెల్లనెక్కుడు పాతకములు
సువ్వె క్రోధలోభంబులు సువ్రతాత్మ
వానిరెంటిజయించినవాఁడుగాని
యెందుఁబరమధార్మికుఁడనియెన్నఁబడఁడు॥

క॥ అనుపమనియమాన్వితులై
యనూనదక్షిణలఁగ్రతుసహస్రంబులు చే
సినవారికంటెనక్రో
ధనుఁడు కరంబధికుఁడం డ్రు తత్వవిధిజ్ఞుల్॥

అనియిట్లు కొడుకునకు హితోపదేశము చేసి శాపమును

గ్రిమ్మఱింపుమని శమీకుఁడు చెప్పఁగా, నతఁడట్లు చేయకుండెను. రాజు నపము డిపసంబునఁ దక్షకుఁడను పాముచేఁ గఱవఁబడి మృతినొందెను.

---

4 దుర్మదంబుచే నహుషుఁడు చెడినవిధము.

అజగరోపాఖ్యానము.

వనవాసవ్రతమును బూనిన పాండవులు హిమవత్పర్వతారణ్యభూములయందు వసించుచుండఁగా, నొక్కనాఁడు పదివేల గజముల బలముగలవాఁడైన భీమసేనుఁడు వేటకై చని, వనంబులో నొక్కయెడ నొక్కబలిష్ఠమైన పన్నగముచేఁ బట్టువడియెను. అప్పాము తన్నాహారార్థముగాఁ బట్టుటకును, దానిపట్టును వదలించుకొనుటకుఁ దనకు సామర్థ్యము లేకపోవుటకును, విషాదమును విస్మయమును జెందినవాఁడై, భీముఁడప్పాముతో నిట్లనియె. "అయ్యా! నీవొక సామాన్యమైన పాముగాదు, సర్పరూపము దాల్చిన దేవతవో, లేక సిద్ధుఁడవో కావలయును; లేనియెడల నావంటి యనంత బలసంపన్నునిఁ బట్టుటకు సామాన్యమైన సర్పములకు బలమెక్కడిది? నీకింత బలమును వీర్యమును గలుగుటకుఁ గారణమేమి? నీవిధంబంతయు నాకుఁ జెప్పుము."

అనియిట్లు భీమసేనుఁడు తన్నడిగించి పాముయొక్క చరిత్రవిషయమై యడుగ, నదితిర్యగ్జాతియయ్యును దనపూర్వజన్మవృత్తాంతమెల్ల నెఱిఁగినదికావున, భీమునితో మనుష్యవాక్యముల నిట్లనియె. "ఓపాండుతనయా! నేనుపూర్వమున నహుషుఁడను పేరుగల రాజై యుండి దేవతలునన్నుఁ బ్రార్థింప నింద్రపదవినిబొంది,

మహావైభవముతో స్వర్గలోకమును బరిపాలించితిని, ఐశ్వర్యమదముచే సప్తమహర్షులైన యగస్త్యాదుల నవమదించి యుట్లు పెనుఁబాముసై సంచరించుచు, వరలాభంబుచే బలముగల్గి యెదురైన శార్దూలశరభసామజాది మృగములఁబట్టి తినుచుండఁగా, నేఁడునాకు భక్ష్యమై నీవు చిక్కితివి"

అనియిట్లు భీముఁడును సర్పమును, దమతమ వృత్తాంతములను జెప్పుకొని దుఃఖించుచుండగా, ధర్మరాజు భీమునిగానకదుఃఖించి, యతనిరోయుచు వనములో ముందుగా పన్నగగ్రృహీతుఁడై కదలనేరకున్న తమ్మునింజూచి విస్మయమంది యుయ్యాజగరంబుతో నిట్లనియె. "అయ్యా! నీవు సర్పరూపమునను న్నదైత్యుఁడవో, దానవుఁడవో నాకుఁజెప్పుము. నాతమ్ముని మాంసార్థముగాఁ బట్టనేల? నీకుఁగావలసినంత మృగమాంసాదులు తెచ్చిపెట్టెదను. వానివిడువుము."

సర్పమప్పుడు తనవిధమంతయు భీమునకుఁ జెప్పినవిధముగా ధర్మరాజునకును జెప్పి మఱియునిట్లనియె.

చ॥ చదివితినెల్లవేదములు సత్క్రియఁ జేసితినూఱుయజ్ఞముల్
విదితముగాసురేంద్రపదవీస్థితిఁబొందితిదుర్మదంబునన్
దుదిఁబెనుఁబాము నైయధికదుఃఖుఁడనై తిసుఖంబుదుఃఖమున్
వదలకచేయుచోటబల వద్విధికేమిభరంబుసెప్పుమా॥

ఓధర్మనందనా! ఆయగస్త్యమహామునినాకుశాపమిచ్చినప్పుడు నేనతని శాపమోక్షము ప్రసాదింపవలయునని వేడుకొంటిని. అతఁడుకరుణించి నీయడిగినప్రశ్నలకుత్తరమిచ్చు మహాత్ముని సందర్శనమున నీవు శాపవిముక్తుఁడవగుదువనియెను. కావున నేనడుగు ప్రశ్నలకుత్తరమిచ్చి, నీతమ్ముని విడిపించుకొనిపొమ్ము.

నాకును శాపము తొలఁగును.

అనిన ధర్మరాజు నహుషుఁడడిగినప్రశ్నల కెల్ల సదుత్తరములిచ్చి భీమసేనుని విడిపించుకొని, శాపవిముక్తుఁడై దివ్యరూపమున వెలుఁగుచున్న నహుషుంగని నమస్కరించి, యతనిచే వేదాంతవిషయము లెల్లనెఱిఁగి, తమ్మునిందోడ్కొనితనయాశ్రమమున కరిగెను.

క॥ "మదమలినమనస్కుండై
తుదిలేక వినయము సేయుదుర్జనునకుసం
పదపెద్దయయ్యునాతని
మొదలిటి సంపదయుఁజెడుసమూలముదీనన్"॥

క॥ "కోపమునుబ్బునుగర్వము
నాపోవనియునికియునుదురభిమానము ని
ర్వ్యాపారత్వమునననివి
కాపురుషగుణంబులండ్రుకౌరవనాథా"॥

## 3 స్త్రీలధర్మములు.

### (1) స్త్రీలకు భర్తలయందుగల స్నేహము బలవంతమైనది. హిడింబ భీమసేనునింగూడుట.

పూర్వము పంచపాండవులును గుంతియు లక్కయింటిలోఁ జావునకుఁదప్పి, విదురునిచే నియోగింపఁబడిన ఖనికుఁడు చేసిన భూవివరముద్వారా హిడింబవనమునకు నెవ్వరెఱుఁగకుండవచ్చి చేరిరి. మహాబలశాలియైన భీమసేనుఁడుండుటంబట్టియే వారట్లు రాఁగల్గిరి. తల్లియు నన్నదమ్ములును నాకలిబాధ కోర్వలేక

మీఁదివస్త్రంబులుక్రిందఁబఱచికొని యవ్వనంబులోనొకమఱ్ఱిక్రిందనిద్రించిరి. భీముఁడవ్వనంబులో రాత్రియంతయు నిద్రింపక వారికిఁ గావలివాఁడై సమీపముననేయుండెను.

అప్పుడా యరణ్యమున హిడింబుఁడను రాక్షసుఁడు సంచరించుచునావృక్షముక్రిందసుఖనిద్రఁ జెందియున్న కుంతీ ధర్మరాజాదులంజూచి, తనచెల్లెలగు హిడింబతోనిట్లనియె." ఓచెలియలా! నేఁడు మనయదృష్టమేమందును? అల్లవటవృక్షముక్రింద మనుష్యులు కొందఱు భయమింతయు లేక నిద్రించుచున్నారు. వంటయిల్లుకుందేలు వచ్చినవిధముగా వారు మనకాహారముగానిందు వచ్చియున్నట్లున్నది. నీవు వేగముగాఁబోయి వారింజంపి,రసోత్కృష్టమైన మానవమాంసఖండములు నాకు వండిపెట్టుము. మనుష్యమాంసముఁదిని పెద్దకాలమయ్యెను."

హిడింబ యప్పుడేకదలి, యిట్లు మూఢురాలై వచ్చి నిద్రించువారెవ్వరగుదురో చూచెదనని, యొక్కప్రక్కఁగానిల్చి వారలంగనుఁగొనుచుండెను. అంతనది పద్మపత్రములవంటి నేత్రములును, వెడలుపుటురమును, నిడుదలగు చేతులునుగల వాఁడునై యధిక సౌందర్యసంపదచే నొప్పుచున్న భీమసేనుంజూచి మదనపరవశురాలై మనుష్యస్త్రీరూపమునుధరించి, యన్నమాటలు మఱచి భర్తృస్నేహంబుతోనతని యెదుటవచ్చినిల్చెను. ఆహా! లోకంబున స్త్రీలు బంధువులను వదలి మగని యందాశగలవారగుదురనుట సత్యమేకదా?

భీముఁడాశ్చర్యముతో దానింగని "ఓతరుణీ!నీవెవ్వరు? ఏలయియ్యెడకు వచ్చితివి? నీపేరేమి?" యనియడుగ, నతనికిహిడింబ వినయముతో నిట్లనియె. "అయ్యా! నేనీ వనమును బా

లించు హిడింబుఁడను రాక్షసుని చెలియలను. నా పేరుహిడింబ. మిమ్ము నందఱను జంపుటకై నాయన్న నన్ను పంపెను. నేను నిన్నుఁ గన్నతోడనే కామమోహితనై నిన్ను భర్తగాఁ జేసుకొనఁ దలఁచితిని. ఈనిద్రించు వారితో నీకేమిపని? నన్ను వివాహమైన యెడల నాయన్ననిన్నుఁగాపాడును. లేనియెడల మిమ్మందఱను జక్కఁబెట్టునఁ జంపును. వీరినివిడిచి నాతోఁగలిసి సుఖముగానుండుము.''

అనినభీముఁడప్పుడు కలుషించి యిట్లనియె. "ఓసీమూర్ఖురాలా! ఇట్టిదుర్భాషలింకను జెప్పకుము. ఎట్టిపురుషుఁడైనను దల్లిని తోడఁబుట్టినవారినివిడిచి చపలమైన స్త్రీసుఖములుబొందనాసపడునా?

క॥ వినుమేలయెట్టికష్టముఁ
దనపురుషగుణంబుసెడఁగఁ దల్లినిఁదోఁబు
ట్టినవారివిడిచిరాగం
బునఁజపల స్త్రీసుఖంబు వొందునె? చెపుమా''॥

అదియునుఁగాక నీయన్నయంతబలిష్ఠుఁడా? నాబలమును శక్తియు నీవెఱుఁగవు. సురాసురులెల్లవచ్చినను వారితోఁబోరాడి జయింపఁగలను. ఇటనుండక పొమ్మా, నీయన్ననిందురమ్మనుము. వానినేమిచేసెదనో చూడుము."

వారిరువురిట్లు సంభాషింపుచుండగా హిడింబాసురుఁడు చెల్లెలట్లుపోయి తడయుటకు మండిపడిపాండవులున్న యెడకు భయంకరరూపముతో వేగముగా వచ్చెను. హిడింబ యప్పుడు భయపడి భీమసేనుని మఱుఁగుసొచ్చెను. దానినోడకుండుమని యాశ్వాసించి, భీమసేనుడా రాక్షసునితో మల్లయుద్ధముచేసి

వానింజంపి, సింహనాదముగావించెను. కుంతీదేవియు, ధర్మరాజు మొదలగువారును మేల్కొని జరిగినవృత్తాంతమంతయును హిడింబచేవినిరి. భీముఁడట్లు రక్కసునుక్రుడఁగించివచ్చి, మఱియు నక్కొకుఁలింబొమ్మనితిరస్కరించిపలుక నదిభయపడి కుంతీదేవి కాళ్లపైఁబడి, "అమ్మా! నేను భీమునిజూచి మన్మథపరవశురాలై భర్తృస్నేహంబున నాతనింగూడితిని. నాబంధువులనెల్ల విడిచితిని. నాకుమీారనుగ్రహింపనినాఁడు నేనుమృతినొందుదును. నేనింక నొరుల వరింపను, నాయిష్టమును సంపూర్తిచేయ వలయు"నని మొఱలిడెను.

అంతఁగుంతియు ధర్మరాజును సమ్మతించిపలుక, భీముఁడు హిడింబనుబెండ్లియై దానియందు ఘటోత్కచుఁడను సుతు నింబడసెను.

2 స్త్రీలకు భర్తలపల్కులు మీారకుండుటయే పరమధర్మము.

ఓఘవతి చరిత్రము.

పూర్వము సుదర్శనుఁడనురాజు, ఓఘవతుఁడనురాజుకూఁతురగు ఓఘవతియనుదాని వివాహమై, గృహస్థాశ్రమమునందుండి యతిథిజనులను భక్తితోఁగొల్చి, మృత్యువును గెలుతునని ప్రతిజ్ఞచేసి, కురుక్షేత్రమునందొక రమణీయమైన పర్ణశాలను నిర్మించియందు భార్యతోవసించుచుండెను. ఒక్కనాఁడతఁడుభార్యను జూచి "మగువా! నాకునతిథులను బూజింపవలయునని కోరిక యగ్గలమైయున్నది. నీవును దానికనుకూలముగా నడుచుకొనవలయును. ఏనింటనున్నను లేకున్నను నీవొక్క విధముగా మన

యింటికి వచ్చినవారిని నాదరించి, కార్యములందేమఱుపాటు లేక యతిథిజనులయొక్క కోరికలను దీర్చుచుండుము. అతిథిదేవోభవ"యని చెప్పుదురుగావున, నభ్యాగతులకు మనస్సంతుష్టిగలుగఁజేయుటయే గృహస్థుల ధర్మమగును. అతిథియైవచ్చినవాఁడు నిన్నుఁగోరినేనియు, నీవేమియు మాఱుపలుకక యతనికిఁబ్రియంబైనదానిని జేయుము ఇదినాయాజ్ఞసుమ్ము. భార్యకాభర్తజెప్పినట్లు చేయుటయేధర్మము"అనిదానికి గృహస్థధర్మమహిమనెఱిగించి, తాను జెప్పిన చందమున ప్రవర్తింప వలయునని యూఁడి చెప్పెను.

ఇట్లాదంపతులు చలిపందిరివిధముగను, ఫలభరితమైన వృక్షమువలెను, ప్రజలయొక్క దప్పులుతీర్పఁగానమరియున్నయాశ్రమోత్తమమైన గృహస్థాశ్రమమును నడిపి, యతిథిసపర్యలందు నిష్కల్మషవర్తింపుచుండఁగా, నొకప్పుడా గృహస్థుఁడు వనంబులోనుండికట్టెలు దేరసరిగెను. అతనిభార్య యోఘవతియింటిలో నొంటరిగానుండెను. అప్పుడు దానిపాతివ్రత్యమును ధర్మనిత్యతయు నుపరీక్షింపఁదలఁచి, ధర్మదేవత విప్రవేషంబున దానియింటికతిథియైవచ్చెను. ఆయిల్లాలు సంభ్రమమున లేచి, యభ్యాగతుండైన ధరణీసురోత్తమున కర్ఘ్యపాద్యాచమనంబులిచ్చి, ప్రియంబుతో నాసనంబువెట్టి, భక్తివినయంబులు మెఱయ నిల్చియుండఁగా, నాకపటబ్రాహ్మణుఁడాతలోదరిం జూచి "తరుణీమణీ! నీవిచ్చినపూజలచే సంతుష్టుఁడనైతిని. నేను నీమోహముగామాతురుఁడనైయున్నవాఁడ, నాకుంబ్రియంబుసేయుము. నీవెఱుఁగని గృహస్థధర్మమున్నదా?" యనెను. అప్పుడా పతివ్రత విప్రవర్యునిజూచి "అయ్యా! మీకు వేఱొండు వస్తువులయందుఁ బ్రీతిలేదా?" యని

యడిగెను. దానికాతఁడు "మానినీ! యేల తామసించెదవు? మన్మథాగ్నిచేఁ దపింపఁబడుచున్న నాకు బ్రియంబొనర్చి నన్నుస న్మానింపుము. ఇదియే నాకభ్యర్థనీయమైన"దని తనపట్టు విడువ కుండెను.

ఓఘవతికి ధర్మసంకటమైన తరుణముగల్గెను. పరపురుషునితోఁ గూడుట పాపముకదాయని తలఁచును. భర్తగారొక్క మాటలు తలంచును. భర్త చెప్పినవిధముగా నాచరించుటయే మేలైనదని తనలోనూహించును. అతిథియిట్లు తన్నుఁగోరునా యని తనలోనుడుకును. అతనికిష్టమైనవిధమున నడచుటయే ధర్మమనియాలోచించును. ఇట్లుపరియాలోచిత్తమును నెట్టకేని దిట్టపఱచుకొని, భర్తయాజ్ఞాప్రకారముగా వర్తింపుటయేధర్మ మనినిశ్చయించి, లజ్జతో మోమువాంచి, బ్రాహ్మణునిఁ మన్ని సన్న చేసియతనితోరహస్యమగు చోటునకుఁబోయెను.

తే॥ పతియుచుట్టంబుఁబక్కంబుఁబతియుచెలియు
బతియుతల్లియుఁదండ్రియుఁ,బతియుగురువుఁ
బతియుదైవంబుఁగావుననతనిపనియె
నర్పుటయుచూవెధర్మంబునాతికగయ॥

గీ॥ "భర్తచేతనియోగింపఁబడకసతికి
నేయును జేయఁగాఁదగ దెద్దియైన
భర్తచేతనియోగింపఁబడినదానిఁ
జేయకునికిదోషంబని చెప్పెమనువు"॥

అనియిట్లు పతిపంపుచేయుటయేధర్మమని తలఁచియాసాధ్వీ మణి బ్రాహ్మణుని గన్నఱుఁగైనయెడకఁ గొని పోవఁగా, నప్పు డే దాసిభర్త సుదర్శనుఁడు పర్ణశాల వాకిటవచ్చినిల్చి భార్యం

బిల్చెను. అతిథియప్పలుక్కులువిని యూరకుండుమని ఘోషవతి కిఁజెప్పెను. ఎంతపేరెత్తిపిల్చినను మఱుమాటవినఁబడమిచేఁతన వల్లభుఁడెట్లయ్యెనో, యెందుఁబోయెనోయని సుదర్శనుఁడు ప్రేముడిపలుకులుపలుక, నతనికి లోపలనుండి బ్రాహ్మణుఁడిట్లనెను. "అయ్యా! నీభార్యనా కాతిథ్య మొనరింపుచున్నది. నీవుగృహధర్మమెఱిఁగినవాఁడవు ఏలకోపించెద?" ననెను. దానికతఁడు "ఓమహానుభావా! నీవువచ్చుటచే నేనుకృతార్థుఁడనైతివి, అతిథిపూజలుగావింపఁబడు గృహములు, విమలమైన ప్రదేశములు. నీవు మాయింటఁ బూజింపబడిన దానికి సంతుష్టుఁడనైతిని. నాపలుకులునిజము. దీనికిసాక్షులు పంచమహాభూతము'లనిన,నప్పుడాకాశములోనుండి యశరీరవాణి యుఁడఱువినగా "నీరాజుధర్మాత్ముఁడు, వానిపలుకులునిజము" అనివినిపించెను.

అప్పుడతిథి పరమప్రీతితోనాతని సన్నిధికేగుదెంచిదుర్నిరీక్ష్యమైనతనదివ్యరూపమునుజూపి, "ఓగృహస్థోత్తమా! నేనుధర్మదేవతను. నీమనస్సువరయఁగానిందువచ్చితిని. నీవుమహానుభావుడవు. అతిథులందకృత్రిమభక్తిగలవాఁడవు, కామరోషాదిచిత్తవికారములెల్లవిడుచుటచేనీవు మోక్షార్హుఁడవైతివి. మనుష్యులుపుట్టిననాఁడుమొదలుకొనివెనువెంటనేతగిలివచ్చుమృత్యువును నీవు జయింపఁగల్గితివి. ఈదేహముతోడనే నీకునూర్ధ్వలోకమునకుఁబోవచ్చును. నీభార్యయు మహాసాధ్వి, నిందింపరానిచరిత్రముకలది" యని యారాజవర్యునిభార్యాసహితముగాఁ గొనియాడి, ధర్మదేవతధవళహయసహస్రంబుపూనినతనదివ్యవిమానమెక్కిపోయెను.

అతిథిపూజగడచినట్టి ధర్మపుగృహస్థులకు వేఱొండులేదు. నాథునియిష్టప్రకారము నడచుటయే నాతికిధర్మమైనది.

### 3 భార్యాభర్తల స్వరూపము.

ఋతుమతిగాక పరిశుద్ధమైన వర్తనలుగలయింతికన్యయనబడును. దానివివాహమునకుఁదగిన ప్రయత్నములు చేయఁదగినట్టివారు దానితల్లిదండ్రులు, తండ్రితోడఁబుట్టులు మాతులుఁడు,సోదరులు మొదలగుముఖ్యబంధువులు. కులమును,శీలమును, విద్యయునుగల వరునింబిలిచి వానికిఁబ్రీతితోఁగన్నియ నీయవలయు. తగనివరునకుగన్యనిచ్చుట బ్రహ్మహత్యమహాపాతకమునకుసరియైనది.

గీ॥ రూపగుణశీలములకనురూపుఁడైన
వరునకీక కన్నియఁదనవలచినట్ల
తగనివానికినిచ్చుటధర్మదేవ
తాతినూభవబ్రహ్మహత్యాసమంబు॥

పతిభరించువాఁడుగావున భర్తయగును. స్త్రీభరింపఁబడునది గావునభార్యయయ్యెను. పెండ్లియైనతర్వాత సతికి పతియేప్రభువగుటచే, నాతఁడే దైవమనుచు నతనిమనస్సునకు సంతోషమగునట్లు దేవపితృతిథిపూజాదిగృహకార్యములందదితోడుపడుచుండవలయును. అట్టిసతియే పతివ్రతయగును. అది పతికిని దనకును రెండులోకముల మేలుతెచ్చును.

అనుగుణ భార్యావంతుఁడగువాఁడు గృహస్థధర్మఫలమును సమగ్రముముగాఁబొందును. భార్యయనునది సామాన్యమై

నదికాదు. పూర్వము నలమహారాజు, తన భార్యయగు దమయంతిని పురంబులోనుండమని చెప్పి, తానేకతంబుగా నడవికి బోవనుద్యోగించిన నప్పుడా పతివ్రత యిట్లనియెను.

గీ॥ అఖిలదుఃఖరోగార్తున కౌషధంబు
సుసుచిరంబుగ భార్యయ చూవె యెందు
నొనర భార్యాసమేతుఁడై యున్నవాని
కెంతలాపదలయ్యును నెఱుకపడవు.

క॥ అలయునెవఁ డయ్యు నెడ నాఁ
కలియుఁ దృషయునైన యెడలఁ గడుకొని ధరణీ
తలనాథ! పురుషునకు ని
మ్మలభార్యయుపాచుఁ జిత్తమున దుఃఖంబుల్॥

ధర్మార్థకామసాధనమునకుఁ ఉపకరణమువంటిదియు, గృహనీతివిద్య కాకరమైనదియు, గౌరవంబునకుఁ గారణమైనదియు, నన్వయవృద్ధికి మూలమైనదియు, నాపదలకెల్ల మందు నంటిదియు, హృదయసంతోషమునకు హేతువైనదియునైన, భార్యయొక్క మహిమను బొగడ నెవ్వరితరమగును? అట్టి భార్యఋణమును బురుషుఁడు వేయిజన్మములకైనఁ దీర్పఁ జాలునా? భార్యను దిరస్కరించు దుర్జనునకు నిహపరంబులు రెండును జెడును. నిజభార్యయందాసక్తి కల్గి దానికిసంతోషము గల్గించువిధముగా నడుచుకొనువాడు సర్వశుభములను బొందును.

## (4) స్త్రీలకు బతిభక్తియే పరమభూషణము.

తొల్లి నిషధదేశాధీశ్వరుండైన నలుడను ధరణీపతిపుష్క

రునితో జూదమాడి తనరాజ్యమంతయు నతనిచే నోటువడి భార్యయగు దమయంతితో నడవికిఁ బోయెను. భార్యపడు కష్టములనుజూడఁజాలక నలుఁడు దానినొంటరిగా నడవిలోవిడచి పోవఁగా, నప్పతివ్రత చేదిదేశమునకు రాజైన సుబాహుపురంబునకుఁ బోయి, యంతఃపురంబులో వ్రతములుసల్పుచు సైరంధ్రి యను పేరుతో వర్తిల్లుచుండెను.

ఇట్లుండగా. దమయంతీదేవితండ్రి భీముఁడను రాజు, నలునకైన కష్టమునువిని, కూతురు నల్లుఁడు నెక్కడకుఁ బోయిరో, యెచ్చటనున్నవారోయని, శోకమును బొంది వారింగనుఁగొనుటకై కొందఱుబ్రాహ్మణులంబనిచెను. వారు జగమెల్ల సంచరించి నగరగ్రామము లెల్ల వెదకిచూచిరి. అందు సుదేవుఁడను బ్రాహ్మణుఁడు సుబాహుపురంబునకుఁజని, పుణ్యాహంబు సేయింపఁబోవు బ్రాహ్మణులతో రాజగృహంబు సొచ్చి,యంతఃపురంబులోనున్న సైరంధ్రిఁ జూచి, యీఁడయే దమయంతియగు నని కొన్నికారణములచే నిశ్చయించి తనలోనిట్లనుకొనియెను. “ఆహా! ఈదమయంతిపొగగప్పిననిప్పుపోల్కియు, నీలమేఘముచే మాటువడిన చంద్రరేఖవలెను, బురదలోమునిఁగిన తామర పువ్వురీతియు ప్రకాశింపకున్నది ఇది పురుషునిబాసి యుండుట చేతను, ఉపవాసములుండుటచేతనుమిక్కిలి కుంది డస్సి, కమలములులేని కమలాకరమువలెను, శుష్కప్రవాహమైన నది చాడ్పునను జూచుట కొప్పకున్నను, దనపతివ్రతాత్వంబున మిక్కిలి యొప్పుచున్నది గదా? స్త్రీలకుఁ బాతివ్రత్యమే శ్రేష్ఠమైనభూషణము. అదిమిక్కిలి కాంతిగల సొమ్ము. దానినెవ్వరపహరింపలేరు

తే॥ అనపహార్యంబు తేజోమయంబుసర్వ
గుణములకు నలంకారంబు గురుతరంబు
భామలకుఁ బతిభక్తియ పరమమైన
భూషణంబిట్టివే పెరభూషణములు"

అనియిట్లా బ్రాహ్మణుఁడు దమయంతియొక్క పాతివ్రత్యనిష్ఠకుసంతోషించి, దానితో సంభాషించి చనియెను. పతిని దైవముగా భావించి యతనినిష్కపటతఁ గొల్చుటయే స్త్రీలకు ముఖ్యమైన ధర్మము. పాతివ్రత్యముగల స్త్రీ దైవము వంటిది. దానికిఁ బడయరాని సుఖము లేజగంబులోను లేదు. భర్త దుర్మార్గుఁడైనను భార్యవానిని దనపాతివ్రత్య మహిమచే బుణ్యాత్ముని జేసి మనుపవలయును.

— ... —

ద్రౌపదిసత్యభామకుఁ జెప్పిన
పతివ్రతా ధర్మములు.

పాండవులు వనంబులోనున్నపుడు వారిం జూచుటకై శ్రీకృష్ణమూర్తి ద్వారకానగరములోనుండి సత్యభామాసహితుడై వచ్చెను. కృష్ణుఁడును ధర్మరాజాదులును మునులగోష్ఠి దగిలి పుణ్యకథాశ్రవణంబు చేయుచుండగా, నొక్కదినము పాంచాలియు గృష్ణుని భార్యమైనసత్యభామయు, నేకాంతమునసరసల్లాపము లాడుచుండిరి. అప్పుడు సత్యభామ ద్రౌపదిం జూచి యిట్లనియె "ఓపుణ్యాంగనా తిలకమా! ప్రకట తేజులైన నీభర్తలేవురును నీకువశ్యులై సంచరించుచున్నారు. ఒకరికంటె మఱియొకఁడు నీయెడ స్నేహమును బ్రేమయును జూపగడంగుచుందురు. ఇది నీపూర్వజన్మాంతరములోఁ జేసిన వ్రతములయొక్క

మహిమనా, లేక మంత్రతంత్రౌషధ వైభవమా? అట్లుగాదేని నీరూప లావణ్యాతిశయములును, నీవువారికిఁ గావించుపనుల నేర్పును దీనికిఁ గారణమగునా? నీకీప్రభావ మెట్లయ్యెను? నాకె ఱింగించినయెడల నేను నట్లుచేసి, యాకృష్ణుని నాకు వశ్యునిగా జేసుకొందును''

సత్యభామయట్లు తన్ను సామాన్యదుష్ట వనితలవలెనెంచి యవివేకముగఁ బ్రశ్నించినందులకు మనస్సులో గోపమును జెందినను, ద్రౌపదిదాని బయటికి చూపక యుంచుక యసహ్యామును దెలుపువల్కులతో నిట్లనియె. "సత్యభామా! నీవుమా కృష్ణుని భార్యయగుటచే నిన్ను నిందింపరాదు. ఎఱుగక నన్నట్లు ప్రశ్నించితివి. నానాథులు నాకెట్లువశ్యులైరో చెప్పెద వినుము. మంత్రతంత్రములచేత భర్తస్వాధీనమగునని తలఁచుట కంటె నవివేకము లేదు. దానిచే భర్తకుయుండుండిన ప్రేమయు నశించును. పురుషుఁడెఱింగిన యట్టిభార్యతో జేరియుండుట, సర్ప సహవాసముచేసిన విధమున భావించును.

చ॥ అలయక మంత్రతంత్రవివిధౌషధభంగులఁ జేసియెంతయున్
వలతురునాథులంటమగువా! కడుపేలతనంబు దానమున్
గలిగిన ప్రేమయున్ బోలియుఁగాని, యొకంతనుసిద్ధిఁబొందద
ప్పొలతులతోడిమన్కి యహిపొత్తుగఁజూచు విభుండెఱింగినన్

చ॥ మగునయొనర్చువశ్యవిధిమందులుమాయలునొందు చందమై
మగనికిఁ దెచ్చురోగములుమానక మూకజడాదిభావముల్
మొగినొనరించు,నద్దురితముల్ తనచేసినచేఁత లైతుదిన్
జగమున కెక్కునిందయునుసద్గతి హానియువచ్చునింతికిన్॥

కావునఁబతులకు నెప్పుడును కపటకర్మములు చేయ

రాదు. పతియొక్క భావము నెఱింగి దానికిఁ దగినవిధముగా నడచుకొనిన యెడల నతఁడు తనకు దాసవైఁబడి మరగును.' అని యిట్లు ద్రౌపదిమందులు మాయలు తంత్రములు మొదలైనవి పనికిరావనియు, సత్ప్రతిమభక్తితోఁ బురుషులకుబరిచర్యలు చేయుటవలననే వారు స్త్రీలకు లోనగుదురనియు నెఱిఁగించి, మఱియు సత్యభామతో నిట్లనియెను.

" ఓనారీమణీ! నేను పాండవులయెడ నెట్టి దాననై ప్రవర్తించి యిట్టిసౌభాగ్యమును బొందితినో, దానినీకు దెలియునట్లు చెప్పెదను వినుము. నాభర్తలే నాకు దైవములని భావించి వారికి నేకచిత్తంబునఁ బూజలు చేయుచుందును. వారునాయెడఁ గృపగలవారని మర్యాదతప్పి పలుకను. అహంకరింపను. భర్తలకంటె నన్యులైన వారెట్టివారైనను, వారిని దృణముతో సమానముగాఁ జూతును. భర్తలన్య స్త్రీలఁగూడినను, నేనాగ్రహమునుబొంది వారితో కలహింపను. వారికిఁ జేయవలసినట్టి యుపచారకృత్యము లెల్లను నేనేగావింతును. పలుమారు తలవాకిట నిలుచుటయు, దుష్టస్త్రీలతోఁగూడి కలహించుటయు, పెలుచగా నవ్వుటయు, మొదలగు నసత్ప్రవర్తనలు నాయెడ గలుగవు. భర్తలు దేశాంతరమునకు బోయియున్నప్పుడు పుష్పవస్త్రసుగంధభూషణాద్యలంకారము లెల్లమాని యుందుదును. నాయత్త కుంతీమహాదేవియెడ భక్తికల్గి నాయమ చెప్పినవిధముగాఁ జేటికావృత్తము లాచరించుచుందును. దేవపూజలు అతిథిపూజలు మొదలైనవానిని శ్రద్ధయు భక్తియుగల్గి నేనే నడపుదును. ధర్మరాజునింట ననేకపరిచారకులు, సేవకులునున్నను, వారికార్యము లెల్ల నేనే యరయుచు వారికి వేతనము లిచ్చుచుందును. చతురంగ

సైన్యముల సంరక్షణ నేనే చేయుదును. ఇంతమాటలేల? అన్ని కార్యములును, నేనే ప్రమాదమును బొందక చేయుచుందును. మహాత్ములైన పాండవులు తమ గృహకార్యభారమెల్లను నాయందు నిల్పి, తాము నిర్భరులై స్వేచ్ఛగా ప్రవర్తించుచుందురు. అమ్మా! జాముప్రొద్దు గలిగి యుండగనే మేల్కాంచి గృహకృత్యములందు ప్రవర్తింతును. నేను చేయు కార్యములవలన నాకాహార నిద్రలకుం గూడ నవకాశము కలుగదు. ఇట్టి ప్రవర్తనల చే నేను పాండవుల దయకుం బాత్రమైతినిగాని, నీవు చెప్పినట్టి మందులు మాయలు, మంత్రము లింద్రజాలములు, మొదలైనవి యే నెఱుంగను."

అనిన సత్యభామకు లజ్జయును దుఃఖమును గలిగెను. ద్రౌపదిం జూచి "అమ్మా! నేను తెలియక యడిగినదానికి సహింపు"మని వేడుకొనెను. ద్రౌపది నవ్వుచు దానిం దగినట్లుగా సంభావించి యిట్లనియె. "ఓ కృష్ణప్రియా! నీకు కృష్ణుని ప్రేమను సంపాదించుటకు మార్గము జెప్పెద వినుము. స్త్రీలకుం బతికంటె నన్యమైన దైవము లేదు. ఆ పతికి దయగల్గువిధముగా సతి మనస్సెఱిగి సంచరింప వలయును. పతికి దయగల్గెనేని భార్యకు భూషణాద్యలంకార ద్రవ్యములును, ధనధాన్య కీర్తిగౌరవంబులును, సంతానమును సద్గతియును గలుగును. వేఱువిధమున వీని నెల్ల పడయుటకు సాధ్యము కాదు. లోకములో మిక్కిలి కష్టము పడినగాని జనులకు సుఖములు గలుగవు. పుణ్యలోకములు గలుగవు. భర్తృశుశ్రూషను జేయు పుణ్యసతికి ననాయాసంబుగం బుణ్యలోకంబులు కలుగును. కావున నిత్యమును నీవు భర్తృశుశ్రూషలు సల్పుము. కృష్ణుండంతిపురమునకు వచ్చినతోడనే యాసనా

ద్యుపచారములు గావింప నన్యులనియమింపక, నీవే వానినెల్ల చేయుము. కృష్ణుడేదేని రహస్యముగా నీతోఁ జెప్పినయెడల దాని వెలిఁబుచ్చకుము. అట్లు చెప్పినచో నీసవతులు నీమీఁద విరసమైన బుద్ధిగలవారగుదురు. నీభర్తకు ప్రియులైన బంధుమిత్రుల నాద రింపుము. ఆతనికి విరోధులైనవారు నీకాప్తజనులైనను, వారిని జేరనివ్వకుము. కులవతులును, నిర్మలమతులును, పతివ్రతలును నైన స్త్రీలంగూడుము. దుష్టస్త్రీసహవాసంబు విడువుము. ఇది యే నీకుఁ బరమసౌభాగ్యమునకు మూలము."

అనియిట్లు ద్రౌపదిహితోపదేశము జేయఁగా సత్యభామ విని సంతుష్టహృదయయై, ద్రౌపదింబొగడి దానితో "అమ్మా! నీవుప్రకటపుణ్యశీలవు. నీభర్తలు దేవతాసములు. సకలగుణసంప న్నులు నీవెప్పటియట్ల భర్తలతో రాజ్యములో సుఖముగా నుండు దువు. దుఃఖింపకుండు" మనిపల్కి దాని నాశ్వాసించెను. అంతలో శ్రీకృష్ణమూర్తి పాండవులవీడ్కొని ప్రయాణ మగుటనుజూచి, ద్రౌపదీదేవినిసత్యభామ గౌఁగలించుకొని, సగౌరవముగా వీడ్కొని కృష్ణునితో రథంబెక్కి ద్వారకాపురంబునకు జనియెను,

ఉ॥ అత్తకు భక్తిగల్గి తగనాయమ సెప్పినమాడ్కిఁ జేటికా
వృత్తములాచరింతు గురువిప్రసురాతిథిపూజనంబుల
త్యుత్తమభక్తి నేనతగనోపియొనర్తు బ్రియంబుఁ దాల్మియున్
మెత్తదనంబు సంతతము మేలుగఁ దాల్తు సమస్తభంగులన్॥

## 6 పార్వతిశివునకుఁ బతివ్రతాధర్మము ఎఱిఁగించుట.

పూర్వము శివుఁడును పార్వతీదేవియు లోకహితార్థమై ధర్మార్థకలితముగా సంవాదము చేసిరి. దానికే యుమామహేశ్వరసంవాదమని పేరు. అది యితిహాసరూపమున జగములో నారదమహర్షిచే వ్యాప్తమయ్యెను. శివుఁడు తన భార్యకుఁ బలుతెఱఁగులైన ధర్మము లెఱింగించి "మగువా! నీవు దేవతాస్త్రీలలో ముఖ్యసకుఁ బాత్రమైనట్టి మహిమను గలదానవు. చతురవివేకవైభవముగలదానవు, నీచే స్త్రీధర్మములు వినవలయునని తలంపు నాకుఁ గలదు. వానినాకెఱిఁగింపు"మని యడిగెను. పార్వతియప్పుడు సింధుయమునాగంగాకావేరిగోదావరీకృష్ణవేణీనర్మదమొదలైన నదులు స్త్రీరూపులై పరివేష్టించి యుండినందున, వారింగనుంగొని "ఈశ్వరుఁడు నన్నడుగుచున్నాఁడు. ఏమని చెప్పుదును? మీలో నెవ్వరైన జెప్పెదరా?" యనియడుగ, వారెల్ల "నీకంటె మే మెఱుగుదుమే? నీకుఁ బోలినవిధముగా స్త్రీధర్మము లెఱింగింపు"మనిరి. పార్వతియట్లు నాథునిచేతను, చెలియలచేతను వేఁడుకొనఁబడినదై శివునకంగనాధర్మములు చెప్పనారంభించెను. దేవతలును మునులును వానినెల్ల వినుటకై పార్వతీదేవి వెనుక వచ్చి నిల్చియుండిరి.

పార్వతి సిగ్గుతోఁ దలవంచియెత్తి, ప్రసన్నచిత్తయై యుందఱు వినఁగా మహాదేవునితో మృదూక్తుల నిట్లనియె. దేవా! నీవెఱుఁగని ధర్మములు గలదా? నీప్రసాదముచే నాకుదయించిన యెఱుకచే నాకుదోఁచెడు స్త్రీధర్మములు చెప్పెదను. ముఖ్యముగా బతికి ననుకూలవతి యగుటయే గృహిణికి ధర్మమగును. పతిమతమునకు విరోధముగా నడచుటయును, పతియాజ్ఞ లేక ధర్మములు

చేయుటయును నిష్ప్రయోజనమైన కార్యములగును. నాథుఁడు సంతోషపడునట్లాతనికి వలసిన వంటకములు వండి పెట్టుటయు, బరిచర్యలు చేయుటయు, నతనికిష్టమైనవిధమున నడచుటయు, నాతికి ధర్మములై నవి. పనులయెడ మాఱుపలుక కూడదు. పతియే దైనకార్యములు చేయమఱచిన, వానిని దలపించవలయును, సవతులుఁగల్గినను వారితోఁ బోరాడక పతియిచ్చ కనురూపముగాఁ బ్రవర్తింపవలయును.

క॥ సవతాలికిఁబతివలచిన
నవుగాకని యతినియిచ్ఛ కనురూపముగాఁ
దవిరి నడుచు సతిదైవము
శివయుచితగునెల్లజనము చేమ్రొక్కఁగొనన్॥

పురుషుఁడే దేనివస్తువ్రులిచ్చిన యెడల దానింబుచ్చుకొని యడిగినప్పుడు మఱల దానినకపటప్రీతితోఁ దెచ్చియిచ్చుట మంచిది. స్త్రీలకుఁ గొడుకులతోనైనను నేకాంతస్థలమునయుండుటయు, నేకాసనముపై నుండుటయును దగదు. పతియెట్టివాఁడైనను వానియందేభక్తివిశ్వాసములుగల్గి యుండవలయును. కలవాఁడు, లేనివాఁడు, రూపముగలవాడు రూపహీనుఁడని యిట్లు వ్యత్యాసముగా నెంచక పతియెట్టివాఁడైనను వానినే దైవముగాఁ గొనియాడునట్టిభార్య పరమపతివ్రత యగును.

క॥ గతిపతియ చువ్వెభార్యకు
నతనిఁగడచినట్టి సత్పరాయణముకృపా
యుత! కలదే? కావునఁదా
నతనికిభక్తయగుటిచ్చు నఖలశుభంబుల్॥

పరమేశా! వినుము. ఆసురియనియు, పైశాచియనియు, రా

క్షసియనియు, నధర్మాంగనలకు బేర్లుగలవు. వారెల్ల దుష్టస్వభావముగలవారు. భర్తయందు స్నేహము లేకుందురు. తమ కిచ్చకువచ్చినట్లు చరింతురు. గృహకార్యములందు నేర్పరులుగారు. కలహప్రియులై దుష్టస్త్రీలంగూడుదురు. రాక్షసియను నదికక్రూరముగాఁ బ్రవర్తించును. పైశాచియనునట్టిది కోపముగలదై భర్తృపుత్త్రులయందు స్నేహము లేకుండును. పైజాతి స్త్రీలకు లజ్జలేక తిరుగుటయు, బొంకులు పలుకుటయు, నెప్పుడు నిద్రపోవుటయు, సహజమైన గుణములు. ఈదుర్వృత్తులుగల స్త్రీలు, తమనాథు కులంబువారిని దురితములపాలుచేసి, నరకమునకుఁ బోవుదురు. మొదట దుశ్చరితలై యుండినను తర్వాత బుద్ధిమంతులై పతిభక్తిగల్గి ప్రవర్తించినయడల, వారుముందు చేసిన పాపములనుండి విడువఁబడినవారై తమపురుషులతో స్వర్గలోక సుఖములనుభవింతురు."

అనియిట్లు శైలతనయ శూలికి స్త్రీనడవడిక లెఱింగించి « నాథా! నాకుఁదెలిసినవానింగొన్ని చెప్పితిని. నాతప్పుసైరింపవలయు"నని వేఁడుకొనగా, నప్పుడు శివుఁడును మునులును దేవతా స్త్రీజనంబులును నంతోషించి పార్వతిని బొగడి, తమతమ నివాసనలములకుఁబోయిరి.

సీ॥ "నిలయంబు వాటించి నిర్మలదేహియై
శృంగారమేర్పాడ్పుఁ జేయవలయు,
సత్యప్రియాలాప చతురయై ప్రాణేశు
చిత్తంబు ప్రేమ రంజింపవలయు,
దాక్షిణ్యసంతోష ధర్మమేధాదుల
దైవతమనిప్రియుఁ దలఁపవలయు,

నాథుఁడేపద్ధతి నడచునాపద్ధతి
నడచి సద్బంధుల నడపవలయు,
ఆ॥ మార్గవమునఁబతికి మజ్జనభోజన
శయనపానరతులు జరపవలయు
విభుఁడుపతితుఁడైన వెలదిపాతివ్రత్య
మహిమఁబుణ్యుఁ జేసి మనుపవలయు"॥

## IV నివృత్తి ధర్మములు.

### జ్ఞానభక్తి వైరాగ్యములు.

### 1 మేధావియను బ్రాహ్మణ కుమారుఁడు తండ్రితో సంవాదము చేసిన విధము.

పూర్వము ధర్మరాజు భీష్మాచార్యుంజూచి "ఓ మహానుభావా! మనుష్యులకెన్ని కొనుచుండగా నాయువు తీరుచున్నది. వారేమి చేయుటనుంచిది? నాకెఱిఁగింపవే" యనియడిగిన, నద్ధరణీపతికి సురనదీతనయుం డిట్లనియె. "ఓమహీపతీ! నీవుపితాపుత్ర సంవాదమను నితిహాసమును వినుము. దాన నీయడిగిన విషయము తేటపడును. పూర్వము వేదవిదుండైన యొకబ్రాహ్మణుని కుమారుఁడు మేధావియనువాఁడు, నీవునన్నడిగినట్లు తనతండ్రి నడుగఁగా, నవ్విప్రుఁడు కొడుకునకిట్లనియెను. "కుమారా! మొదట బ్రహ్మచారియైయుండి గురుకులవాసము చేసి, పలుచదువులుచదివి, తర్వాతనరుఁడు వివాహమై పుత్రులంబడసి గృహస్థాశ్రమనిరతుఁడై యతిథి పూజాది సత్కార్యములు చేయవలయును. తర్వాత వనంబులోనికిఁజని సర్వసంగపరిత్యాగము చేసి

తపస్సునల్ప సద్గతిని జెందవలయు."

అనిన తండ్రికప్పుడు పుత్రుఁడిట్లనియె "తండ్రీ! నీకుఁ గొంతకాలంబు కలట్లు పలుకుచున్నావు. మనుష్యులు స్త్రీగర్భములోఁ బ్రవేశించినది మొదలుగా వారిని గొనిపోవ మృత్యుదేవత యత్నించుచుండును. మృత్యువు దుర్నివారమైనది. ఎట్టివారినైననుహరించును. మనుష్యుఁడు చేయుపనికై యోర్చియుండునా?

గీ॥ జరయుమరణంబుమృత్యునిజన్మమాది
గాగవెనువెంటఁదగులునంగంబువేచి
యొల్లిచేసెదననకమేలిపుడుచేయు
మనఘయోర్చునెమృత్యువు మనుజుపనుల॥

కావుననో తండ్రీ! యడవిలో నిద్రించుచున్నవానిఁ బులికొనిపోవునట్లును, మీనువలతిన్నఁ బోదుపుట యెఱుఁగక వలలో సంచరించు విధముగాను, మనుష్యుడుసంసారములోఁ జిక్కి వెలువడనుపాయముగానక తుదకు నశించును. సంసారమునది మృత్యువునకుఁ బట్టైనది. సర్వసంగములు విడుచుట మోక్షమునకు హేతువగును. ప్రజలు బడయుటచేతనే సద్గతులు కలుగునని తలఁపవలదు. ఏలనఁగా నొకదీపము నుండి వేఱొకదీపము వెలుఁగఁ జేయబడు విధముగా, తండ్రియే నిజకాంతిచేఁ బుత్రుఁడై జనించుచున్నాఁడని శాస్త్రములు చెప్పుచున్నవి. కావున నన్నునేన కనుఁగొనుచుండిన యెడల నది బంధమోక్షము గావించును. మనస్సు, వాక్కును, గాయమును వశ్యములు గావించుకొని, యేకాంతస్థలములోనుండి నిన్ను నీవ కనుఁగొనుచుండుము. కామమును, గ్రోధమును వదలి చిత్తమేకముఖంబుగా జేసి

యాత్మారాముండవగుము. అదియే నీకు మేలైన మార్గము. అట్లుగాక సంసార సక్తుండైనచో నింకిపోవుచున్న మడుగులోని చేంపవలె నీవు చెడుదువు''

అనియిట్లు కొడుకుపదేశింపంగా జనకుండట్లు చేసి సౌఖ్యమును బొందెను. కావున ధర్మనందనా! మనుష్యులకేండ్లు వేగముగాం జనుచుండుటచేం గర్తవ్యాకర్తవ్యము లెఱింగి సంసారములోం దగులుపడక సర్వసంగ పరిత్యాగరూపమైన తపస్సును సలిపి దానం బరమాత్మను దర్శింపవలయును. అదియేయుత్తమమైన మార్గము.''

2 మోక్షమనగా నేమి ? అదియెట్లు లభించును?

పూర్వమర్జునుండు కృష్ణపరమాత్మునిజూచి "ఓమహాపురుషా! జనులు సకల ధర్మములలో మోక్షధర్మము మేలని చెప్పుదురు. మోక్షమనంగా నేమి? అదియెట్లు చొప్పడును? నాకు విశదముగాం జెప్పవే''యని ప్రార్థించిన నయ్యాది దేవుండిట్లనియెను.

పార్థా! వినుము, బ్రహ్మాది తృణపర్యంతము వఱకు గల సకల భూతములును పూర్వ కర్మములకు దగిన విధముగా జనించి, కర్మములయందు ప్రవర్తించుచు, దుదకు నశించును. జననమరణములకు హేతువై యుండునది కర్మయనంబడును. అది పుణ్యపాపరూపమై శుభాశుభములైన ఫలములొసంగును. వాని ననుభవించుటకై జన్మలు కలుగు చుండును.

అ॥ "కర్మవశతంజూవె కలుగు దేహము దేహ

వర్తనంబుకర్మ వశగతిఁబు
దేహపాతమైన దేహస్థుఁడగుజీవుఁ
డరుగుఁగర్మవిహితమైనయెడకు॥"

ఈప్రకారము జీవుఁడు దేహబంధము వదలలేక దేవమనుష్య పశ్వాది యోనులందు పుట్టుచుఁ జచ్చుచు, సంసారమను సముద్రములో మునుగుచుఁ దేలుచు, దానినుండి వెలువడి తీరము చేరుటకుపాయ మెఱుఁగక భ్రమించుచుండును.

చ॥ స్థిరనుగుపుణ్యకర్మమున దేవభవంబగుఁబుణ్యపాపసం
కరమునమానుషత్వమగుఁ గల్మషముల్ పశుకీటభావముం
బొరయుఁగఁ జేయునిప్పగిదిఁబుట్టుచుఁజచ్చుచుమోహవార్ధిలోఁ
దిరుగుచునుండుగానియొక తీరముసేరఁడుజీవుఁడెన్నఁడున్॥

ఓశాంతేయా! భూతములిట్లు సంతతము జననమరణాదులందుఁ గర్మవశంబునం జిక్కి కట్టువడియుండుటకే సంసారబంధమని చెప్పుదురు. దానినుండితప్పించుకొనుటయే మోక్షము.

ఈసంసారమును సముద్రమునకేగాక యొక పెద్దయశ్వత్థవృక్షమునకు [రావిచెట్టు] సరిపోల్చవచ్చును. ఆవృక్షమునకు సకలభూతాదియైన బ్రహ్మదేవుఁడు మూలము. వేదములందుఁ జెప్పబడినట్టి కామ్యకర్మములచే సంసారవృక్షము పెరుగుచుండునుగావున వేదంబులే దానిలోని యాకులగును. చెట్టుకొమ్మలు క్రింద మనుష్యపశ్వాదిభూతములుగాను, మీఁదుగా దేవాదిభూతములుగాను వ్యాపించి, మఱియు కర్మను గుణముగాఁగ్రిందనుండి శాఖలనేకమై పులకు వ్యాపించి యున్నవి. ఈప్రకారముచతుర్ముఖాదియు, నజ్ఞానప్రతిష్ఠితయును, దేవమనుష్యతిర్యక్స్థావరాది భూతశాఖోపశాఖయునై తనరుచున్న సంసారవృక్షము

యొక్క స్వరూపమును దెలిసికొనుటకు జనులకు శక్యముగా
కుండును. ఈసంసారవృక్షమును ఛేదించుటకు శస్త్రము కావల
యును, ఆశస్త్రమే యసంగమని చెప్పుదురు. అసంగమనఁగా దే
నిని నంటకుండుట, కలియకుండుట, కర్మఫలాదులందు వాంఛ
లేక కేవలకార్యభావముచే సర్వకర్మము లీశ్వరార్పణముగాఁ
జేయుట. ఈప్రకారము మనస్సును దేనిపైనను బోనీయక స
ర్వసంగ పరిత్యాగము చేయువారు సంసారవృక్షమును ఛేదింపఁ
గలరు. వారు జననమరణ రూపమైన సంసార బంధమునుండి
ముక్తులగుదురు. సర్వసంగములు విడుచుటకు ముందుగా నన్ను
భక్తితో శరణంబు వేడవలయును. నేనే ప్రాప్యుఁడనియు, నాచే
తనే జనులకు మోక్షము చొప్పడుననియు, దృఢంబుగా నమ్మి,
నన్ను నిశ్చలభక్తితోఁ గొల్చి పుణ్యాత్ములు ఫలసంగాదులు లేక
కర్మపరులై మోక్షమును గాంతురు. వారు మఱల జనింపరు.
వారికిఁ గర్మబంధములు గలుగవు. వారే మృత్యువును జయించిన
వారై నిత్యానందమునఁ దేలుచుందురు. మోక్షము బడయునం
తవఱకు జనులెల్లరు జననమరణాదులందుఁ బొల్పడి సంసారచక్ర
భ్రమణంబు చేయుచుందురు.

క॥ "నరుఁడెంత కాలమేనిన్
బరఁగంగా ముక్తపదము బడయక యుండుం
బురుషవర! యంత కాలము
హరిఁ బొరి నీభంగిఁ జావుఁ బుట్టువు నొందున్॥

కావున నో ధనంజయా! నీవు నాయందు భక్తి గల్గి నన్నే యా
శ్రయించి నాకుఁ బ్రియంబగు విధముగా నీకులోచితములగు
కృత్యములను దప్పక చేయుచుండుము. అట్లు చేసితి వేని నీకు

నాప్రసాదమున నచిరకాలముననే మోక్షముకలుగును. మోక్షము సంపాదించుటకు భక్తియే సులభమైన మార్గము. నాభక్తుడు నన్నేపొందును, నన్నుఁబొందినవానికి మఱల జన్మములు గలుగవు.''

3 భగవద్భక్తియే మోక్షోపాయములలో శ్రేష్ఠమైనదని ప్రహ్లాదుఁడు రాక్షసకుమారులకుఁ జెప్పుట.

పూర్వము హిరణ్యకశ్యపుఁడను రాక్షసరాజు తనపుత్రుఁడగు ప్రహ్లాదుఁడు హరియందు భక్తిగలవాఁడై చెడిపోవుచున్నాడని మూఢుఁడై తలఁచి, యతనితిక్కౌన రాక్షసకుమారులతోఁగూడ ధర్మార్థకామములను త్రివర్గసంబంధమైన పాఠములను నేర్చుకొనునట్లును, వారితోనాడుకొని సామాన్యబాలురవలె లోకవిషయములందు ప్రవర్తిల్లునట్లును నియమించెను. అయితే ప్రహ్లాదుఁడు బుద్ధిమంతుఁడు గనుక త్రివర్గసంబంధమైన పాఠములు త్తమపురుషార్థమైన మోక్షమును గావింపనేరవని వగచి, తోడిబాలురనెల్లరప్పించి, వారితో నేకాంతమున నిట్లనియెను.

"అయ్యో! బాలకులారా! మనగురువులు మనకు మోక్షమార్గమును దెలుపక సంసార బంధహేతువైనట్టి త్రివర్గ పాఠములు నేర్పి మనలను మోసపుచ్చుచున్నారు. మనకు రాక్షసులతోడి సహవాసము కూడదు. వారు రజస్తమోగుణ దూషితులు. విషయాదులందు దగిలిన మనస్సుగలవారు. వారికి హరిభజనంబు పట్టువడదు. హరిసర్వాంతరాత్ముఁడు, సర్వభూతప్రియుడు, సర్వసముండు, అతఁడుభక్తవత్సలుఁడగుటచే నతనిం బొంది

భక్తిచేయువారికి సర్వశుభంబులు గలుగుననుటకు సందేహము లేదు. మనము మోక్షార్థులమై యతనిం భజియింపుదము.

ఆ॥ విషయసక్తులైన విబుధాహితులఁ గోడి
మనికినలరుచు ముక్తిమార్గ వాంఛ
నాదిదేవు విష్ణునాశ్రయింపుదుము స
త్సంగజనులఁ గూడి శాశ్వతముగ॥

భగవద్భక్తిమార్గ మెఱిగించు గురువుల సేవించుటయు, హరికి సర్వలాభసమర్పణంబు చేయుటయు, సాధుభక్తజనసంగతియు, నీశ్వరారాధనంబును, హరితత్పరతయు, వాసుదేవచరణారవింద యుగళస్మరణంబును మొదలగు ముఖ్యములైన భాగవత ధర్మములందు రతిగలిగి ప్రవర్తించినయెడల మనకు విష్ణుదేవుని యందు స్థిరమగు భక్తిసిద్ధించును. దానసతనిసులభముగాఁ బొందవచ్చును. మనుష్యులకు వ్రతదానతపశ్శౌచశీలాదులకంటెను భక్తిచేతనే విష్ణుదేవుని సులభముగా సందర్శింపవచ్చును.

క॥ చిక్కఁడు వ్రతములఁ గ్రతువులఁ
జిక్కఁడు దానముల శౌచశీలతపముల్
జిక్కఁడు వ్యుత్పత్తిని భక్తినిఁ
జిక్కినక్రియ నచ్యుతుండు సిద్ధముసుండీ॥

క॥ విత్తము సంసృతిపటలము
వృత్తము కామాదివైరివర్గంబుల నే
డిత్తము చిత్తము హరికినిఁ
జొత్తము నిర్వాణపదము శుభమగు మనకున్॥

అనియిట్లు రహస్యంబుగా రక్కసబాలురకెల్ల భగవద్భక్తిమార్గముయొక్క మేలిమిని, పరమభాగవతోత్తముఁడగు ప్రహ్లాదుఁ

పెఱిఁగింప, వారట్లు మోక్షాసక్తులై హరిభజనపరులై వెలసిరి.

## (4) వేదవ్యాసుఁడు శుకునకుపదేశించిన విరక్తిమార్గము.

పూర్వమొకప్పుడు ధర్మరాజు భీష్మాచార్యులనుఁజూచి "ఆచార్యోత్తమా! శుకునకు వైరాగ్యమెట్లు కలిగెను. అతఁడెట్లుముక్తినిఁబొందె"నని యడుగ, నయ్యవనీపతికి గాంగేయుఁడిట్లనియె. "ఓధర్మనందనా! తనపుత్త్రుఁడు శుకుఁడు లోకసామాన్యబాలురవలె, జననమరణాదుల వలని బాధయెఱుఁగ నేరక కామ్యవర్తనలందుఁ దగిలియుండుటనుఁజూచి, యొక్కనాఁడు వేదవ్యాసమహర్షి యాతనితోనిట్లనియెను.

"తండ్రీ! లోకవృత్తములలోఁదగిలి మృత్యువువలనిభయమెఱుఁగకున్ననిన్ను నేమనగలను? నరుఁడు కామాసక్తుఁడై యుండఁగా, నడవిలో నేమఱియున్న మృగమును బులికొనిపోవురీతిగా మృత్యుదేవుఁడువాని నపహరించును. నీవామూఢునివలె గాకుము. పంజరములోఁబెట్టియుండు పక్షిచందముగా నీదేహమందు జీవుఁడు బంధింపబడియున్నాఁడు. దినములను లెక్కపెట్టుకొనుచుండగా సంవత్సరములు గడచిపోవును, ఆయువు తగ్గును. దేహములోఁ జిక్కినజీవునకు మోక్షమును సంపాదింపనుపాయమెఱుఁగక నిద్రామోహముల దగిలి యేమఱియుండరాదు. సంసారసుఖములు శాశ్వతములుగావు. కలలోననుభవించిన మాడ్కియగును. బుద్ధిమంతులగువారు నాస్తికులను దుర్మార్గులనుఁబొందక సజ్జనసాంగత్యముచేయుచు, తమతమవర్ణాశ్రమ ధర్మముల

ము నడపుచు, శాంతులగు పెద్దలను సేవింపుచు, వారు చెప్పెడు ధర్మములనువిని యవ్విధము ప్రవర్తించి మంచిగతి బొందుచుందురు. కుమారా! ఈసంసారమనునది సముద్రమువంటిది. ఇంద్రియములేనీళ్లు, కామక్రోధాది దుర్గుణములే దానిలోని మొసళ్లవంటివి. అట్టిసంసారసాగరమునునీవుధైర్యమనునోడను నాధారముగాఁజేసుకొని దాటవలయును. అట్లుగాక కామాదిసక్తుఁడవైతేని నీకుఁజేటువాటిల్లును.

వత్సా! నీకుబంధువులపై మమతయు నభిమానరూపంబగు మోహంబునువలదు. మృత్యువును బంధువులెల్లరు వారింపగలరా? నీకునీవేచుట్టము. నీవాచరించు పుణ్యపాపములేనిన్ను వెంబడించును. కావుననీవు బంధువులపై మోహంబువదలి, కామాదిశత్రువులచే వంచింపబడక, ముక్తిమార్గమెద్దియోదాని నెఱిఁగి యవ్విధంబాచరింపుము. ఈమనుష్యజన్మము ముక్తిని బొందుటకు సోపానమువంటిది. అదిపశ్వాదిజన్మములకంటె శ్రేష్ఠమైనది. దానింగన్నవాఁడు మఱల నీచపుపుట్టువులు రాకుండ సద్గతిని బొందయత్నింపవలయును''

క॥ మానుషముదుర్లభముసో
పానంబగునదివిముక్తిపథముగనుటకున్
దానిగనితొంటిచందము
రానీకసముద్యమమునఁబ్రాఁకఁగవలదే॥

అనియిట్లు శుకునకు బంధువులపై విరక్తియు సంసారముపై దగులమియుగల్గునట్టివల్కులు పల్కఁగా, నతఁడప్పుడే కదలి జనక మహారాజునాశ్రయించి, యతనిచే జ్ఞానోపదేశము గావించుకొని, యాత్మసిద్ధికై పూని సిద్ధుఁడయ్యెను. ఓధర్మనందనా!

ఆశుకునియొక్క చరిత్రమత్యద్భుతమైనది. అతనివైరాగ్యమును, తపశ్శక్తియు, నిశ్చలమనోధైర్యమును వర్ణింప నెవ్వరికిని దరముకాదు.

## (5) పరాశరముని జనకమహారాజునకు జ్ఞానోపదేశము చేసినవిధము.

జనకమహారాజునొద్దకుఁ బరాశరమునివర్యుఁడొకప్పుడు రాఁగా, నమ్మహీపతి మునిపతిచరణంబులకు మ్రొక్కి "ఓసంయమివర్యా! నాకుధర్మమార్గమెఱింగింపవలయు"నని ప్రార్థించెను. అప్పుడత్తపోనిధియిట్లనియె.

"భూపతీ! విత్తులోనుండి ఫలముగల్గువిధముగా మనుష్యులాచరించునట్టి కర్మలే సుఖదుఃఖములను బొందించును. నరుఁడు సుకృతియైనయెడలవానికి మేలుపై మేలుకలుగును; పాపకర్ముఁడైనయెడలదుఃఖముమీఁదదుఃఖమును, భయమునకు వెనుకభయమునుగలుగును. కావున నన్యాయమైనమార్గములు దొరిగినరులుపుణ్యవర్తనలందాసక్తులైయుండవలయును,సత్యమును శాంతియు, నింద్రియజయమునుగలవారు మహాపుణ్యులు, ఈగుణంబులు పడయరానియట్టి యాయువునుబడసిన యొడలికిఁ దొడవులువంటివి.

ఆ॥ పడయరానియాయువొడలికిఁగలిగినఁ
బాపకృతులదానిఁబడటఁగలుప
నగునె?పుణ్యవిధిసమాచరణములఁగై
సేయవలయుగాక చెలువుమిగుల॥"

"రాజేంద్రా! వినుము. మనుష్యుల జీవితమనిత్యమనియును, ధనాదులెల్లను శాశ్వతములు గావనియును మదిలోఁ దలఁచువాఁడు, పాపకృత్యములుచేసి పరులవంచించి ధనార్జనాదికృత్యములుచేయఁడు. కావున నీవుకొంతపాపమునుగలిగించునదియైనను, దానిచే ఫలమెక్కువ గల్గునుగదాయని తలఁచి చేయవలదు. స్వల్పఫలమునిచ్చునట్టిదైనను పుణ్యకార్యమునే చేయవలయును. ఆపదయైనను ధర్మమును విడువరాదు.

మనుష్యుని జన్మము తక్కినజన్మములకంటెను మేలైనది, ఏలనఁగా హీనజాతిలోజనించినవాఁడైనను దానధర్మాదిసత్కార్యములాచరించి, పశుకీటాదులకంటె సద్గతిని బొందవచ్చును.

క॥ మానుషజన్మము మేలది
హీనపుజాతినిజనించె నేనియునన్యం
బైనజననంబుకంటెను
దానను గతివడయనగుటఁ దత్త్వప్రవణా॥

కం॥ దానములపుణ్యతీర్థ
స్నానంబులనతిథిపూజనంబులనుఫలా
దాననిరతుండుగాకీ
మానుష్యముగారవించుమతినింద్యుఁడగున్॥

అనియిట్లు పరాశరమునివరేణ్యుఁడు జనకభూపతికి మానుషజన్మముయొక్క మేలిమియు, మనుష్యులకు ధర్మముపై ప్రీతి వదలరాదనియు, దానాది పరోపకారపరతయే మేలనియు వచింపనద్ధరణీపతిమునిచరణంబులకుఁ మ్రొక్కి మఱియు నిట్లనియె, "ఓ తాపసోత్తమా! మనుష్యులకు శత్రువులలో మేటియైనదేది?

వారికి దేనిచే మేలుగల్గును? వారుపొందదగినగొప్ప పదవి యేది?" అనినమునియిట్లనియెను.

"జనకమహీపతీ! మనుష్యులకు నజ్ఞానమనునది గొప్పశత్రువగును. అజ్ఞానముచేతనే నరులు కామాదిసక్తులై సంసారములోమునిగి యాత్మవిధమెఱుగలేక చెడుదురు. వారికన్ని యాపదలును గలుగుట కజ్ఞానమే కారణమగును. కావున నజ్ఞానమును తొలగించుటకై జ్ఞానార్జనము చేయవలయును. అదియే ముఖ్యమైనకార్యము. జ్ఞానము నరులకుఁ గన్నువంటిది. జ్ఞానములేనివాఁడు తనగృహంబులో నభ్యాసవశమున, తడువుకొని తిరుగుగ్రుడ్డివానివగిది సంసారములోఁ దిరుగుచు జన్మములనేకములుపొందుచు సుఖదుఃఖములను గుడుచు చుండును. జ్ఞానియైనవాఁడు సంసారసక్తుఁడుగాఁడు. వానిమనస్సును విషయాదులంటవు. వాఁడు లోకప్రవర్తనలందుఁ దగిలినను తామరాకుపైనుండు నీటిబొట్టువలెనుండును. నీటిపులుగు నీరుతోనుండియు నార్ద్రముగాదు. అవ్విధమే జ్ఞానిమెలగును. వానికేబంధములు లేవు. వాఁడు ప్రజ్ఞయనుగొప్ప మేడపైనెక్కి, క్రిందుగాచరించుచున్న సంసారసక్తులగు నరుల వర్తనలను జూచుచుండును. ప్రకృతితోఁ దనకునేవిధమైనసంగము లేకుండుటయెఱిఁగి తన్నుఁదాన కనుచుండునట్టి జ్ఞానికిగల్గు సంతోషమును, శాంతియు, సామాన్యజనులకు గలుగనేరదు. వాఁడేముక్తుఁడు వాఁడే బ్రహ్మవిదుఁడు, వానికిఁగల్గు దశయే మేలైనది.

మనుష్యుల కట్టిదశ యెట్లుకలుగునని యడిగెదవేని చెప్పెదవినుము. ఇంద్రియ నిగ్రహము చేయలేనివారికి సిద్ధిగలుగదు. కన్ను, ముక్కు, చెవి మొదలగు జ్ఞానకర్మేంద్రియములు

"మనుష్యుని నానావిధములైన క్రియలందు ప్రవర్తింపఁజేసి చిక్కులఁబెట్టును. వానిప్రవృత్తులనెఱిఁగి క్రమంబుగా మనస్సు నిలుకడచేసి వానిలాగవలయు. ఈమనస్సు యింద్రియమహిమలకుమూలమైనది. మనస్సుకంటెను పెద్దయైనదిబుద్ధి, కావున బుద్ధిగల్గిమనంబును బోనీక వశ్యము చేయువలయును. బుద్ధికంటెను శ్రేష్ఠమైనది కామము. లేక కోరిక. కోరికలుఁగలవాని బుద్ధిచెడును. వానిమనస్సును నింద్రియములును వశ్యములుగావు. కామమును శత్రువును జంపినవారు జితేంద్రియులై యాత్మజ్ఞానముచే భాసిల్లుదురు. కావున నాత్మజ్ఞానలాభమునకు విరోధమైనయింద్రియమనోబుద్ధులకంటెను గామమే గొప్పశత్రువుగా నెఱిఁగి దానిం జేనీయక, నిష్కాములై నిర్విషయస్పృహులై యున్న మహాత్ములకు బ్రహ్మజ్ఞానముకలుగును. వారేసుఖులు, వారే ముక్తులు వారేయాత్మవిదులు."

అనియిట్లు పరాశరసంయమివర్యుఁడు జనకమహారాజునకు జ్ఞానవైరాగ్యజనకంబులైన వాక్యంబులుపన్యసింప, నప్పుడమిఱేఁడుజ్ఞానమార్గావలంబియై నిత్యసుఖమును బొందెను.

గీ॥ "భూతములపుట్టు చేష్టయుఁబొలియుటయును
జూచునేడుపుగలవాఁడుచూడనేర్చు
మోక్షమార్గంబు చిత్తంబుమూఢమైన
సక్తుఁడగులోలగతినెట్లుముక్తిగలుగు?

సీ॥ కావునముక్తికిఁ గారణంబగుదాని
నేర్పడఁజెప్పెద నెఱిఁగికొనుము,
దానంబుశమమును దమమునుబ్రహ్మ
చర్యవ్రతంబును వ్రతరక్షణంబు,

దయయును బరధన దారవర్జనమును
నియమంబు నింద్రియ నిగ్రహంబు,
జననీజనక గురు జనపూజలును దేవ
తాతిథిపిత దేవతార్చనములు,
గీ॥ సత్యమును శౌచమును శుభసంవిధాన
నిరతియును ధైర్యమును శౌర్యనిరసరమ్ము
కలిమిపుణ్యవృత్తంబిదిగలుగునరుఁడు
"మొసయుపీనిమాతఁగఁ గానిమోక్షమునకు"

సమాప్తము.

# ధర్మప్రకాశిక.

## అభిప్రాయములు.

మీచే రచింపఁబడిన "ధర్మప్రకాశికను" సాంతముగాఁ జూచితిని. ఆర్యవిజ్ఞానపుఁ బ్రస్థానత్రయమనఁదగిన భారత భాగవత రామాయణములందలి ముఖ్యధర్మముల రాశీకరణ మొనర్చిన మీరాంధ్రలోకమునకు వంద్యులు. తిక్కనాది మహాకవుల సుప్రసిద్ధ పద్యముల నందందుఁ బొందుపఱచు పద్ధతి యాంధ్రకవిత్వమునందు యువకులకు నభిరుచి గూర్పఁగలదు. మీయాంధ్రభాషాభిమానము ప్రశంసనీయము. ఆర్యమతము, ఆర్యధర్మముల మఱపుగాంచిన ప్రస్తుత ఆంగ్లో, ఆంధ్రవిద్యార్థులకిట్టి గ్రంథమును పఠనీయముగా నొసఁగి మనపూర్వుల ధర్మాభిరతిని పునఃప్రతిష్ఠించుట విద్యాశాఖాధికారులకేమి పాఠశాలాధ్యక్షులకేమి విధ్యుక్తధర్మమని నాయభిప్రాయము. ఈచిన్నిపొత్తమునకాంధ్రలోకము చూపఁగల గౌరవము మీయాంధ్ర భాషావ్యవసాయమును బ్రోత్సహించుఁగాక;

నరసారావుపేట.
19—10—21

చావలి వెంకటకృష్ణయ్య
బి. ఏ. బి. యల్.

# OPINIONS.

I have gone through your work "Tharmaprakasika" and find it furnishes useful and instructive reading for boys of the IV, V & VI Forms. The book can be used as a Text book for Non Detailed study in these forms or as one for moral Instruction. The language is chaste and simple and worthy of the pupils' imitation. I congratulate you on your Publication.

M. VENKATRAMAYYA.
Headmaster
Municipal High school
Narasarowpet.

---

గ్రంథకర్తచే వ్రాయఁబడిన
యితరగ్రంథములు

| | | |
|---|---|---|
| (1) | సృష్టివిషయవార్తలు | రు 1-0-0 |
| (2) | జంతువిషయవార్తలు | 0-10-0 |
| (3) | బాలభారతము | 1-4-0 |
| (4) | ద్విపదభగవద్గీతలు | 1-0-0 |

2, 3, 4, త్వరలో వెలువడును.

☞ వలయువారు.

ఆర్, వెంకటేశ్వర్ అండు కంపెని ఆనందప్రెస్. మదరాసు వారికివ్రాసి తెప్పించుకొనవచ్చును.

---

10236